పరమవీరచక్రము

(పద్యకావ్యము)



వనం వేంకట వరప్రసాదరావు

పరమవీరచక్రము (పద్యకావ్యము)

రచన: వనం వేంకట వరప్రసాదరావు

Mobile: 9866805165
Mail: varaprasadchaitanyabharathi@gmail.com



సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం
ఏక మాపాత మధురం అన్య దాలోచనామృతం

చైతన్యభారతి- సాహితీ సాంస్కృతిక సంస్థ (Regd:7171/2000)
H.No. 12-127/1, శ్రీ నిలయము, కస్తూరిబాయి రోడ్, మధిర,
ఖమ్మం జిల్లా, తెలంగాణా - 507203

ప్రచురణ కర్త: చైతన్యభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ,
మధిర, ఖమ్మం జిల్లా

వెల: అమూల్యము

ముద్రణ: ప్రగతి ప్రింటర్స్, హైదరాబాద్

(1)



(2)



(3)



(4)



(5)



(6)



(7)



(8)



(9)



(10)



(11)



(12)



(13)



(14)



(15)



(16)



(17)



(18)



(19)



(20)



(21)






వనం వేంకట వరప్రసాదరావు, భారత జీవితబీమా సంస్థ, మధిర, ఖమ్మం జిల్లా, తెలంగాణలో వికాసాధికారిగా ఉద్యోగము. అనేక తెలుగు టీవీచానెళ్ళలో, ఆకాశవాణిలో, ధార్మిక, సాహిత్య కేంద్రాలలో ఆధ్యాత్మిక, సాహిత్య ఉపన్యాసకులు. పౌరాణిక, సాంఘిక నాటక రచయిత, నటుడు, దర్శకుడు, గేయరచయిత, ప్రయోక్త, కార్టూనిస్ట్. అనేక దినపత్రికలలో, ఆధ్యాత్మికపత్రికలలో అంతర్జాల తెలుగుపత్రికలలో ఆధ్యాత్మిక, సాహిత్య వ్యాసకర్త, కార్టూనిస్ట్.

- యితర రచనలు:-
- గేయాలు-గాయాలు (వచనకవితా సంపుటి)
- నాచ్చియార్ తిరుమొజి (ఆంధ్రానువాదం)
- తిరుప్పావై (ఆంధ్రానువాదం)
- గోదాకళ్యాణం(ఆముక్తమాల్యద నాటకీకరణ)
- భక్తప్రహ్లాద (పౌరాణిక పద్యనాటకం)
- మనుచరిత్రము (సాహిత్యవిమర్శ)
- వినాయకచరిత్ర(పద్యఖండిక)
- నీ స్మృతిలో (A..Tennyson's In Memoriam) ఆంధ్రానువాదము
- వేదాంతకేసరి (నాటిక)

- ఆముక్తమాల్యద (సాహిత్యవిమర్శ)
- శ్రావణ లక్ష్మి (పద్యఖండిక)
- మీరా భజనలు (గేయానువాదము)
- యజ్ఞఫలం (సాంఘిక నాటిక)
- ఎయిడ్స్ (సాంఘిక నాటిక)
- నిరీక్షణ(సాంఘిక నాటిక)
- రాగసాహితి (72 మేళకర్త రాగాల కృతులు)
- విముక్తి(సాంఘిక నాటిక)
- దశావతారాలు(పద్యఖండిక)
- యింకా అనేక సుప్రసిద్ధ హిందీ, ఆంగ్ల కవితల ఆంధ్రానువాదం

కృతి శ్రోత



శ్రీ వేంకటేశ్వరస్వామి, జమలాపురం, ఎర్రుపాలెం
మండలం, ఖమ్మం జిల్లా.

శ్రీకర! శ్రీముఖకుముదసు
ధాకర! సావిత్రి కంకితంబగు కావ్యం
బాకరముగ రసమయమగు
సోకుల పలుకులకు జేసి, శుభముల నిమ్మా! (కం)

నీరదనీలగాత్ర! నవనీరజ, మిత్ర, శశాంక నేత్ర! యో
వారిధిపుత్రికానిలయవక్ష! సుపక్ష విహార! శ్రీకరా!
వీరుల గాథ, లీ పరమవీరసుధారసధార నీదు లీ
లా రహి, వేంకటేశ! జమలాపురి వాసుద! నీకు వించితిన్! (ఉ)

పరమవీర చక్రము

భరతమాత వీరసుతుల బతుకుబాటల క్రమం,
భారతీయ మహిళల, వర సుతుల శౌర్య, పరాక్రమం!
ధర్మరక్షణకు తరలిన దామోదర చక్రం,
కర్మవీరుడా సిపాయి ధరియించే చక్రం!
పరమవీరచక్రం! పరమవీరచక్రం! పరమవీరచక్రం!

మనకొరకై తమ కదనం, తమకొరకై ఈ కథనం,
పొలికలనిక తమ సదనం, కదనకడలిలో మథనం,
అమృతం మన కిడుటకొరకు, అశ్రులు తమవారికొరకు!
అంజలితో అంకితమిది వారి ఆత్మశాంతికొరకు!
పరమవీరచక్రం! పరమవీరచక్రం! పరమవీరచక్రం!

తమవేదం మన మోదం, మనకు విందు వినోదం,
మన వెలుగులకొరకు చితులు, తమకై విలపించు సతులు,
మనవారికి దీపావళి, వారివారు శోకావళి!
నిండు మనసుతో వారికి నా గుండియదీ నివాళి!
పరమవీరచక్రం! పరమవీరచక్రం! పరమవీరచక్రం!

తెలుగు, తమిళ, మలయాళీ, ఒరియా, కన్నడ, గుజరాతీ,
మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బెంగాలీ, పంజాబీ,
హిందూ, ముస్లిం, క్రైస్తవ సిక్ఖులనే జాతి ప్రాంత
భేదమేమి లేదనేది, భారతీయ జవానుది!
పరమవీరచక్రం! పరమవీరచక్రం! పరమవీరచక్రం!

– వనం వేంకట వరప్రసాదరావు

కృతి గ్రహీత



శ్రీమతి సావిత్రీ బాయి ఖనోల్కర్
(ఈవ్ యువాన్ మా దే డిమారస్) పరమవీరచక్ర పతక రూపశిల్పి
భర్త 'మేజర్ జనరల్ విక్రం రాం జీ ఖనోల్కర్'తో

అంకితమిది యెకసతి, కక
ళంకితులగు దేశభక్తులగు సేనలకున్,
జంకుట లెరుగని సుతుల వ
శంకరమగు పరమవీర చక్రము నిడుటన్!(కం)

అంకితమిది సావిత్రికి,
అంకిత భారత ధరణికి ఆజీవనమున్,
కింకరుడను, తన శుభపద
పంకజముల మదిని నిల్పి భక్తిగ నిడెదన్!(కం)

సావిత్రి ఖనోల్కరు సతి
కిన్ వినతుల నిత్తు కదన కీర్తుల కథలన్,
జీవితములు భారతి పద
పావన పీఠిన విరులన బరచిన ఘనతల్!(కం)

ముందుమాట...

కొన్నేళ్ళ క్రితం ఒక తెలుగు టీవీ ఛానెల్ మిత్రులు ఏదైనా మంచి కార్యక్రమం చేద్దాము చెప్పండి అన్నప్పుడు, భారత సైనికుల గురించి, పరమవీరచక్రం గురించి యింతవరకూ తెలుగు టీవీ ఛానెల్ ఏదీ చేయలేదు, మనం చేద్దాము అన్నపుడు వారు సరే అన్నారు.

షాట్ డివిజన్ సహా కొన్ని ఎపిసోడ్స్ ప్లాన్ చేశాము. కార్యక్రమం ప్రోమో కూడా మొదలు పెట్టాము. 'పరమవీరచక్రం' అనే టైటిల్ సాంగ్ నేనే వ్రాసి, పాడించి, దాన్ని 'ప్రోమో'లో యివ్వడం కూడా మొదలైంది. దురదృష్టవశాత్తూ ఆ ఛానెల్ వారు ఇబ్బందుల్లో పడి, కార్యక్రమం ఆగిపోయింది.

ఆ తరువాత కూడా పరమవీరచక్రం పతకము వెనుక కథ నా మనసులో మెదులుతూనే ఉన్నది. 'ఫేస్ బుక్' లో సైనికుల మీద ఒక రోజు ఒక పద్యం వ్రాయడంతో పద్యకావ్య రూపములో మొత్తము వ్రాయాలనే కోరిక కలిగింది. వ్యక్తిగతమైన రకరకాల యిబ్బందులు, సంకట పరిస్థితులు, వృత్తిపరమైన, ప్రవృత్తిపరమైన యిబ్బందుల కారణంగా ఆలస్యము ఐంది, కానీ రచన నిదానముగానే అయినా కొనసాగింది.

ఈ పద్యకావ్య రచన మొదలు ఐన దగ్గరినుండీ నన్ను ఆదరించి, అభినందించి ప్రోత్సహించిన మిత్రులు ఎందరో. అందరికీ హృదయక పూర్వక ధన్యవాదాలు! మరియు కృతజ్ఞతలు.

సంస్కృతంలో మయూర మహాకవి పట్ల భక్తితో ' జారెడు యామినీ కరియచాయలు' 'కన్నుల చూడలేక' అనే రెండు పద్యాలు ఆయన 'సూర్యశతకం'లోని రెండు శ్లోకాలకు అనువాద పూర్వకంగా వ్రాసినవి.

హాస్యగాడిని సావిత్రి బాయి ఓదార్చే సన్నివేశములో 'జీవనదీప మారెడిది అనే పద్యము ప్రఖ్యాత ఆంగ్లనాటక కర్త 'విలియమ్ షేక్స్పియర్' పలుకులు స్ఫూర్తిగా తీసుకుని అనువాదపూర్వకముగా వ్రాసినవి.

'దినముల నెవ్వడే విసరె' మొదలైన నాలుగు పద్యాలు 'పాబ్లో నెరుడా' మహాశయుడి ఒక కవితకు అనువాద పూర్వకంగా వ్రాసినవి. ఈ కావ్యంలో చివర వ్రాసిన 'శిరముల విక్రయంబులకు' మొదలైన ఏడు పద్యాలు భారత స్వాతంత్ర సమర విప్లవ వీరుడు 'రాం ప్రసాద్ బిస్మిల్' ఉర్దూ కవిత ' సర్ ఫరోషీ కీ తమన్నా'

కవితకు అనువాదపూర్వక పద్యాలు. వ్యక్తిగతంగా నేను ఆరాధించే మహనీయులలో 'రాం ప్రసాద్ బిస్మిల్' ఒకరు, ఆయనకు నా హృదయ పూర్వక నివాళిగా ఆయన కవితను సందర్భానుసారంగా అనువదించి వాడుకున్నాను.

శ్రీనాథమహాకవివంటివాడే మయూరుడి సూర్యశతకములోని శ్లోకాలను అనువదించి వాడుకున్నాడు తన కాశిఖండములో. పోతనవంటి మహానుభావుడు కూడా ఎఱ్ఱన రచించిన అనేక పద్యాలకు అనురూపకములైన పద్యాలను వ్రాశాడు. పూర్వకవులమీద భక్తి ప్రేమల కారణంగా ఆమహానుభావులు అనుసరించిన మార్గంలోనే అర్భకుడైన ఈ రచయిత కూడా అడుగులు వేశాడు. యిది ఆక్షేపణీయం కాదని నా విశ్వాసము.

ఈ పద్యకావ్యంలో భారతసైనికులపట్ల, మహానుభావురాలు సావిత్రీబాయి ఖనోల్కర్ మీద నాకున్న ప్రేమ, గౌరవములనే ప్రధానంగా పాఠకులు స్వీకరించగోరుతాను. వ్యాకరణపరమైన, ముద్రణాపరమైన దోషాలు ఉండకూడదని సాధ్యమైనంతవరకు ప్రయత్నము చేశాను. ఐనప్పటికీ 'అరసున్నాల' లేమి వంటి కొన్ని అసౌకర్యాలు అనివార్యాలు అయినాయి. పాఠకులు మన్నిస్తారని ఆశిస్తాను. మలి ముద్రణలో మరింత శ్రద్ధ వహిస్తాను.

ఈ రచనను పీడీఎఫ్ రూపంలో యివ్వడానికి విశేషంగా శ్రమించిన సోదరతుల్యుడు 'మహేష్' డిజైనర్ కి, నాకు సహకరించిన 'ఆరెట్స్ గ్రాఫిక్స్'అధినేత శ్రీ మ్యాడం చైతన్య గారికి నా కృతజ్ఞతలు.

ఈ పద్యకావ్య కథను వినగానే, 'నేను ముద్రించి మీకు యిస్తాను' అని ముందుకు వచ్చిన శ్రీ నరేంద్ర, 'ప్రగతి ప్రింటర్స్' అధినేత, వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు. కవి, గాయక, కళాకారులకు యిలాంటి ప్రోత్సాహకులు, పోషకులు ఉంటేనే సరస్వతీ సేవ జరుగుతుంది.

నా చిరకాల మిత్రుడు శ్రీ ఆకునూరి సీతారామారావు చొరవ, సహాయము లేకుంటే ఈ పద్యకావ్యము యిలా ముద్రణ జరిగేది కాదు! నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను తనకు.

బల్లిని చూసి భయపడే నేను భండనవీరుల శౌర్య పరాక్రమ గాథలు వ్రాసుకుంటుంటే, యింటి బరువులు బాధ్యతలు తాను చూసుకుంటూ, నా ప్రవృత్తికి ప్రేమతో అనుకూలించే నా అర్ధాంగి 'సురేఖ'కు ధన్యవాదాలు!

...వనం వేంకట వరప్రసాదరావు

పరమవీరచక్రము

ప్రథమాశ్వాసము - అవతారిక - ఇష్టదేవతా ప్రార్థన

శ్రీమంతంబుగ భారతంబు నవ, శ్రీ శ్రీ శ్రీల సంరంభమున్
ధీమంతుల్ మన వీరసేనల జయోద్దీప్తుల్ జగంబంతటన్
నీమంబై నిరతంబులై వెలుగ, నే నిక్కావ్యమున్ సత్కథా
ధామంబై జయమొంద నంజలిడుదున్ దామోదరున్ శ్రీధరున్ (శా)

భారతదేశము శ్రీమంతము అవాలని ఆ శ్రీహరికి అంజలి ఘటిస్తున్నాను. మనసా, వాచా, కర్మణా (త్రికరణ శుద్ధి అనే)సిరిసంపదల సంరంభముతో ధీమంతులైన మన వీర సైనికుల విజయ కాంతులు ఈ జగమంతా క్రమం తప్పకుండా శాశ్వతంగా నిండాలని కోరుకుంటూ ఆ శ్రీహరికి అంజలి ఘటిస్తున్నాను. మనసుకు సంబంధించిన మంచి ఆలోచనల సంపద, పలుకులకు సంబంధించిన మంచి పలుకుల సంపద, కర్మములకు సంబంధించిన శుభ కర్మముల సంపదల సంరంభము కలగాలని ఆ శ్రీహరికి అంజలి ఘటిస్తున్నాను. ఈ కావ్యము సత్కథల నిలయము కావాలని, విజయవంతము కావాలని ఆ దామోదరుడిని, శ్రీధరుడిని ప్రార్థిస్తూ ఆ శ్రీహరికి అంజలి ఘటిస్తున్నాను.

శ్రీ నగజాత్మజా! సతత శీతల దృక్కుల జూడుమయ్యా! నా
దౌ నతి, వాగ్ఝరీ సుధల తాలిమి నందర మేనిపొంగులన్
లీనము జేసి నా కథనలీలల, భాసురకావ్యకచ్ఛపీ
గానము జేయ వేడెదను గావ, నవిఘ్నము గాగ కావ్యమున్ (ఉ)

ఎల్లపుడూ చల్లని చూపులతో చూడాలని పార్వతీ కుమారుడైన శ్రీ మహాగణపతి నా నతి. అమృతప్రవాహము వంటి పలుకులతో శరీరాలు పొంగిపోయేట్లుగా అందరినీ నా కథనములందు లీనము చేసి, శుభప్రదమైన కాంతులతో సరస్వతీదేవి వీణాగానములాగా ఈ కావ్యగానము సాగాలని,

ఈ కావ్యము అవిఘ్నముగా కొనసాగాలని ఆ గణపతికి నా నమస్సులు.

దక్షుని జేసినన్, కవనధార సుధారసవృష్టిగాగ, నీ
పక్షముజేర్చి నన్నిక నపారవచోశుభసాయచాలనా
శిక్షితు జేసినన్, రసవశీకర శోభలు సోక, వాణి! నీ
రక్షణజేసి నాకు రసరాజ్యము సాధ్యము, సాధుపూజ్యమున్ (ఉ)

అమ్మా! సరస్వతీ! నన్ను ఈ కావ్య రచనకు దక్షుడిని చేయుమమ్మా! కవనధార అమృతధారయై వర్షించేట్లుగా చేయుము తల్లీ! అనంతమైన శుభప్రదమైన పలుకులు అనే బాణములను సంధించేట్లు నన్ను శిక్షితుడిని చేయి తల్లీ! అలా నీ రక్షణవలన నాకు రసరాజ్యమును గెలవడం సాధ్యమవుతుంది, సాధుపూజ్యత కలుగుతుంది. కనుక నన్ను కరుణించుము తల్లీ!

దుర్గవు నీవుకాగ శుభదుర్గ మ దైన 'ద'కారమున్ 'క్ష' లన్,
దుర్గము అక్షరంబనెడి దుర్గమ దుర్గము దుర్జనాళికిన్,
దుర్గనుజేరి వేడకనె దుర్గతి జెందిరి దొర్లిరెందరున్,
దుర్గవు తల్లివై సుతుని దుస్తరమన్నది లేక బ్రోవవే! (ఉ)

అమ్మా! నీవు దుర్గాదేవివి. 'అ' కారమునుండి 'క్ష' కారమువరకూ వ్యాపించిన అక్షరముల శుభదుర్గమునందు ఉండే తల్లివి నీవు. దుష్టులకు నీ అక్షర దుర్గము దుర్లభము. దుర్గవైన నిన్ను చేరి శరణువేడకపోవడం వల్లనే దుర్గతిని పొంది, పడిపోయి నశించారు ఎందరో నాకు తల్లివై, నీ కుమారుడినైన నాకు దుస్తరము అన్నది లేకుండా, అధిగమించలేని అడ్డంకులు అనేవి లేకుండా బ్రోవుమమ్మా!

దుర్గ! వికారభావపరిదూసరదానవవర్గ వైరి! నీ
వర్గము జేరెదన్, రిపుల వర్గపు షట్కము నేటితోడ నే
సర్గము జేసెదన్, శుభద! శాంభవి! దివ్యపదానుభావనా
స్వర్గపు రోచులన్నెగడు శాశ్వత కావ్యము జేయజూడవే! (ఉ)

ఈ కావ్యము అవిఘ్నముగా కొనసాగాలని ఆ గణపతికి నా నమస్సులు.

దక్షుని జేసినన్, కవనధార సుధారసవృష్టిగాగ, నీ
పక్షముజేర్చి నన్నిక నపారవచోశుభసాయచాలనా
శిక్షితు జేసినన్, రసవశీకర శోభలు సోక, వాణి! నీ
రక్షణజేసి నాకు రసరాజ్యము సాధ్యము, సాధుపూజ్యమున్ (ఉ)

అమ్మా! సరస్వతీ! నన్ను ఈ కావ్య రచనకు దక్షుడిని చేయుమమ్మా! కవనధార అమృతధారయై వర్షించేట్లుగా చేయుము తల్లీ! అనంతమైన శుభప్రదమైన పలుకులు అనే బాణములను సంధించేట్లు నన్ను శిక్షితుడిని చేయి తల్లీ! అలా నీ రక్షణవలన నాకు రసరాజ్యమును గెలవడం సాధ్యమవుతుంది, సాధుపూజ్యత కలుగుతుంది. కనుక నన్ను కరుణించుము తల్లీ!

దుర్గవు నీవుకాగ శుభదుర్గ మ దైన 'ద'కారమున్ 'క్ష' లన్,
దుర్గము అక్షరంబనెడి దుర్గమ దుర్గము దుర్జనాళికిన్,
దుర్గనుజేరి వేడకనె దుర్గతి జెందిరి దొర్లిరెందరున్,
దుర్గవు తల్లివై సుతుని దుస్తరమన్నది లేక బ్రోవవే! (ఉ)

అమ్మా! నీవు దుర్గాదేవివి. 'అ' కారమునుండి 'క్ష' కారమువరకూ వ్యాపించిన అక్షరముల శుభదుర్గమునందు ఉండే తల్లివి నీవు. దుష్టులకు నీ అక్షర దుర్గము దుర్లభము. దుర్గవైన నిన్ను చేరి శరణువేడకపోవడం వల్లనే దుర్గతిని పొంది, పడిపోయి నశించారు ఎందరో నాకు తల్లివై, నీ కుమారుడినైన నాకు దుస్తరము అన్నది లేకుండా, అధిగమించలేని అడ్డంకులు అనేవి లేకుండా బ్రోవుమమ్మా!

దుర్గ! వికారభావపరిదూసరదానవవర్గ వైరి! నీ
వర్గము జేరెదన్, రిపుల వర్గపు షట్కము నేటితోడ నే
సర్గము జేసెదన్, శుభద! శాంభవి! దివ్యపదానుభావనా
స్వర్గపు రోచులన్నెగడు శాశ్వత కావ్యము జేయజూడవే! (ఉ)

వికారభావములతో నిండిన దానవులకు శత్రువువైన ఓ దుర్గా! నేను నీ పక్షమున చేరెదను. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే ఆరుగురు శత్రువులను అంతము చేసెదను. శుభములను ప్రసాదించే తల్లీ! శాంభవీ! దివ్యమైన పదముల అనుభావముతో అమరమైన స్వర్గప్రభలతో వెలుగొందే శాశ్వతముగా నిలిచిపోయే కావ్యమును రచించేలా చూడు తల్లీ!

అమ్మవు నీవె, ముగ్గురగు అమ్మల కయ్యల కాది వీవెగా,
అమ్మవు నీవవన్ పలుకు అమ్మగ యైనది జిహ్వలన్ తొలిన్,
ఇమ్ముగ జీవులందరికి నిచ్చెడు వారల కిచ్చుదానవే!
నమ్మితి ని మ్మదౌపలుకు, నా చిరు కావ్యము గాగ భవ్యమున్! (ఉ)

సరస్వతి, శ్రీమహాలక్ష్మి, పార్వతి అనే ముగ్గురు అమ్మలకు నీవే జననివి! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే ముగ్గురు అయ్యలకు ఆదివి నీవే! నీవే యిందరికీ, అందరికీ అమ్మవు కనుక, మా నాలుకల తొలి పలుకు 'అమ్మ' ఐనది! జీవులందరికీ అన్నిటినీ యిచ్చే ముగ్గురు అమ్మలకు, ముగ్గరయ్యలకు అన్నిటినీ యిచ్చే తల్లివే! నిన్ను నమ్ముకున్నాను. నా ఈ చిరు కావ్యము భవ్యము అయ్యేలాగా నాకు పలుకులను ప్రసాదించు తల్లీ!

వీరచరిత్ర మొక్కటిది వీనులవిందుగ చెప్పనెంచితిన్,
భారము నీదెగా! నిది యపారము, అండయొ, వాణి, నీవెగా!
కారణ మౌదువో జనని, కార్యము, కర్త, ఫలంబు, భోక్తయున్!
వీర సుపుత్ర గానమిది, విందులొ నిందలొ పొందు భారతీ! (ఉ)

ఈ వీరచరిత్రమును ఒకదానిని వీనులవిందుగా చెప్పాలని నిశ్చయించుకున్నాను. ఈ భారము నీదే తల్లీ! ఈ కార్యము అపారమైనది. అమ్మా! సరస్వతీ నాకు అండవు నీవే కదా! అమ్మా! కారణమూ, కార్యము, కర్త, ఫలము, ఫలభోక్త అన్నీ నీవే తల్లీ! యిది వీరసుపుత్ర గానము. విందులో, నిందలో, పొందుగా ఏమి కలుగుతాయో కదా తల్లీ! ఏది కలిగినా, ఆ కారణము, ఆ కార్యము, ఆ కర్త, ఆ ఫలము, ఆ ఫలభోక్త అన్నీ నీవే తల్లీ!

వ్యాకరణమ్ము వార్ధిగద! యందు వివేకము శూన్యమైన నే
నే కరణమ్ములన్ జలధి? నీదగ నేర్వను పిల్లకాలువల్!
నాకు రణంబులా? మొదలె నా కరణీక నియోగజన్మ, నే
నీ కరుణా విలాసమున నిల్చుట యోగమొ, నీ నియోగమో! (ఉ)

వ్యాకరణము మహాసముద్రము కదా! ఆ వ్యాకరణమునందు అవివేకినైన నేను ఏ రకంగా ఆ సముద్రాన్ని ఈదగలను, పిల్లకాలువలనే యీదలేను! నాకా యుద్ధాలు, యుద్ధ గాథలు? మొదలే కరణీకపు నియోగజన్మ నాది. కలముయొక్క బలము తప్ప, ఖడ్గపు బలము లేనివాడిని. నీ కరుణావిలాసముచేత నేను నిలబడడం యోగమో, నీ నియోగమో!

బంధము లొక్కటొక్కటిగ బాయుచు బాధల పందిరేయుచున్,
బంధము ఛందమంద? రసబంధుర కైతల బంధమంద? పం
గ్వంధుడ, భారతీ! దయను గానవె! గావవె, సోకజేసి సం
బంధము నీదుపాద మధుపమ్ముగ నంద సుగంధ బంధముల్! (ఉ)

అనుబంధములను ఒక్కొక్కటిగా కోల్పోతూ, బాధల పందిరి వేస్తుండగా బంధము ఛందస్సుతో, రసబంధురములైన కవితలను అల్లడంతోనా? అమ్మా! నీ మార్గములో నడవడం చేతగాని కుంటివాడిని, నీ జాడలను కనుగొనలేని గుడ్డివాడిని. భారతీ! నీ పాదకమలముల తుమ్మెదగా సంబంధమును కలుగజేసి, సుగంధ బంధములను, సుకవిత్వ పదబంధములను అందజేసి, నన్ను దయతో చూసి రక్షించు తల్లీ!

వ.

అని పలు నామములతో గుణములతో వెలుగొందు ఒకానొక తత్త్వమును ఒక్కటియే ఐన పరతత్త్వమును ప్రస్తుతించి, వాల్మీకి, వ్యాస, ఆదిశంకర, కాళిదాస, మయూర, బాణ ప్రముఖులైన యమరభాషా మహోదధీ వీచులకు వినతుండనై, కవిత్రయమునకు కైమోడ్పులు ఘటించి, శ్రీనాథుని చిత్తమునందు చింతించి, రసబంధురంబులగు

కవనబంధంబులను మాకంద రసనిష్యందవాహినులుందగ అలుగులొంద నొందలుగ పారించిన ప్రబంధయుగకవి బంధువులను, గద్య, పద్య, కావ్య, కథా, నాటక, నవలా సాహిత్యకుసుమంబులను తెలుగు నందనవనిని పూయించిన గణ్యు లగణ్యులగు పుణ్యులగు పూర్వ , వర్తమాన కవిపుంగవులకు కవయిత్రులకు పులకలెత్తిన మనంబున పూజనంబులిడి, భావి కవన పథంబుల కుసుమ ఫలచ్ఛాయా ప్రదాతలగు కవన తరువులకు సంతసము కందళించిన నిండుమనంబున కమనీయ కవనభువనవిజయ శుభకామనల నందించి, ఆనందించి.

ఆ విధముగా ఎన్నో పేర్లతో, ఎన్నో గుణములతో వెలిగే ఒకటే ఐన పరతత్త్వమును ప్రస్తుతి చేసి, వాల్మీకి, వేద వ్యాసుడు, ఆదిశంకరుడు, కాళిదాసు, మయూరుడు, బాణుడు మొదలైన దేవభాష ఐన సంస్కృతము అనే సముద్రమున కెరటములవంటి మహానుభావులకు వందనము చేసి, కవిత్రయమైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలకు చేతులు జోడించి నమస్కరించి, శ్రీనాథ మహాకవిని మనసులో తలచుకుని, తీయమామిడి రసములవంటి రసబంధురమైన కవనబంధములను అలుగులెత్తినట్లుగా వందలుగా పారించిన ప్రబంధయుగ కవిబంధువులను, గద్య, పద్య కావ్యములను, కథ, నాటకము, నవలలు అనే సాహిత్యకుసుమములను తెలుగుభాష అనే నందనవనములో పూయించిన గణుతింపదగినవారు, లెక్కలేనంతటి పుణ్యాత్ములు ఐన పూర్వ, వర్తమాన కవిపుంగవులకు, కవయిత్రులకు మనసు పులకరించి పూజలుచేసి, భవిష్యత్తులో కవిత్వము అనే బాటలవెంట పుష్పములు, ఫలములు, నీడలను ప్రసాదించబోయే కవిత్వవృక్షములైన భావికవులకు సంతోషము మొగ్గతొడిగిన నిండుమనసుతో కమనీయమైన కవితాప్రపంచవిజయము పొందుదురుగాక అని శుభాకాంక్షలను అందించి, ఆనందించి.

యిష్ట కవి స్తుతి

ఈవీట నేతేటి దిమ్ము కమ్మని మావి
మందార మకరంద మందు విందు
నైమిశమ్మను కమ్మ నైన గోంగూరతో

ముద్దపప్పు మునగ ముద్దు ముద్ద,
మధుర వర్ణన మన్న మంచి మీగడలతో
వైకుంఠ వర్ణనం బన్న వెన్న,
ఆవకాయది చుర్రు, అరిది కంబము చీల్చు,
జివ్వుమన్నది జిహ్వ సింహ గద్య (సీ)

వచన పచనములను వంట విందు లెవరి,
కింకెవరికి? మనల కిచ్చి రెవరు?
పాచకుండు నెవరుపంచె గద్యల భక్ష్య
భోజ్యములను వండి? పోతనొకడు! (ఆవె)

ఈ (తెలుగు) నేలమీద ఏ తుమ్మెద కమ్మని రుచిగల మామిడి, మందారముల తేనెల విందు చేసింది? నైమిశారణ్య వర్ణనము అనే ముద్దపప్పుతో మునిగిన కమ్మని గోంగూరముద్ద, మధురాపుర వర్ణనము అనే మంచి మీగడలు, వైకుంఠ వర్ణనము అనే వెన్న, చుర్రుమనే ఆవకాయరుచిలాంటి స్తంభాన్ని చీల్చడం, నాలుక జివ్వుమనే నృసింహగద్య అనే వచన కవితల వంట విందులు ఎవరికి యిచ్చారు? యింకెవరికి, మనకు తెలుగువారికే, యిచ్చింది ఎవరు? గద్యముల భక్ష్య భోజ్యములను వండి పంచిపెట్టిన వంటవాడు ఎవరు? యింకెవరు, పోతన!

యింతింతలై పొంగు నింతయౌ రింగణా
వా మనంబు మురియ వారణాసి
గజరాజ మోక్షంబు గద్యాలు భవ్యంబు,
నరుడు తా కరి, బంధనములు మకరి!
మై పొంగ శిశురక్ష , మై జీల్చి ఖలు శిక్ష ,
మైసూరు దది హృద్యమైన జీర!
కాంచియూ కాంచరా కంజాక్షు, నెవ్వరే
కాంచిరా, కథలిక కంచి కథలు! (సీ)

ఆదిలచ్చి పెండ్లి యారణి రుక్మిణి
కగ్నిసాక్షి గిచ్చె నగ్నిద్యోత!
పలుకు తల్లి మురియు పట్టు పుట్టంబులు,
భాగవతము తెలుగు పట్టు పెట్టె! (ఆవె)

తెలుగుభాగవతము ఒక పట్టుపెట్టె. పలుకుల తల్లి, సరస్వతీదేవి మురిసిపోయే పట్టుబట్టలు! 'యింత' పొట్టివాడు ఇంతింతై పొంగి ఎదిగే వామనుని కథ వా! అని మనసు మురిసిపోయే బనారసు పట్టుచీర! మానవుడు ఏనుగు, భవబంధాలు మొసలి. గజరాజ మోక్షణము భవ్యమైన గద్వాలు పట్టుచీర! శరీరము పొంగేట్లు శిశువును రక్షించి, శరీరాన్ని చీల్చి దుష్టుడిని శిక్షించిన కథ హృద్యమైన మైసూరు పట్టుచీర! కనుగొన్నాము అనుకుంటూనే కనుగొనలేని కంజాక్షుని కథలు కంచి కథలు, కంచిపట్టుచీరలు! ఆ కంజాక్షుని కనుగొన్నవారి కథలు ముగింపే, కంచి కథలే, ఆ కథలూ కంచిపట్టు చీరలే! అగ్నిసాక్షిగా అగ్నిద్యోతనుడు ఆ యుద్ధ వీరుడిని, శ్రీకృష్ణుడిని రుక్మిణికి యిచ్చిన ఆదిలక్ష్మి రుక్మిణీదేవి పెండ్లి కథ ఆరణి పట్టుచీర!

నేతగాడు కవులనేతయౌ కవిరాజు,
భాగవతము తెలుగు పట్టుపెట్టె,
కట్టబెట్టినాడు కలికి వాణికి నిల,
పోతనార్యుతోడ బోల్చ నెవడు? (ఆవె)

కవులకు నేత, నాయకుడు ఐన కవిరాజు నేతగాడై నేసిన పట్టుచీరల పట్టుపెట్టె ఆంధ్ర భాగవతము. ఈ పట్టుచీరలను సరస్వతీదేవికి కట్టబెట్టాడు. ఈ ధరణిలో పోతనార్యునితో పోల్చదగినవాడు ఎవరు? ఎవరూ లేరు!

చక్రకేళి లీల, చక్రి కేళీ హేల,
పంచదారనిద్ద పనస తొనలు,
పూత రేకులయ్య పోతన్న పలుకులు,
తెలుగుకవిత లూటతేనెబావి! (ఆవె)

చక్రకేళీ అరటిపండువంటివి పోతన తీయని పలుకులు. 'చక్రి' శ్రీకృష్ణుని కేళీ హేల పోతన పలుకులు. పంచదారలో ముంచిన పనసతొనలు పోతన పలుకులు. పూతరేకులు పోతన పలుకులు. తెలుగుకవితలు ఊరే తేనెల బావి పోతన!

ధగ ధగ నఖముల దళిత దనుజుగని
హ్లాదుడు నపర ప్రహ్లాదు డెవడు?
భాగవతంబను భవ్య కావ్య కవన
భీష్ము డెవ? డపర భీష్ముడెవడు?
రాధ, శుకు డెవడు? రసలోలు నిరతి న
నారతుం డెవడిల నారదుండు ?
ఎడమీక శోకాబ్ధు లెత్తి ముంచినపుడు
ఆప్తు డెవడు? పాన యాత్ర మెవడు? (సీ)
నాకు తోడు గెవరు నడిరేయి, మునిమాపు?
నాన్న, యన్న, ఎవరు నందరనగ ?
వాని పాదజలము పావన తీర్థంబు
నాకు, నతులు పోతనార్యునకును! (ఆవె)

ధగధగలాడే నృసింహుని నఖములతో సంహరింపబడిన దైత్యుని, హిరణ్యకశిపుని 'చూసి' సంతసించినవాడు, అపరప్రహ్లాదుడు పోతన. భాగవత పురాణము అనే భవ్య కావ్య నిర్మాణము అనే యుద్ధములో భీష్ముడు, అపరభీష్ముడు పోతన. రాధవంటి, శుకునివంటి వాడు పోతన, రాధలాగా శ్రీకృష్ణుని మోహములో మునిగినవాడు, శుకునివలె శ్రీకృష్ణుని నిరంతర చింతనంలో మునిగినవాడు పోతన. రసలోలుడైన శ్రీకృష్ణుని రక్తిలో నిరంతరమూ మునిగిన అపర నారదుడు పోతన. విరామము లేకుండా శోకజలధులు నన్ను ముంచెత్తినపుడు నావలాంటివాడు, నాకు ఆప్తుడు పోతన. నడిరేయిలో, మునిమాపులో నాకు తోడు పోతన. నాకు నాన్న, అన్న అందరూ పోతన. ఆయన పాదములు కడిగిన జలము నాకు పవిత్రమైన తీర్థము. అటువంటి పోతనార్యునికి నా నతులు.

సాహితీసమరాంగణ సార్వభౌముడు!
సకల భాషలయందు సంస్కృతము గరిమ,
దేశభాషలయందు తెలుగు లెస్స!
వేంకటాద్రి సకల విశ్వమందు ఘనము,
వేంకటేశుడొకడు వేల్పులందు!
మాలదాసరి గాథ మహిని గాథల మిన్న,
ఆముక్త మాల్యద అతివలందు !
సాహితీ భువనము, సమరవిజయముల
రా జన శ్రీకృష్ణ రాయలొకడు! (సీ)
లెస్స, లెస్స యనగ లేదు వేరెవ్వడూ,
సార్వభౌముడట్లు, సవ్య సాచి!
సమరము తన తనువు, సాహిత్య మౌ నాత్మ,
అమ్మ తెలుగు అతని యంతరాత్మ! (ఆవె)

సకల భాషలలో సంస్కృతము, దేశభాషలలో తెలుగు మిన్నయైనవి. వేంకటాద్రి విశ్వములో ఘనమైనది, వేంకటేశుడు వేల్పులలో ఘనుడు. ప్రపంచంలోని కథలలో మాలదాసరి కథ మిన్నయైనది, స్త్రీలలో 'ఆముక్తమాల్యద', గోదాదేవి శ్రేష్ఠురాలు. సాహితీ భువనములో, సమర విజయములో రాజు శ్రీకృష్ణ దేవరాయలు ఒకడే, ఆయనకన్నా భళీ భళీ అనదగ్గవాడు వేరెవరూ లేరు. అటువంటి సార్వభౌముడు, సవ్యసాచి. యుద్ధము ఆయనకు శరీరము, సాహిత్యము ఆయన ఆత్మ, తెలుగు తల్లి ఆయన అంతరాత్మ.

రాజులు గాజువారి పడి రాలిరి గాజుపరంజు లెందరున్,
రాజిలు మోజులైన కవిరాజులు జాజులు పూచిరెందరున్,
రా జన సాహితీ సమర రంగము లందొక రాజరాజు, యా
రాజుకు, నాంధ్రభోజునకు, రాయల కేను నమస్కరించెదన్! (ఉ)

రాజులెందరో గాజుపరంజులలాగా చిట్లి పడిపోయారు. మోజులైన జాజులవంటి కవిరాజులు ఎందరో పూచారు. రాజు అంటే సాహితీ సమర రంగములలో ఒకడే రాజరాజు. ఆ రాజుకు, ఆంధ్రభోజుడికి, శ్రీకృష్ణదేవరాయలకు నేను నమస్కరించెదను.

విశ్వకవిమూర్తి!

పూవుల నామని వేళల
దీవలు గురిసిన పొరలిన తేనియలనగన్,
మావుల, మనముల, వనముల
భావజు డిత డగును, కవనభావనలు విరుల్! (కం)

వసంత వేళలలో లతలు పూలవర్షాన్ని కురిపించగా పొంగి పొరలిన తేనెలేవో అన్నట్లుగా, మామిడి తోటలలో, మనసులలో యితడు మన్మథుడేమో, ఈతని కవనభావనలే ఆ పూవులేమో!

సురకల్పవృక్షము జూచి మేళములాడు
కల్పవృక్షము విత్తు కర్షకుండు,
పడతి కిన్నెరసాని పయ్యెదతెరచాప
పాట నావల సాగు భావకవియు,
అర్ధనారీశ్వరహద్దు లే దని, ముద్ద
రాలు సీత నిలువు రాముడనెను,
పడతి నొకడు బాసి పదితలలను గోసె,
బాసె నితడు, వేల ఫణము లెగసె! (సీ)
రాము డతుల నితడు రాముని దాసుడు,
దేవతరువు దెచ్చె, దేవు డితడు!
విశ్వనాథ సకలవిద్యల దక్షిణా
మూర్తి! కవన విశ్వమూర్తి మూర్తి! (ఆవె)

దేవలోక కల్పవృక్షాన్ని చూసి హేళనచేసే కల్పవృక్షాన్ని విత్తిన, నాటిన కర్షకుడు యితడు. కిన్నెరసాని పవిటను తెరచాపగా చేసుకుని పాటల నావలో సాగిన భావకవి యితడు. అర్ధనారీశ్వర తత్త్వము అనే హద్దులేదు, సగము కాదు, మొత్తమూ రాముడే సీత అన్నవాడు యితడు. పడతిని ఎడబాసినతడు ఒకడు, శ్రీరాముడు, కోపముతో రావణుడి పదితలలను క్రోధముతో కోశాడు. యితనూ తన పడతిని కోల్పోయాడు, కానీ శాంతమూర్తియై వేయిపడగలను ఎగవేశాడు. రామునివంటివాడు యితడు, రాముని దాసుడు. దేవతరువును, కల్పవృక్షమును నేలకు తెచ్చిన దేవుడు యితడు. యితడు విశ్వనాథ! యితడు సకలవిద్యల దక్షిణామూర్తి! కవన రూపములో విశ్వరూపుడు!

ఎవడురా దిక్కుంభు లెత్త శీర్షంబుపై
వెలసి ఫణమన తా వేల ఫణుల?
ఎవడు యిచ్చెను దెచ్చి ఎండి పోనిది చెట్టు?
వేల్పుచెట్టు, తెలుగు పెరటి చెట్టు!
పట్టుమని గలరు పదుగురో పదకొండ్రొ
పూర్వకవులు, వారి పూన్కి నేను!
పట్టి నిల్పుడు వారి, పట్టనెంచిన నన్ను
అన్న పుట్టుక కవి యట్టి దిట్ట! (సీ)

మల్లె, మొల్ల, కలువ, మంచిగులాబీల
నాటకముల, కథల, నవలల సరు
లల్లి వేసె తెలుగులక్ష్మి కంఠము నందు,
విరుల కవనమాలి విశ్వనాథ! (ఆవె)

వేయిపడగల మీద అష్టదిగ్గజములను మోసే మహా ఫణము, ఆదిశేషుడేమో అన్నట్లు వేయిపడగలను గలవాడెవ్వడు? ఎండిపోవడం అన్నది లేని దేవలోకపు చెట్టును, కల్పవృక్షాన్ని తెచ్చి తెలుగువారి పెరటిలో చెట్టును చేసినవాడెవ్వడు? పట్టుమని పదిమంది, పదకొండుమంది

పూర్వకవులు, వారిలాంటి వాడిని నేను, నన్ను పట్టుకోవాలంటే వారిని పట్టుకోవాలి అన్న దిట్ట, పుట్టుకవి ఎవరు? మల్లెలు, మొల్లలు, కలువలు, మంచిగులాబీలవంటి నాటకముల, కథల, నవలల హారములను అల్లి, తెలుగుభాషా మహాలక్ష్మి కంఠమున వేసిన కవితలు అనే విరుల మాలాకారుడు విశ్వనాథ!

ఎవడురా పులకెత్త నెలుగెత్తి చాటించె
నాంధ్ర పౌరుషమును అవని నటుల?
మ్రోయు తుమ్మెదెవరు మ్రోసిన మగ దేటి?
కోకిలమ్మ మనువు కోడె కవియు,
తెరచి రాజు నెవరు తెరిచిరి రాజుగా?
తెరిచి రెవ రనగ తెలుగు తెరల
ఏకవీర కథన మే కవివీరుడు?
విష్ణు శర్మకెవరు విప్పి చెప్పె **(సీ)**
చదువు నాంగ్లము చవి, సంస్కృతమున రవి,
తెలుగు జ్ఞానపీఠి, తేజి ధాటి!
సవ్యసాచి, కవనసమర విజయవీచి,
విశ్వనాథ తెలుగు విశ్వకవియు! **(ఆవె)**

పులకలెత్తి ఆంధ్ర పౌరుషమును అవనియంతటా ఎలుగెత్తి చాటినవాడు ఎవరు? మ్రోయు తుమ్మెదను మ్రోసిన గండు తుమ్మెద ఎవరు? కోకిలమ్మ మనువు వ్రాసిన కోడె కవి ఎవరు? తెరచిరాజును తెరచిన కవిరాజు ఎవరు? తెలుగు తెరమీద ఏకవీర కథనాన్ని తెరచిన కవివీరుడు ఎవరు? విష్ణు శర్మకు ఇంగ్లీష్ చదువు రుచిగా విప్పిచెప్పినవారు ఎవరు? సంస్కృతమున రవి ఎవరు? తెలుగు జ్ఞాన పీఠము, అశ్వధాటి గలవాడు, సవ్యసాచి, కవన కదనములో ఎగసిన విజయవీచి విశ్వనాథ! తెలుగువారి విశ్వకవి!

కల్పవృక్షము దెచ్చి కావ్యము జేసెను,
కామధేనువు రామ కామనలుగ
మందారమును పద్యమందారముల జేసె,
హరిచందనము హాయి యగు విమర్శ
నవల, సంతానము నాటికలు, కథలు
పారిజాతము లయ్యె పరిచయములు!
తెలుగు నందన మయ్యె, దేవతలిక తెలు
గులన దేవగురుని గురుడు గురుడు! (సీ)

నరుడు దోచె ననుచు నలిగిన సురపతి,
వత్తు నేను వలదు వంత యనుచు,
విశ్వనాథు దేగె 'విడిది' సుధర్మను
గురుడు వెలుగు తెలుగు గుండె నెపుడు! (ఆవె)

విశ్వనాథ కల్పవృక్షాన్ని తెచ్చి, కావ్యముగా మలిచాడు. కామధేనువును శ్రీరాముని పట్ల కామనలుగా చేశాడు. దేవ మందారమును తన పద్యమందారాలుగా చేశాడు. దేవలోక హరిచందనమును తన విమర్శలుగా చేశాడు. సంతానమును తన నవలల సంతానముగా చేశాడు. పారిజాతమును నాటికలు, కథలు, పరిచయములుగా చేశాడు. తెలుగు భాష, తెలుగు దేశము నందనము అయ్యింది. తెలుగువారు దేవతలు అయినారు. దేవగురుని బృహస్పతికి తానే గురుతుల్యుడు. దేవలోకమును, నందనవనమును అలా విశ్వనాథ దోచుకున్నాడు అని అలిగాడు సురపతి. దాంతో బాధపడకయ్యా! నేనే వస్తాను నీ వద్దకు అని దేవలోకానికి వెళ్ళాడు విశ్వనాథ, తన భౌతిక శరీరాన్ని త్యజించి. వెళ్లి దేవేంద్రుని సభ యైన 'సుధర్మ'లో విడిది చేశాడు. గురువైన విశ్వనాథ భౌతికంగా లేకున్నా, తెలుగువారి గుండెలలో ఎల్లపుడూ వెలుగుతూనే ఉంటాడు.

తిండికి భీముండు, దిట్టయౌ వలలుండు,
మనిన రాముండును, మన్మథుండు!
విదితహైందవధర్మ విహితమౌ తేజుండు,
సకల సద్గుణరాశి, సాధకుండు!
అలుగుట లెరుగని యా ధర్మసూనుండు,
అలుక ఏమున్ననూ యంత నుండు
విదిత నిఖిల వేది, వేద వేది యతడు
తెలుగు కవనమున తేటి మ్రోత! (సీ)

శిష్యకల్పకంబు, శ్రీరామునకు గుండె
విడిది గుడిగ జేసె విశ్వనాథ!
ఎరుగగల్గువార లెల్లరూ శిష్యులౌ
గురుల ఋణము బుచ్చు గురు, దలఘుడు! (ఆవె)

తిండిపుష్టికి భీముడు. పాకశాస్త్ర ప్రావీణ్యంలో సాక్షాత్తూ వలలుడు. శ్రీరామునివలె ఆదర్శప్రాయమైన జీవికను గడిపినవాడు. రూపములో మన్మథుడు! సకల సద్గుణరాశి, సాధకుడు. కోపించడం తెలియని ధర్మరాజు. కోపము వచ్చినా అంతలోనే మరలా శాంతించేవాడు, ఉత్తమ పురుషలక్షణము, క్షణికమైన కోపము గలవాడు. సమస్తమును తెలుసుకున్న జ్ఞానిగా ప్రసిద్ధుడు. ఆయన వేదవేది! తెలుగు కవిత్వ వనములో గండుతుమ్మెద మ్రోత ఆయన! శిష్యులకు కల్పవృక్షమువంటివాడు. శ్రీరామునికి తన గుండెను విడిదియైన గుడిగా చేసిన మహాభక్తుడు. వివేకవంతులు అందరినీ శిష్యులుగా చేసుకున్న గురుమూర్తి ఆయన. తన గురువుల ఋణం తీర్చుకున్నవాడు, తన గురువులను తనకు ఋణపడేట్లు చేసిన ఉత్తమోత్తమ, ఆదర్శ శిష్యుడు, గురువు ఆయన!

అనినన్, నీవనినట్టు లన్న కవియౌ, ఆచార్యుడౌ నీవలెన్
మనినన్, నీవలె సార సారస సుధా మందార సౌగంధికా
వనులన్ తెల్గున సాగు జేయగొనగన్, వాక్రీలసత్కావ్యమై
మనముల్ తూగెడి పద్య గద్య సరణిన్ మా కీవె విశ్వేశ్వరా! (మ)

పలికితే నీలాగా పలికితే కవియనబడతాడు. నీలాగా జీవిస్తే ఆచార్యుడౌతాడు. నీలాగా సారవంతమైన కలువలను, తేనెలొలికే మందారములను, సౌగంధికములనూ తెలుగువనములో, తెలుగు నేలపై సాగు జేయడానికి, శ్రీమంతములైన పలుకులతో శోభిల్లే కావ్యమును రచించడానికి, మనసులను డోలలూపే పద్య, గద్య సరణికి మాకు నీవే, నీవంటివారు వేరొకరు లేరు విశ్వనాథా! నీలాగా సారవంతమైన కలువలను, తేనెలొలికే మందారములను, సౌగంధికములనూ తెలుగు వనములో, తెలుగు నేలపై సాగు జేయడానికి, శ్రీమంతములైన పలుకులతో శోభిల్లే కావ్యమును రచించడానికి, మనసులను డోలలూపే పద్య, గద్య సరణిని మాకు(నాకు) ఈయవే, ప్రసాదింపవే విశ్వనాథా!

గంగా! పొంగు మటంచు శంభుడనగన్, గారంపు జాబిల్లియున్
అంగీకారపు ముద్రవైచి నటులన్, ఆహా యనన్ అమ్మయున్,
సంగీతంబుల రాగ తాళముల పంచన్ శృంగియున్ భృంగియున్,
గంగాపాత సుధాలయాన్వితము నీ కావ్యంబు విశ్వేశ్వరా! (శా)

గంగా! పొంగుము! అని పరమశివుడు అనగా, గారాల జాబిల్లి అందుకు అంగీకారముద్ర వేసినట్లుగా, అమ్మ గిరిజ ఆహా! యని పలుకగా, శృంగి, భృంగి సంగీతమును రాగ తాళగతులను అందించగా గంగాపాతమువలె, అమృతమువలె, లయాన్వితమవుతుంది నీ కావ్యము విశ్వనాథా!

తరువనగ కల్పవృక్షము!
గురువనగను అదియె యగును, కురియగ ఫలముల్,
గురువుగ నదియుగ గురుతగు
గురుకవితల విశ్వనాథ గురునకు ప్రణతుల్! (కం)

తరువు అంటే ఉత్తమమైన తరువు కల్పవృక్షము. గురువు కూడా కల్పవృక్షమువంటివాడే, ఫలములను ప్రసాదించడానికి. గురువుగా,

కల్పవృక్షముగా గుర్తు ఐన గురుకవితల విశ్వనాథ గురుదేవునికి నా ప్రణామములు!

వ.

అని గురుతరులైన కవనకల్పతరువులకు కైమోడ్పులు ఘటించి.

ఆ విధముగా గురుమూర్తులైన కవిత్వకల్పవృక్షాలకు చేతులు జోడించి నమస్కరించి.

గ్రంథకర్త పరిచయము

అది నేలకొండపల్లియ!
అదిగద శ్రీ రామదాసు డార్తిగ పలుకన్,
విదితములగు దాశరథీ
పదకలితములైన గంగ పారిన ధరయున్! (కం)

అది నేలకొండపల్లి. అదియే శ్రీరామదాసుడు కంచర్ల గోపన్న ఆర్తిగా పలుకగా తెలిసిన దాశరథీశతకపు పలుకులతో మిళితమైన కవిత్వ గంగ ప్రవహించిన భూమి!

రామునిపాద దాసు డొక రాజు జనించెను గోపరాజటన్
రామునిదాసదాసు, డొక రాముడు, వేంకటరామరావటన్,
కామములేని గానరస కాముడు, సోముడు, సోదరవ్యథల్
నీమము చేటుగాగ పడనీక వసించె నుదారవాదియై! (ఉ)

రాముని పాదదాసుడైన రాజు ఒకడు, కంచర్ల గోపరాజు అక్కడ, నేలకొండపల్లిలో జన్మించాడు. రామదాసుల దాసుడైన రాముడొకడు, వేంకట రామారావు అక్కడ నివసించాడు. ఈ రాముడు వేంకట రామారావు, కామము లేనివాడు, గానరసమును కామించినవాడు. కామములేని చంద్రుడు, అంటే, మచ్చలేని చంద్రుడు! సోదరుల వ్యథలవలన తన నియమము చెడకుండా, ఉదారవాదియై అక్కడ నివసించాడు.

రాముని పుణ్యకీర్తనలు, రాము శుభప్రదమైన వర్తనల్,
రామకథాసుధాచవుల రా ల్గరగించుచు మై కరంగుచున్,
పామర పండితావళికి పల్కుల చెఱ్కురసోత్కరోక్తులన్,
సామము, సాహితీ మయము సామిగ నుండె సుశిష్యసంఘమున్ (ఉ)

రాముని పుణ్యకీర్తనలతో, రామునివర్తనలవంటి శుభప్రదమైన వర్తనలతో, రామకథామృత రుచులతో రాళ్ళు కరిగేలా గానము చేస్తూ, తన శరీరము కరిగిపోతుండగా, పామరులకు పండితులకు తన రసమయమైన పలుకుల చెఱుకులతో, సంగీతము సాహిత్యము సగము సగముగా సుశిష్య సంఘముతో ఉండేవాడు.

కర్ణరసాయనమ్ము తన కంఠమునున్నది, ఉన్నదింటిలో
స్వర్ణవిహీనకంఠి, సతి! వాహిని, కాల! మదొక్కతీరుగా
పూర్ణతనుండదోయి! తన పూర్వపు సంపద లాస్తిపాస్తులున్
జీర్ణములాయె నగ్రజుల చేతల, తండ్రిగతించినంతటన్! (ఉ)

చెవులను కరిగించే రసాయనము, శ్రావ్యత తన కంఠములో ఉన్నది. స్వర్ణవిహీనమైన కంఠముతో యింటిలో తన సతి ఉన్నది. కాలవాహిని ఎల్లపుడూ ఒకేతీరుగా పూర్తిగా ఉండదుకదా! తన తండ్రి గతించిన తరువాత, తన పూర్వపు సంపదలు, ఆస్తి పాస్తులు అన్నల చేతలవలన జీర్ణములైపోయాయి!

ముందటి చూపు లే, దొకటి ముద్దయు జారదు గొంతులోనకున్,
వందలు బంధుకోటు లొదవం గనువిందుగ పంక్తులుండకన్,
వందులు కూచిపూడిభగవంతులు మందలు పందిరందు, భల్!
వందల, వేల నిల్చునవి, వంతులుగా ఎకరమ్ము లమ్మినన్? (ఉ)

ముందుచూపు లేదు. వందలుగా బంధుకోట్లు నిండిన పంక్తులు భోజనానికి లేకుండా ఒక ముద్దకూడా గొంతులోకి జారదు.

వందిమాగధులు, కూచిపూడి భాగవతులు పందిరిక్రింద మందలుగా ఉండేవారు. యిక వందలు, వేలు ఎన్ని ఎకరాలు మాత్రం నిలుస్తాయి వంతులు వేసుకుని అమ్మితే?

వందల కొలదుగ ఎకరా
లుం దరిగెను, కరిగెను కలలుం గనినటులన్!
చిందర వందర చెందిరి,
ముందటి పే రింగువనుసి ముడిచిన గురుతై! (కం)

వందలకొద్దీ ఎకరాలు కలలు గన్నట్లు తరిగిపోయాయి. తమ ముందటి పేరు మాత్రం యింగువ నుసి ముడిచిన గురుతుగా మిగిలిపోయింది. చిందర వందర అయిపోయారు!

ఉన్నతమైన సంపదగ ఊరక కుందని డెందముండగన్,
ఉన్నది నేటిదే కదర, ఉండదు సంపద ఒక్కరీతిగా,
నున్నది రాతయిట్టులని, ఓరిమి నేరిని దూరకెన్నడున్,
అన్నల పిల్లలందరిని యక్కున జేర్చుక యుండెనప్పురిన్ (ఉ)

ఊరకే చింతించని ప్రశాంతమైన మనసుతో, యీరోజున మనకున్నదే నిజముగా ఉన్నది, సంపద ఒకేరీతిగా ఎప్పటికీ ఉండదు, మన రాత యిలా ఉన్నది అని, ఓర్మితో, ఎవరినీ ఎన్నడూ నిందించకుండా, అన్నల పిల్లలను తన అక్కున చేర్చుకుని ఆ నేలకొండపల్లిలో ఉన్నాడు ఆ వేంకట రామారావు.

జనకుడు వేంకట రాముడు,
జననియు పుట్టింట సీత, జానకి యను పే
రును తన మెట్టింట గొనెను,
తన అత్తయు సీత యగుట తగదను నుడువున్ (కం)

నా (గ్రంథకర్త) జనకుడు వేంకట రామారావు. జనని పుట్టింటిలో 'సీత', మెట్టినింటిలో 'జానకి' అనే పేరును పొందింది, తన అత్తగారి పేరు కూడా 'సీత' కావడం వలన, అత్తా కోడళ్ళకు ఒకే పేరు ఉండకూడదు అనే లోకోక్తి ప్రకారం.

ఆ రాముడు, సతి జానకి,
ఈ రాముడు జానకియును ఎంచగ సములౌ!
ఘోరాటవిలో వా రన,
పోరాటము కొండపల్లి భూమిన వీరున్ (కం)

ఆ శ్రీరాముడు, జానకి, ఈ రాముడు జానకి ఎంచి చూస్తే సమానులే! ఆ రాముడు, జానకి ఘోరాటవిలో తమ పోరు సలిపారు, ఈ రాముడు జానకి కొండపల్లి భూమిన తమ పోరు సలిపారు. వారిలానే వీరూ కష్టాలను అనుభవించారు!

తాత ధార్మికుండు, దాన గుణమునందు
వేంకటేశ్వరుండు వేల్పు తరువు!
నాన్న కన్నలన్న, నరసింహుదును కిషన్
రాయ శర్మలన్న రతియు మిన్న! (ఆవె)

నా (గ్రంథకర్త) పితామహుడు వేంకటేశ్వరరావు దానగుణములో కల్పవృక్షమువంటి వాడు. నా తండ్రికి తన అన్నలు నరసింహారావు, కిషన్ రావు అంటే ప్రేమ మిన్న!

కృష్ణరాయ శర్మ, కృష్ణుండు, రాముండు,
నాదు అగ్రజుండు నటుడు , నాలి!
గుంభనంబుగుండు, గురుడు, నిబ్బరముగా
మాట కరకు, నాదు మనసు చెరకు! (ఆవె)

నా (గ్రంథకర్త) అన్న కృష్ణారావు నటుడు, రంగస్థల కృష్ణుడు, రాముడు, నాలివాడు, నిబ్బరంగా, గుంభనంగా ఉంటాడు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగి. నాకు మాట కరకు, మనసు చెరకు!

ఆపస్తంభము సూత్రము,
ఆ పరము పరాశరునిది యైనది గోత్రం,
బా పరహితులు ఋషులు గాం
చన్ పరమ పరాశరుడును, శక్తి, వశిష్టుల్! (కం)

ఆపస్తంభ సూత్రములో, పరాశర గోత్రములో, ఆ పరహితులైన (యితరుల హితవు కోరుకునే, యిహమును కాక పరమును కోరుకునే) ఋషులు పరములు, పరాశరుడు, శక్తి, వశిష్టుడు ఋషులుగా జన్మించాను.

ఘనముగ బుట్టితి వంశము
వనముగ, బట్టితి మనమున బమ్మెరవన నం
దనమున సురతరువగు పో
తనయను ఘనముని పదముల, తా నా గురుడౌ (కం)

యిలా వనంవారి వంశములో జన్మించాను. నా మనసులో బమ్మెర అనే నందనవనములో పుట్టిన పోతన అనే కల్పవృక్షము వంటి ఘనుడైన ముని పదములను పట్టుకున్నాను. ఆయనే నా గురువు.

పుట్టుక పుణ్యభూమినన పూర్వపు సంచిత మెట్టిదెట్టిదో!
పట్టినవాడ పోతనవి పాదము లెంతటి భాగ్యశాలినో!
పట్టను, పట్టినాడ నన పట్టును వీడ, మరింతగట్టిగా
పట్టుటెగాని, పట్టెదను పంకజనాభుని పాదపద్మముల్! (ఉ)

నా పూర్వజన్మ సంచితం ఎంత పుణ్యమైనదో, పుట్టుకను పుణ్యభూమి నేలకొండపల్లిలో పొందాను. నేనెంతటి భాగ్యశాలినో, పోతన పదములను పట్టుకున్నాను. నేను పట్టుకోను, పట్టుకున్నానంటే వదిలిపెట్టను, మరింత గట్టిగా పట్టుకోవడమే కానీ! యిక పంకజనాభుని పాదపద్మములను పట్టుకుంటాను.

వ.
అని నిజ పరిచయము నెపమిడి, జననీ జనకులను, అగ్రజుని, పితృసమానులను, పితామహులను ప్రస్తుతించి వారి పాదపద్మములకు ప్రణామములిడి నే జెప్పబోవు కథా ప్రారంభము ఎట్టిదనగా.

ఆవిధముగా నా పరిచయము అనే నెపముతో తల్లిదండ్రులను, అన్నను, పితామహుడిని పొగిడి, వారి పాదములకు నమస్కరించి నేను చెప్పబోయే కథా ప్రారంభము ఎలాంటిది అనగా.

కథా ప్రారంభము

దేశము, ధర్మమున్ మరియు దేహమునిచ్చిన కన్నతల్లి, సం
దేశము ముగ్గురమ్మలది దేహము, నీదిది కానెకాదు, ఆ
దేశము వారికైనదిర దేహము! సోదర! వారికైన యా
కాశ ధరాతలంబు లవకాశము వాసము గుళ్ళగుండెలన్! (ఉ)

దేశము, ధర్మము, దేహమునిచ్చిన కన్నతల్లి, దేహము ఈ ముగ్గురుకీ చెందినది అనేది సందేశము. ఈ దేహము నీ సంపద కాదు. కనుక వీరికోసము నియోగించిన దేహమే దేహము అన్నది ఆదేశము. కనుక సోదరా! వారికోసము ఉపయోగపడిన దేహము ఆకాశము, భూమి ఉన్న పర్యంతమూ గుండె గుడులలో నివాసము పొందుతుంది.

దేశము కోసము, ధర్మము కోసము, దేహమునిచ్చిన తల్లికోసము

దేహాన్ని, జన్మను ఉపయోగించినవారు ప్రజల గుండెలగుడులలో దేవుళ్ళుగా నిలిచిపోతారు.

ధీరులు సైనికుల్ మనకు దిక్కుల దేవులు, అష్టదిక్పతుల్!
క్రూరులు, చోరులై జొరెడు ఘోర నరాంత పిశాచిమూకలన్
బీరమణంచి వంచుటలొ, పీనుగులన్ మరి పాతిపెట్టుటో
వా రన జేయకుండిన నివారణ, మేదిర శాంతి? సోదరా! (ఉ)

ధీరులైన సైనికులు మనకు దిక్కు ఐనవారు, దేవతలు, అష్టదిక్పాలకులు. వారు గనుక క్రూరులు, చోరులు ఐన ఘోర విదేశీ పిశాచి మూకలను పొగరు అణిచి లొంగదీయడమో, పీనుగులను చేసి పాతిపెట్టడమో చేయకుంటే శాంతి, నివారణము ఎక్కడ సోదరా?

యని దలచిన నివి మెదలెను,
కనులు, మదులు కరగు కథలు కదరా వినుటన్!
వినిచెద! విధి యని తలచెద!
అనుటలు, వినుటలు గద నతు లా విధిసతికిన్! (కం)

అని ఆలోచించగా ఈ కథలు మెదిలాయి. ఈ కథలు వినడం వలన కనులు, మనసులు కరిగిపోతాయి. కనుక ఈ కథలను వినిపిస్తాను. అలా వినిపించడం నా కర్తవ్యం అని తలుస్తాను. మంచి పలుకులు అనడము, వినడము అంటే ఆ సరస్వతీదేవికి నతులు చేయడమే కదా!

ఏ మాశించిన, వేటికా గగనమం, దే లబ్ధికై మేఘముల్?
తా మాశించెద రేమి యాప్రభలిడన్ తారాధిపుం దర్కుడున్?
ఏ మాశల్ సరసుల్, తరుల్, పవనముల్ ఏమిచ్చుటల్ హెచ్చుటల్?
తా మాశించెద రేమి బాయుటల కా దారాదులన్ సైనికుల్? (శా)

ఆకాశములోని మేఘాలు ఏమి ఆశించి, ఏమి లబ్ది కలుగుతుంది అని ముసురుకుంటాయి వర్షించడానికి? చంద్రుడు, సూర్యుడు ఆ వెలుగులను యిస్తున్నందుకు ప్రతిగా ఏమి ఆశిస్తారు? సరసులు, వృక్షాలు, గాలులు ఏమి ఆశతో, ఏమి యిస్తామని హెచ్చిపోతాయి? తమ భార్య మొదలైన ఆప్తులను పోగొట్టుకోవడానికి ప్రతిఫలంగా ఏమి ఆశిస్తారు సైనికులు? మేఘాలలాగా, చంద్రుడిలా, సూర్యుడిలా, సరసులలా, వృక్షాలలా, గాలులలా, తర, తమ, కుల, మత, జాతి, ప్రాంత, లింగ, జీవ వివక్ష లేకుండా, ఏ ప్రతిఫలమూ ఆశించకుండా పరోపకారార్థమై జీవిస్తారు సైనికులు.

సత్యముకావు భూములును, సంపద జానెడు పొట్టకోసమై
హత్యలు ఆత్మవంచనల? హా! యదుగుల్గద ఆరు కాటిలో
నిత్యము నీ ప్రతీక్షగొని నిల్చున వాఖరి కాస్తి నీ కదే!
భత్యము, తమ్ముడా! తుదకు భాగ్యము కర్మల మంచిచెడ్డలే! (ఉ)

భూములు, సంపద సత్యమైనవి కావు, అంటే శాశ్వతమైనవి కావు, భ్రమలు. జానెడు పొట్టకోసం హత్యలూ, ఆత్మవంచనలా? అయ్యో! నిత్యమూ నీకోసం ఎదురుజూస్తూ నిలిచేవి, చివరికి నీ ఆస్తి వల్లకాటిలో ఆరు అడుగులే కదా! నీకు చివరికి లభించే ప్రతిఫలము, నీ భాగ్యము నువ్వు చేసే పనుల మంచీ చెడులే!

యోగముచేత గాదు, ధనయోగముచేతను, భృత్యకోటి స
ద్యోగముచేత, కర్మముల యోగముచేతను, భక్తియోగమున్,
భోగముచేతగాదు, విను! భూతలమందున నిక్క మొక్కటన్
త్యాగముచేతనే నరుడు తా నమరుండవుగా తుదిన్, మదిన్! (ఉ)

యోగమువలన కాదు, ధనయోగము అంటే సంపదవలన కాదు, భృత్యకోటి సద్యోగము, అంటే, అంగబలమువలన కాదు, కర్మముల యోగమువలన కాదు, భక్తివలన కాదు, భోగమువలన కాదు, విను! ఒక్క

త్యాగమువలననే భూమిమీద, మనసులలో మానవుడు నిజంగా అమరుడు అవుతాడు!

సైనిక! యో పురోహితుడ! సంఘము గావ పరిశ్రమించుటల్,
దైనిక బాధ్యతంచు జనతా ఘన రక్షణ దుష్ట శిక్షణల్,
పూనిక పుణ్యపాద పరిపూర్ణపరిక్రమ విష్ణుపాదమున్!
నేనిక నేమి చెప్పుదుర? నీకిది, పూరుష సూక్తముక్తమున్! (ఉ)

సైనికుడా! ఓ పురోహితుడా! పౌరుల క్షేమమును కోరి పరిశ్రమించడంలో, నీ నిత్య కర్తవ్యంగా దీనులను రక్షించడంలో, దుష్టులను శిక్షించడంలోనూ, పట్టుదలగా నీ పుణ్యపాదాన్ని ఆకాశముదాకా చుట్టిరావడంలోనూ నువ్వు 'పురుషుడివి' అంటే ఆదిపురుషుడివి, అంటే శ్రీహరివి! నేనింకా ఏమి చెప్పగలను? నీకు 'ఈ పురుష సూక్తము' చెబుతున్నాను!

కావున మీవిరా అమరగాథలు! మీ వన జన్మలన్ననో!
చావులులేని జన్మలవి! జాతికి అంకితమైన జన్మముల్!
పూవులు, దేశమాతపదపూజకు పూచు గులాబి మొగ్గలున్!
కావలె నింటి కొక్క రణకాంక్షలసింహపుకూన, నీవలెన్! (ఉ)

కనుక, సైనికుడా! మీవి అమరగాథలంటే! జన్మలంటే మీవి జన్మలు! మీవి చావులు లేని జన్మలు! జాతికి అంకితమైన జన్మలు. దేశమాత పాదాలను పూజించడానికి పూచిన గులాబీ పూల మొగ్గలు! యింటింటికీ నీలాంటి రణకాంక్షల సింహపు కూన ఒకటి కావాలి!

వ.

అని ఒకానొక దినమున వీర సైనికుల త్యాగ, ధైర్య, శౌర్య త్రివేణీ సంగమమైన పవిత్రజీవన గంగావాహినిని స్మరించినంతన వారి జీవనకథా లహరులయందు మునకలు వేసి మురిసిపోయిన నేను నా మానసంబున యివ్విధమున వారిని ప్రస్తుతింప సాగితిని.

అలా ఒకరోజున వీరులైన సైనికుల త్యాగము, ధైర్యము, శౌర్యము అనే త్రివేణీ సంగమమైన పవిత్రమైన జీవనగంగా ప్రవాహమును స్మరించి, వారి జీవనకథా లహరులలో మునకలువేసి, సంతోషించిన నేను మనసులో ఈవిధముగా వారిని కొనియాడడం మొదలుబెట్టాను.

వందనమో సిపాయి! విరివానలు నీకు తుపాకిగుండ్లు! నీ
చందమ? సోదరా! అరుణ చందనమౌ చిరువెచ్చ నెత్తురుల్
పొందుగ, దేశమాత మది పొంగగ శ్రీకర శీకరమ్ములై,
విందుగ, భారతీధ్వజము, వీరవరా! ఎగరేతువా! భళా! (ఉ)

ఓ సిపాయీ! నీకు వందనము. తుపాకీ గుండ్లే నీకు పూలవానలు. నీ విధానమా, నీ చిరువెచ్చని నెత్తురులు అనే శ్రీకరమైన ఎర్ర చందనపు చిందుల పొందుతో దేశమాతకు మనసు పొంగేట్లు చేసి, భారతీ ధ్వజమును విందుగా ఎగురవేస్తావుగా, వీరవరా! భళా!

భారత వీరుడా! విజయ భాసుర భీకర యుద్ధభూమిలో
పారెడి శోణితంబునది వారెవ! నీవొక రాజహంస! నీ
దారుణ ఖడ్గధారల యథాతథులౌ రిపు వీచి నాచు! ఆ
ధారుణి రాలుగా యథమ తామరతూండ్లు, శిరస్సుచెండ్లుగా! (ఉ)

భారతవీరుడా! నీ విజయముతో ప్రకాశించే భీకరమైన యుద్ధభూమిలో పారే (శత్రువుల) రక్తమే నది. వారేవా! ఆ శత్రువుల రక్తము అనే నదిలో నీవొక రాజహంసవు. నీ దారుణమైన ఖడ్గపు పదునుకు చెల్లాచెదురు అయ్యే శత్రువుల అలలే నాచు. ఆ భూమి మీద రాలుతాయి కదా అథములనే తామర తూండ్లు, వారి తలలు తామరపూల చెండ్లుగా! రాలుగాయి అథములనే తామర తూండ్లు, వారి శిరస్సులనే తామరపూల గుత్తులూ కదా!

సైనిక! కర్మయోగి! ముని, సాధులు, యోగులుగారు నీ సముల్
మౌనముగా రణంబుగొని మానక సాగి, విదేశి మూకలన్
పీనుగు పెంట చేయుటకు, భీతి, రుజల్, తృషయున్ జయించుటన్,
కానల నీవు , శోకరసగాథలు నీ పితరుల్, సతీ సుతుల్! (ఉ)

సైనికుడా! ఓ కర్మయోగీ! మునులు, సాధువులు, యోగులు నీతో సమానులు కారు. మౌనముగా యుద్ధభూమిలో విరమించకుండా విదేశీ మూకలను పీనుగు పెంట చేయడంలోనూ, భయాన్నీ, రోగాన్నీ, దాహాన్నీ జయించడంలోనూ వారు నీతో సమానులు కారు (ఎందుకంటే వారు చేసేది తమ ముక్తికోసమే కనుక) నీవు అడవులలో ఉంటావు, నీ తల్లిదండ్రులు, భార్యా పిల్లలూ శోకరసము నిండిన గాథలుగా ఉంటారు!

నిన్నటి ఊసులేదుకద! నెన్నగు మోమున నీలిజాడలున్
ఎన్నడు రావుగా! ఒకట నెంచుచు సంగ వియోగ దుఃఖముల్,
అన్న! సిపాయి! మా కొరకు అండగ కొండల కోనలందు యే
మన్నను దేవుడే! భరత మాతకు ఆతత సేవకోసమే! (ఉ)

సైనికుడా! నీకు నిన్నటి ఊసులేదు కదా! చిరునవ్వులు చిందే నీ ముఖంలో ఎన్నడూ విషాదపు నీలిజాడలు ఉండవుకదా! కలయికను, ఎడబాటును, దుఃఖమును ఒకటిగా భావిస్తూ, మాకోసం అండగా కొండలలో, కోనలలో ఉండే మా అన్న, సిపాయి, ఏమన్నా దేవుడే! ఆతడు నిరంతరమూ భారతమాతకు సేవకోసమే!

పండుగ లేదుగా, రుచిగ పబ్బము, సుబ్బరమైన తావులన్
నిండుగ నోచుకో వచట నిద్రకు! నీసతి, నిన్నుగన్న యా
పండిన యాకు ల ట్లిచట! వందనమోయి సిపాయి! ధీ నిధీ!
గుండెల చేతుమా గుడుల? కూరిమి మా నవనాళ్ళ గంటలున్!(ఉ)

సైనికుడా! నీకొక పండుగ, రుచిగా పబ్బము లేవుకదా! శుభ్రమైన స్థలాలలో నిండుగా నిద్రకు కూడా నోచుకోవు అక్కడ. నీ భార్య, పండుటాకులలాంటి నీ తల్లిదండ్రులు కూడా యిక్కడ నీలాగే, పండగలు, తిండి, ప్రశాంతమైన నిద్ర లేకుండా ఉంటారు, నీ ఆలోచనలతో. సిపాయీ! ధీ నిధీ, నీకు వందనము! నీకు మా గుండెలను గుడులుగా చేసి మా నవనాళ్ళను జేగంటలుగా చేసి ఘల్లున మ్రోగించమా?

కాకర పూలుగా కదన కాహళ కాసర బీసర ధ్వనుల్!
సోకుల వెన్నెలల్ మడుగు శోభలు వెచ్చని రక్త ధారలున్,
పాకెడి పాముబిళ్ళలు తుపాకిభుజాలతొ మీరు, మీ బుసల్!
ప్రాకటమౌ దివాళులవి, ప్రాభవశోభ లివే నివాళులున్! **(ఉ)**

యుద్ధరంగంలో భేరీల ధ్వనులు నీకు కాకరపూల చిటపటలు. వెచ్చని నెత్తుటి శోభలే నీకు వెన్నెలమడుగులు. భుజాలకు తుపాకీలతో బుసలు కొడుతూ పాకే మీరే పాము బిళ్ళలు. విస్పష్టమైన దీపావళులు మీవి. వైభవమైన శోభలు అవి. యివే మీకు నా నివాళులు.

నిత్యపుశోభనంపు వర! నీ టగు వీరకుమార! మార! నీ
సత్యపు సోకులౌసతులు సంగర భూ, జయ నాకలక్ష్ములున్
ముత్యపుమూటగా ముదిత మూడుది యాడుది ధీరతన్, భళా!
చైత్యము ఆమెజీవనము! చైత్రమొ, మాఘమొ, వేచి చూచుటల్! (ఉ)

సైనికా! ఓ నిత్యశోభనపు వరుడా! నీటైన వీరకుమారుడా! మన్మథుడా! నిజమైన సొగసులున్న భార్యలు ముగ్గురు నీకు! యుద్ధభూమిలో విజయలక్ష్మి, స్వర్గలక్ష్మి యిద్దరు కాంతలు. ముత్యపు మూటగా మూడవది నీ ఆడుది, నీ ధర్మపత్ని. ఆమె జీవనము ఒక చైత్యము, ఒక మౌన సౌధము. ఆమె జీవనం చైత్రమో మాఘమో, వేచి చూడాలి. చైత్రమాసము వసంత ఋతువు, మాఘము శిశిర ఋతువు. నీవు యుద్ధభూమినుండి తిరిగివస్తే ఆమె జీవితము వసంతము, నీవు వీరస్వర్గాన్ని పొందితే ఆమె జీవనము శిశిరము!

దీనులగాచు దాతలు, దధీచులు, మీరలె సవ్యసాచులున్,
కానము మీ సమానులను, కారొకొా మీ రరినాగభేదులున్,
పూనిక ధర్మమందు పరిపూర్ణముగా, పరవీరచక్రమున్
తానుగ కేళిగా వలచి, తాలిమి చేరు పరాక్రమక్రమన్! (ఉ)

సైనికుడా! మీరు దీనులను కనికరించి కాపాడే దధీచులు. యుద్ధరంగంలో మీరు సవ్యసాచులు. మీ సమానులను చూడము. మీరు శత్రువులు అనే పర్వతాలను భేదించే దేవేంద్రులు. ధర్మమునందే మీ పూనిక, పట్టు పరిపూర్ణముగా ఉంటుంది. పరమవీరచక్రము కేళిగా, మీ పరాక్రమాన్ని వలచి పరాక్రమాన్నిబట్టి మిమ్మల్ని తనంత తానుగా చేరుకుంటుంది.

వైనమ! వైనతేయు దరివాహము, పామిడి, ప క్షిసీ! భళా!
పైనము కౌను నీ కనగ ఫాలవికీర్ణ విరోచులన్నభల్
ఫేనము కానుపౌ క్షిపణి, భేదన ముచ్చుల కుత్సితాల! నీ
గానములే పవిత్రములు! గాథలు శత్రులతాలవిత్రముల్! (ఉ)

అదేమైనా విశేషమా, గొప్పా, శ్రీహరి వాహనము ఒక పక్షి, వినతా సుతుడు, గరుత్మంతుడు. నీ వాహనము ఆకాశంలో శివుడి మూడో కంటిలా జ్వాలలను వెలువరించే, పొగల నురుగులను వెలువరించే క్షిపణి! నీవు ముచ్చుల కుత్సితాలను భేదిస్తావు. ఓ సైనికా! నీ గానములే పవిత్రములు. నీ కథలు శత్రువులు అనే లతలను ఖండించే కొడవళ్ళు!

సైనికుని దశావతారములు

మీనమహాశరీరి హరి మింటికి మంటికి నేకధారలా
వానకు నావగా విలయ వారిధి నీదుచు గాచినాడనన్,
కానగరాని ముష్కరుల గాథ లగాధ పయోధి వీథులన్
పూనిక సున్నజేసెదవు, పూజ్యుడ! నావిక వీరసైనికా! (ఉ)

మత్స్యావతారము ధరించిన శ్రీహరి ఆకాశానికి భూమికి ఏకధారగా కురుస్తున్న వర్షములో నావగా ప్రళయ సముద్రాన్ని ఈదుతూ రక్షించినట్లు కంటికికనిపించని ముష్కరుల కథలను లోతులు తెలియని సముద్రపు దారులలో పట్టుదలతో ముగిస్తావు వీర నావిక సైనికుడా! నీవు పూజ్యుడవు.

కొండగ వీపుమీద జనకోటుల ఆశలు, నీ ప్రయాసలన్
పండుగ మాకు, జీవిక శుభాకలితమ్ము, సుధారసమ్ములన్
గుండియ మండుచున్ గరళ కుంఠిత కంఠగ కాంత యింట తా
నుండగ, నీదు జీవిక యనూన రణాంబుధులన్ మథించుటన్! (ఉ)

సైనికుడా! నీ వీపుమీద కోట్లాది ప్రజల ఆశలను కొండ మోసినట్లు మోసే కూర్మావతారుడవు నువ్వు. నీ ప్రయాసల ఫలితంగా మాకు పండుగ, శుభమైన జీవనము, అమృతపు రుచులు ఉంటాయి. నీ ఇల్లాలు తన గుండెలు మండిపోతూ హాలాహలాన్ని గొంతులోనే దిగమింగినట్లు నీ యింటివద్ద ఉంటుంది, నీవు అనంతమైన, నిండైన యుద్ధసాగరాలను మథించడంలో జీవికను గడుపుతావు.

ఆదివరాహు డా ధరణి నాదరమొప్పగ నుద్ధరింప, నో
సోదర! తా రసాతలము జొచ్చిన జచ్చిన ముచ్చు ఒక్కడే!
ప్రోదులుగా రిపుల్, పొలయ బోరుట, యోధుడ, నోటిమాటలా?
నీదిర సైనికా పదును! నీకగు మంగళ హారతుల్, నతుల్! (ఉ)

ఆదివరాహావతారములో ఆ శ్రీహరి భూమిని ఉద్ధరించడానికి రసాతలానికి దిగినపుడు చచ్చినవాడు శత్రువు ఒక్కడే. నీవో కుప్పలు కుప్పలుగా, సమూహాలుగా ఉన్న శత్రువులు నశించేట్లు పోరు చేస్తావు, అదేమన్నా నోటి మాటలా? సైనికా! నీది పదును, గొప్పదనము అంటే, వరాహస్వామికన్నా కూడా! నీకు మంగళహారతులు ! నీకు నమస్సులు!

ఇందున అందునం గలను, యిందుకు సందియ మెందుకంచు, తా
క్రందుగ సింహమై గలిగె కంభమునన్, హరి, సైనికా! కనన్,
బందుల, సందులందనక, భారతమందున ఎందుజూచినన్
అందున, హద్దులందు, సరి, యందర కందగ నీవు కేసరీ!! (ఉ)

ఇక్కడా, అక్కడా అన్నిచోట్లా నేను ఉన్నాను, యిందుకు సందేహమెందుకు అని శ్రీహరి స్తంభములో నృసింహుడై నిలిచాడు. ఆలోచిస్తే, బందులలో, సందులు, గొందులలో అనే కాకుండా, భారతదేశములో ఎక్కడ చూస్తే అక్కడ, సరిహద్దులలో కూడా అందరికీ నువ్వు అండగా ఉండే సింహానివి!

వామనమూర్తి పాదములు వామనతన్, తల, నింగి, నేలపై,
తా మివి నీదుపాదములు తాకు నభంబు, ధరా, రసాలయం
బా? మరి దాని లోతులును! వామనుడాతను, నీవెగా భళా!
నీమమునన్ పరాక్రమము నిండు నిజక్రమ విక్రముందనన్! (ఉ)

వామనావతారములో శ్రీహరి పాదాలు చులకనగా ఒక (బలి)తలమీద, ఆకాశంలో, నేలపై నిలిచాయి. అదేమన్నా గొప్పా? నీ పాదాలు ఆకాశాన్ని, నేలను, రసతలాన్ని (సముద్రాన్ని) మాత్రమే కాక, దాని లోతులను కూడా తాకుతాయి! త్రివిధ దళాల సైనికుడవు నీవు! వామనుడు, అంటే తక్కువవాడు ఆయనే, ఆ వామనుడే. భళీ! నువ్వు క్రమశిక్షణలో, నియమములో నిండైన పరాక్రమముతో క్రమక్రమంగా ఎత్తులకు పెరిగే అనంతమైన పరాక్రమము కలిగిన విక్రముడివి.

తల్లినిజంపె, చంపె తన తండ్రిని జంపిన రాజులందరన్,
ఝల్లన వేడినెత్తురుల జాలుల తండ్రికి రక్తతర్పణల్
చెల్ల కుఠారరాముడన చేసెను, సైనిక! నీ వతండవౌ,
తల్లిని, భారతీసతిని తల్లిగ తండ్రిగ గాచుటల్ వినా! (ఉ)

సైనికా! నువ్వు పరాక్రమములో పరశురాముడివి. పరశురాముడు తన తల్లిని చంపాడు. తన తండ్రిని చంపిన రాజులందరినీ చంపాడు. వారి వేడి నెత్తురుజాలులతో తండ్రికి రక్తతర్పణలు చేశాడు. నువ్వు మాత్రం నీ తల్లి ఐన భారతమాతను చంపకుండా, తల్లిగా తండ్రిగా రక్షిస్తావు. అదొక్కటే నీకు పరశురాముడికి తేడా! కనుక ఆ పరశురాముడికన్నా నువ్వే మెరుగు.

తండ్రిది మాట, యిచ్చినది తల్లికి గాదుర, గాదు పిన్నికిన్
తండ్రిని సత్యవాక్యునిగ తాను నిరూపణ జేయనెంచి, తా
వేంద్రము లేక, కారడవి వేద్యుడు జొచ్చె, సతీసమేతుడై
తండ్రిని, తల్లినీ, చెలిని దక్కి, రణాంగమునందు సైనికా!
తండ్రివి! రాముడా! పుడమితల్లి ఋణంబులనీగ ఒంటివా! (ఉ)

మాట యిచ్చినది తండ్రి. ఆ మాటను యిచ్చింది కూడా తల్లికి కాదు, పిన్నతల్లికీ కాదు, సవతి తల్లికి. అయినా తన తండ్రిని సత్యవాక్యునిగా నిరూపణ చేయాలని ఏ బాధ, తాపమూ లేకుండా శ్రీరాముడు అడవికి వెళ్ళాడు, సతీసమేతుడై. నువ్వు మాత్రం తండ్రిని, తల్లిని, నీ చెలియని అందరినీ వదిలి యుద్ధభూమిలో ఓ తండ్రీ, ఓ రాముడా! ఈ నేలతల్లి ఋణాన్ని తీర్చుకోడానికి ఒంటరిగా వెళ్తావు కదా!

మర్మపు నవ్వు, లల్లరులు, మాయలు, ఆటలు పాటలన్ననో
కర్మలు శిష్టరక్షణలు, కాన నవశ్యము, దుష్టశిక్షణల్!
ధర్మమునందు, సైనికుడ! దానవదారణ కారణమ్ములన్
శర్మద శాంతిదాతవుగ, శౌరివి, నిగ్రహ విగ్రహమ్ములన్! (ఉ)

మర్మమైన నవ్వులు, అల్లరిపనులు, మాయలు, ఆటలు పాటలు అనేగానీ, చేసేది మాత్రము శిష్ట రక్షణలు, చూస్తే తెలిసేది తప్పకుండా దుష్ట శిక్షణలే! ధర్మమును నిలబెట్టడంలో, రాక్షసులను సంహరించడంలో, సుఖాన్ని,శాంతిని యివ్వడంలో, నిగ్రహంలో, ఆకారంలో నువ్వు శ్రీకృష్ణుడితో సమానుడివి సైనికా!

బుద్ధుడవోయి సైనికుడ! భూతలమెల్లయు శాంతి నిండగన్
బద్ధము వీరకంకణము! భానుడ వౌదువు, చంద్రుడీవెగా!
యుద్ధము దీనరక్షణకు, యోద్ధవు దుష్ట నికృష్ట శిక్షణన్!
సిద్ధుడ! ఎన్నడైన నువు సీమల మీరితె, రాజ్యకాంక్షలన్? (ఉ)

సైనికుడా! నువ్వు బుద్ధుడివి! భూతలమంతా శాంతి నిండాలని నువ్వు వీరకంకణం కట్టుకుంటావు. యుద్ధంచేయడంలో భీకరుడైన సూర్యుడివి, దీనులను చల్లగా చూడడంలో చంద్రుడివి నువ్వు. దుష్టులను, నికృష్టులను శిక్షించడంలో నువ్వు ఎప్పుడూ యోధుడివి. సైనికా నువ్వు సిద్ధుడివి. నీ శక్తియుక్తులను స్వార్థానికి ఎన్నడూ ఉపయోగించని వాడివి. నువ్వెన్నడైనా రాజ్యకాంక్షతో సీమలను దాటావా? లేదు!

కల్కివి కాలరాయుటల కర్కశ నీచ రణోగ్రవాదులన్,
ఉల్కవు, పాతకాళిపతనోద్ధత సూచిక వేగుచుక్కవౌ,
ముల్కివి, ముచ్చుగుండియల మూకల తుచ్ఛుల బుచ్చ చెచ్చెరన్!
కుల్కుల సైనికా! యముడ, కూటరి కుత్తుక లుత్తరించుటన్! (ఉ)

కర్కశులు, నీచులు, యుద్ధోన్మాదులు, ఉగ్రవాదులు ఐన వారిని కాలరాయడములో నువ్వు కల్కివి. ఆ పాపుల పతనాన్ని సూచించే ఉల్కవు నువ్వు. నువ్వు వేగుచుక్కవు (గూఢచారివి) ముచ్చుల గుండెల్లో నువ్వు ముల్లువు. కులుకుల సైనికుడా! తుచ్ఛ మూకల తలలు ఖండించడంలో, వారిని సంహరించడంలో నువ్వు యముడివి!

నాశము నీకులేదనుచు, నాథ! విషానల మానుమంచు, తా
నీశుని గౌరిపంపినది, ఈవిష మేవిష మంచు, నెంచగన్
ఆశలు మోసులెత్తు వయ సామనిసంధ్య వియోగవహ్నులున్
ఈశ! విషంబెగా విషయ మీశుడ వీవుగ గౌరి తానుగా! (ఉ)

నాథా! నీకు నాశనము లేదు అంటూ హాలాహలాన్ని మ్రింగడానికి శివుడిని, తన భర్తను పంపింది పార్వతి, లోకుల క్షేమంకోసం. యిదేమన్నా పెద్ద విషయమా అని తేలిగ్గా భర్తను పంపింది విషము తాగడానికి. ఆలోచించి చూస్తే, ఆశలు మొలకలెత్తే వయసు, వసంతకాలపు సంధ్యలు, వియోగ జ్వాలలు విషమువంటివే కదా! చెప్పదలచుకున్న విషయము ఏమిటంటే, నువ్వు పరమశివుడివి, నీ భార్య పార్వతీదేవి! ప్రజల క్షేమంకోసం నిన్ను యుద్ధభూమికి పంపిన పార్వతి ఆమె, సంతోషంగా వెళ్ళిన పరమశివుడివి నువ్వు!

చక్రి సుదర్శనంబునను, చక్రము వర్తిలజేయుటన్ననూ!
వక్రతలేని చక్రమది, వారణరక్షకు, నక్రశిక్షకున్!
విక్రమ! నీవునూ పరమవీరసుచక్ర విశిష్టచక్రివే!
నక్రపుమూకలౌ రిపు వినాశన కారణ చక్రవర్తివే! **(ఉ)**

చక్రి అంటే శ్రీహరి. సుదర్శన చక్రాన్ని ధరించడంవలన, ప్రపంచము అనే చక్రాన్ని నడపడం వలన ఆయన చక్రి అయినాడు. ఆ సుదర్శన చక్రము వక్రత లేనిది, సాధువులైన ఏనుగులను రక్షించే చక్రము, దుష్టులైన మొసళ్ళను శిక్షించే చక్రము. ఓ విక్రముడా! నువ్వు కూడా చక్రివే, పరమవీరచక్రము అనే చక్రమును ధరించేవాడివే. మొసళ్ళ గుంపులవంటి శత్రువుల వినాశనానికి కారకుడైన చక్రివే!

వ.

యివ్విధమున ప్రస్తుతింపసాగిననూ తనివితీరక , వీరసైనికుల చరిత్రమును, వారికి బహూకరింపబడు 'పరమవీరచక్రము' యొక్క చరిత్రమును, ఆ దివ్య చక్రమును రూపు దిద్దిన 'సావిత్రి బాయి ఖనోల్కర్' అనెడి ఒకానొక మహనీయురాలి చరిత్రమును పద్యకావ్యరూపమున లిఖింప నిశ్చయించుకుని, నా కావ్యమును ఆ పవిత్ర మూర్తికే అంకితముగా సమర్పింపవలెనను కోరిక నా యదృష్టము వలన జనించి.

ఈవిధముగా పొగడడం మొదలుబెట్టినా తనివితీరక, వీరసైనికుల చరిత్రమును, వారికి బహూకరింపబడు 'పరమవీరచక్రము'యొక్క చరిత్రమును,ఆ చక్రమును రూపుదిద్దిన ' సావిత్రీబాయి ఖనోల్కర్' అనే ఒక మహనీయురాలి చరిత్రమును పద్యకావ్యముగా వ్రాయడానికి నిశ్చయించుకుని, ఆ కావ్యమును పవిత్రమూర్తియైన ఆ సావిత్రీబాయికే అంకితముగా సమర్పించాలి అనే కోరిక నా అదృష్టవశాత్తూ కలిగి.

అంకితము

తా నాద్యంతము లంతరంబుల సదా ధామంబు శ్రీ చక్రమున్
తా నాథున్, మృతు, జీవిగాగ గెలిచెన్ తా కాల దుశ్చక్రమున్
తా నిచ్చెన్ పరవీరచక్రము లతాంతం బౌ నితాంతంబులన్
చానల్ ముబ్బురు భారతీయ జన హృత్పద్మంబు పద్మంబులన్! (శా)

తాను ఆది, మధ్యము, అంతములందు నిరంతరమూ శ్రీచక్రమునందు ఉంటుంది ఒకర్తి. తాను తన నాథుడు మృతుడు ఐనవాడు పునర్జీవితుడు అయ్యేట్లుగా కాల దుశ్చక్రమును, మృత్యువును గెలిచింది ఒకర్తి. తాను పరవీరచక్రమును, పరమవీరచక్రమును ప్రసాదించింది పూబాలవంటి ఒకర్తి. ఎల్లప్పుడూ ఈ ముగ్గురు భారతీయుల మనసులు అనే పద్మములలో నెలకొని ఉంటారు.

సావిత్రుల్ ముగురమ్మ లీభువిని, నే సాష్టాంగముల్ మ్రొక్కెదన్,
వేవేలన్ కృతులన్ నుతింతు ఘనుడా విక్రం ఖనోల్కర్ సతిన్,
సావిత్రిన్, పరవీర చక్రవరదన్, సాధ్వీ శిరోరత్నమున్,
నా వీరావని సేనకిచ్చినది తా నా దివ్య నిర్వక్రమున్,
దావజ్వాలవిభాసమాన రిపుసంతాపప్రభాచక్రమున్! (శా)

ఈ భూమిమీద, భారతదేశంలో ముగ్గురు సావిత్రులున్నారు, ముందు చెప్పినట్లుగా. ఒక సావిత్రి జగజ్జనని సావిత్రి, అమ్మవారు. మరొక సావిత్రి యమధర్మరాజును ఎదిరించి తన భర్తను మరలా పొందిన సావిత్రి. మరొక సావిత్రికి, విక్రం ఖనోల్కర్ సతికి నేను సాష్టాంగ దండప్రణామములు చేస్తాను. వేల వేల కృతులతో, పద్యాలతో ఆమెను, సావిత్రిని, పరమవీరచక్రమును ప్రసాదించిన సాధ్వీ శిరోరత్నాన్ని నుతిస్తాను. ఆమె నా వీరభూమి సైనికులకు ఏ వంకా, వక్రతాలేని చక్రాన్ని, దావానలజ్వాలవలె శత్రువులను పీడించే, బాధించే ప్రభల చక్రాన్ని, పరమవీర చక్రాన్ని ప్రసాదించింది!

ఏదేశంబుననుండి ఎక్కడికనన్, ఎందెందు చిందాడ దా
సాదించున్ ఝరి, ఎల్లజీవుల పిపాసల్ దీర్పనేగా ధరన్!
ఆదేశంబటు లంతరాత్మదవగన్, ఆ మాన్య సావిత్రియున్
నాదేశంబున కాలుమోపిన దహో! నా సైన్యపుణ్యంబునన్! **(శా)**

ఏ దేశమునుండి ఎక్కడికి, ఎక్కడెక్కడ చిందులు వేసి ప్రవాహము భూమి మీది అందరు జీవుల దాహాన్ని తీర్చడానికే కదా సమీపిస్తుంది, ఏ భేదమూ లేకుండా. అలాగే తన అంతరాత్మ ఆదేశంతో, నా దేశ సైనికుల పుణ్య కారణంగా నా దేశంలో కాలుమోపింది ఆ గౌరవనీయురాలు సావిత్రి!

అంకితమిది యెకసతి, కక
ళంకితులగు దేశభక్తులగు సేనలకున్,
జంకుట లెరుగని సుతుల వ
శంకరమగు పరమవీర చక్రము నిడుటన్! **(కం)**

మచ్చలేని దేశభక్తులైన సైనికులకు, జంకడం తెలియని భారతమాత సుతులకు అందే పరమవీరచక్రమును యిచ్చిన కారణంగా, ఈ కావ్యమును ఒక నారీమణికి(ఆ సావిత్రీబాయికి) అంకితమిస్తున్నాను.

అంకితమిది సావిత్రికి,
అంకిత భారత ధరణికి ఆజీవనమున్,
కింకరుడను, తన శుభపద
పంకజముల మదిని నిల్పి భక్తిగ నిడెదన్! (కం)

తన జీవితమంతా భారతభూమికి అంకితమై బ్రతికిన సావిత్రికి ఈ కావ్యము అంకితము. ఆమెకు దాసుడను నేను. ఆమె శుభ పాదపద్మములను మనసులో నిలుపుకుని భక్తిగా ఆమెకు ఈ కావ్యమును అంకితమిస్తున్నాను.

సావిత్రి ఖనోల్కరు సతి
కిన్ వినతుల నిత్తు కదన కీర్తుల కథలన్,
జీవితములు భారతి పద
పావన పీఠిన విరులన బరచిన ఘనతల్! (కం)

తమ జీవితములను భారతమాతయొక్క పవిత్రమైన పాదపీఠంపై పూవులలాగా పరచిన కదన కీర్తులైన వీర సైనికుల గాథలను సావిత్రీబాయికి వినతులతో అంకితమిస్తున్నాను.

సావిత్రికి, నాహృత్సీ
మా వర్తికి, సాధుశీల, మాన్విత కనుచున్,
నావీ కథ లంకితముని
చా, వాడని పరమవీర చక్రపు విరులన్! (కం)

నా హృదయసీమలో నడయాడే సాధుశీల, మాన్యురాలు ఐన సావిత్రీబాయికి అంకితముగా వాడిపోని పూవులవంటి ఈ పరమవీరచక్ర కథలను అంకితముగా ఉంచాను!

పరమశివునిచేత నుతింపబడేవాడా! కొత్త పద్మమువంటి కనులు కలిగినవాడా!

యిది సాధ్వీమణి సావిత్రీబాయి ఖనోల్కర్ దివ్య స్మృతికి అంకితముగా, బమ్మెర పోతనాఖ్యు పదపరిచయ పులకిత గాత్రుడను, సజ్జన వేంకట రామరాయ పుత్రుడను, వేంకటేశ్వర రాయ పౌత్రుడను, సాహితీ ప్రియంభావుకుల ప్రియ మిత్రుడను, వేంకట వరప్రసాదరాయ నామధేయుండను అగు నాచే విరచితమైన 'పరమవీరచక్ర'మను నామంబు గల పద్య గద్య నిహిత నిస్తుల కావ్యమందు ప్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము

శ్రీధర! శుభకర సూచీ
భూధర సుస్థిర పదా! ప్రభో! వినుమయ్యా!
మాధవ! మధుసూదన! గౌ
రీధవనుత! జమిలివాయి రేడా! ప్రోడా! (కం)

శ్రీధరా! శుభకరమైన సూచీగిరి(సూది గుట్ట)పైన సుస్థిరముగా పాదములను నిలిపినవాడా! ప్రభో! మాధవా! మధుసూదనా! గౌరీపతియైన పరమశివునిచేత నుతింపబడేవాడా! జమిలివాయి (జమలాపురం) ఏలికా! నేర్పరీ! వినుమయ్యా! అని జమలాపురం క్షేత్రంలోవెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామిని శ్రోతగా చేసుకుని కవి తన కావ్యాన్ని వినిపిస్తున్నాడు.

(జమలాపురం తెలంగాణా రాష్ట్రంలోని సుప్రసిద్ధమైన పుణ్యక్షేత్రము. తెలంగాణా తిరుపతి అని ప్రసిద్ధిచెందినది. విజయవాడ–హైదరాబాద్ రైలుమార్గంలో విజయవాడ నుండి ముప్పావుగంట ప్రయాణము చేస్తే, ఎర్రుపాలెం స్టేషన్, అక్కడినుండి ఐదు కిలోమీటర్ల దూరము జమలాపురం. శ్రీకృష్ణదేవరాయలు, కాకతీయ ప్రతాపరుద్రుడు మొదలైనవారు దర్శించుకుని

మొక్కులు చెల్లించుకున్న చారిత్రక స్థలము, చాలా మహిమగల స్వామి వెలసిన పుణ్యక్షేత్రము)

వ. అది సేనానికరంబులకు వలయు శిక్షణాస్థలంబు.

అది సైనికులకు శిక్షణ యిచ్చే స్థలము.

అయ్యది వీరపుత్రచయ మాహవరంగమునందు శిక్షణల్
ఒయ్యన జేయు దేవళము నొద్దిక చేరిన వారు వీరులున్,
కయ్యపు భూములందు పగ గార్కొను మార్కొను కాలసర్పముల్
చయ్యని లేచి కాటుగొను శత్రుల సర్వుల గర్వ ఖర్వముల్. (ఉ)

అది వీరపుత్రులైన సైనికుల బృందము యుద్ధరంగమునందు శిక్షణ పొందు దేవాలయము! ఆ శిక్షణాలయంలో ఒద్దికగా చేరినవారు వీరులు, పోరాటపు భూములలో పగబట్టి శత్రువులను ఎదిరించే కాలసర్పములు ఆ సైనిక వీరులు. చయ్యని లేచి కాటువేసి, శత్రువులను కూల్చి, పరాజితులను చేసి, వారి పరువును, గౌరవాన్ని శూన్యము చేసే సైనికులు వారు, ఆ శిబిరంలో శిక్షణకోసం చేరారు.

వ. శత్రులతాలవిత్రులగు, పవిత్రులగు వీరపుత్రుల చరిత్రమును బోధించు సైన్యాధికారి యిట్లు ప్రారంభించెను!

శత్రువులు అనే తీగలను ఖండించే కొడవళ్ళవంటివారు, పవిత్రులు ఐన వీరపుత్రులైన సైనికుల చరిత్రను బోధించే సైన్యాధికారి యిలా ప్రారంభించాడు.

మొక్కులు చెల్లించుకున్న చారిత్రక స్థలము, చాలా మహిమగల స్వామి వెలసిన పుణ్యక్షేత్రము)

వ. అది సేనానికరంబులకు వలయు శిక్షణాస్థలంబు.

అది సైనికులకు శిక్షణ యిచ్చే స్థలము.

అయ్యది వీరపుత్రచయ మాహవరంగమునందు శిక్షణల్
ఒయ్యన జేయు దేవళము నొద్దిక చేరిన వారు వీరులున్,
కయ్యపు భూములందు పగ గాఱ్కొను మాఱ్కొను కాలసర్పముల్
చయ్యని లేచి కాటుగొను శత్రుల సర్వుల గర్వ ఖర్వముల్. (ఉ)

అది వీరపుత్రులైన సైనికుల బృందము యుద్ధరంగమునందు శిక్షణ పొందు దేవాలయము! ఆ శిక్షణాలయంలో ఒద్దికగా చేరినవారు వీరులు, పోరాటపు భూములలో పగబట్టి శత్రువులను ఎదిరించే కాలసర్పములు ఆ సైనిక వీరులు. చయ్యని లేచి కాటువేసి, శత్రువులను కూల్చి, పరాజితులను చేసి, వారి పరువును, గౌరవాన్ని శూన్యము చేసే సైనికులు వారు, ఆ శిబిరంలో శిక్షణకోసం చేరారు.

వ. శత్రులతాలవిత్రులగు, పవిత్రులగు వీరపుత్రుల చరిత్రమును బోధించు సైన్యాధికారి యిట్లు ప్రారంభించెను!

శత్రువులు అనే తీగలను ఖండించే కొడవళ్ళవంటివారు, పవిత్రులు ఐన వీరపుత్రులైన సైనికుల చరిత్రను బోధించే సైన్యాధికారి యిలా ప్రారంభించాడు.

వీరసిపాయిలార! ఒక వీనులవిందగు గాథ, నాటి దౌ,
భారతి దాస్యబంధనలు బాసిన వేకువనాళ్ళ, దెన్నడున్
తీరని క్రోధమై నెగడు తీంట్రపు నీచులు, పాకుముష్కరుల్
బారలు సాచినారుర, కబంధులు, చేతుల ఘోరరీతులన్! (ఉ)

వీర సిపాయిలారా! యిది ఒక వీనుల విందైన ఆనాటి గాథ! భారతదేశ దాస్యబంధనాలు విడిపోయిన తొలి ఉదయపు రోజుల గాథ. ఎన్నటికీ తీరని క్రోధముతో కనలే మదం పట్టిన నీచులు, పాకిస్తాను ముష్కరులు తమ కబంధహస్తాలను ఘోరరీతులలో బారలు సాచారు.

పాఠము నేడు మీకు గుణపాఠము పాకుకు నేర్పినట్టి, హృ
త్పీఠమునందు నిల్పినను తీరని దొక్క ఋణంబునిచ్చి, తా
కాఠినమైన పోరుగొని, కాశ్మిర యంబిక వాటికన్ బలిన్,
పీఠము, దేశమాత పదపీఠము నందిన సోమనాథుదిన్! (ఉ)

పాకిస్తానుకు గుణపాఠం నేర్పి, మన హృదయ పీఠంలో నిలిపినప్పటికీ తీరిపోని ఋణమును మనకిచ్చి, కఠినమైన పోరులో కాశ్మీర అంబికా భూమిలో, శ్రీనగరులో దేశమాత పదపీఠము బలిపీఠంగా తన ప్రాణాలను బలిదానం చేసిన సోమనాథుని కథ ఈరోజు మీకు నేను చెప్పే పాఠము.

పరవీరంబను చక్రధారి తొలిగన్ ఫాలాక్షుడై తానిలన్,
సురవాటీ సమమై శుభాకలితమై శోభిల్లు శ్రీ పట్టణం
బొరగంగా పడనీయనే ననుచు తా బోరాడె వీరుం డనిన్,
అరులన్ గుండ్లవ వర్షధారలుగ తానాడించె తానంబులన్! (మ)

మొదటిగా పరమవీరచక్రమును పొందిన చక్రధారి, శ్రీహరి అతడు. ఫాలాక్షుడై, శివుడై దేవేంద్రుని అమరావతితో సమానమైన శుభవంతమై శోభిల్లే శ్రీనగరము లొంగిపోయి, శత్రువుల చేతిలో పడిపోనివ్వను అని యుద్ధములో పోరాడాడు. దేశాన్ని రక్షించడంలో శ్రీహరిలాగా, శత్రువులను

శిక్షించడంలో శివుడిలాగా పోరాడాడు. తుపాకీ, ఫిరంగి గుండ్ల వర్షధారలలో శత్రువులను స్నానాలాడించాడు.

నాల్గవ రెజిమెంటు కుమా
వో ల్గనలచు జని సలిపిరి పోరది బడ్ గాం,
మేల్గొనియాడెద, రందున
పాల్గొనె దెబ్బలు తగిలిన వామకరంబున్! (కం)

భారత సేనలోని '4వ రెజిమెంటు కుమావో'లు మండిపడుతూ వెళ్ళి ఆ యుద్ధం చేశారు. బడ్గాం అనే చోట జరిగిన ఆ యుద్ధాన్ని బడ్గాం యుద్ధం అంటారు, ఆ యుద్ధాన్ని గొప్పగా పొగడుతారు. దెబ్బలు తగిలిన ఎడమచేతితోనే ఆ యుద్ధంలో పాల్గొన్నాడు సోమనాథ్ శర్మ. క్రితం రోజు సైనికులు హాకీ ఆడుతున్నపుడు ఆతని యెడమచేతికి దెబ్బ తగిలి కట్లు కట్టించుకున్నాడు అతను.

హాకీ యాటల నైనవి,
సోకీ దెబ్బలు కరమున శోభ, లికెట్లున్
నా కీవలె నవకాశము,
బాకీ యగు నది వసూలు, పాకుల గూల్చన్! (కం)

హాకీ ఆడుతున్నపుడు తగిలాయి ఈ దెబ్బలు. ఈ దెబ్బలు చేతికి సోకిన సోకైన శోభలు. ఎలా అయినా సరే, నాకు అవకాశాన్ని యివ్వాలి, పాకు సైనికులను కూల్చడం వలన ఒక బాకీ వసూలు కావాలి.

అని పోరుచు నధికారుల,
నని పోరగ ననుమతి గొనె, నా యని పోరన్,
దినమున తొలికిరణము మొలి
చిన, దినకరుడనగ జేరె శ్రీనగరంబున్! (కం)

అని అధికారులను పోరు పెట్టి, ఆ యుద్ధంలో పాల్గొనడానికి అధికారుల అనుమతిని పొందాడు. ఆ యుద్ధంలో పాల్గొనడానికి ఉదయము తొలి కిరణముతోనే, ఉదయించిన సూర్యుడు అన్నట్టు శ్రీనగరును చేరుకున్నాడు సోమనాథ్ శర్మ.

చివ్వున పొదనుండి చిరుత దూకినయట్లు,
శిబిరంబు నుండి యా శిబిరమునకు
కొమ్మనుం డింకొక్క కొమ్మపైనకు దూకి
కొత్త గీతికలెత్తు కోయిలట్లు,
కుప్పించి లంఘించి కుంజరంబుల కుంభ
విదళనంబుల జేయు వీరసింహ
మట్లు దూకుచు, పాకు మందలు భీతిల్ల
పోరు జేసెను, పీన్గు పోగు జేసె! (సీ)

ఉత్సహించు, వారి నుత్సాహ పరచును
రెచ్చిపోవు, వారి రెచ్చ గొట్టు
ఉన్నచోట ఉండ దుద్దండ చండప్ర
చండ భండనుండు, చెండుచుండు! (ఆవె)

పొదలోనుండి చివ్వున చిరుతపులి దూకినట్టు ఈ శిబిరమునుండి ఆ శిబిరానికి దూకుతూ, ఒక కొమ్మమీదినుండి యింకొక కొమ్మమీదకు దూకి, మరలా కొత్తపాట పాడే కోయిలలాగా, కుప్పించి ఎగిరి మదపుటేనుగుల కుంభస్థలములను చీల్చే వీరసింహంలాగా దూకుతూ, పాకిస్తాను సైనికుల గుంపులు భయపడేలా యుద్ధం చేశాడు సోమనాథ్ శర్మ. శత్రువుల పీన్గుల పోగు చేశాడు. తను ఉత్సాహముతో పోరాడుతూ, పోరాడే తనవారిని మరింతగా ఉత్సాహపరుస్తూ, తను రెచ్చిపోతూ, తనవారిని శత్రువులమీదకు రెచ్చగొడుతూ, ఉన్నచోట ఉండకుండా తీవ్రమైన భయంకరమైన యుద్ధం చేస్తూ శత్రువులను చీల్చి చెండివేశాడు.

తా నుండు నిచటను, తా నౌను అచ్చట,
మంత్రగాని పగిది మాయమౌను
ఒకచోట గురిపించు నుద్ధతి ఘనవర్ష
ముల, ఫిరంగుల గుండ్ల ముంచు నరుల
కనిపెట్టి యొకచోట గాయంబులకు మందు
లేయును, తాను కట్లేయు వెజ్జ
చక్రంబు చేబట్టు శత్రుసేనల నడ్డు
అభినవుం డభిమన్యు డాలమందు! (సీ)

నరుకు కరకు రిపుల, నరకాంతకుడు చక్రి
వక్ర నక్ర శత్రువర్గ చక్రి
వందనుండు ఒకడు వందలౌ రిపులను
గూల్చి నిల్చినాడు గుండెలందు! (ఆవె)

యుద్ధభూమిలో యిప్పుడు తను యిక్కడ ఉంటాడు, అంతలోనే అక్కడ ఉంటాడు. మంత్రగాడిలా అంతలోనే మాయమవుతాడు. ఒకచోట తీవ్రంగా ఫిరంగి గుండ్ల వర్షం కురిపించి శత్రువులను ముంచెత్తుతాడు. ఒకచోట గాయపడిన తనవారిని కనిపెట్టి, వైద్యుడై మందులిస్తాడు, గాయాలకు కట్లుకడతాడు. రథచక్రాన్ని చేబట్టి, శత్రుసేనలను అడ్డుకునే అభినవ అభిమన్యుడు యుద్ధంలో(పరమవీర చక్రమును చేపడతాడు, అభిమన్యునిలా వీరస్వర్గాన్ని పొందుతాడు అని ధ్వని) నరకాసురుడిని అంతము చేసిన చక్రధారిలా కర్కశులైన శత్రువులను నరుకుతూ, దుష్టులైన వక్ర బుద్ధుల శత్రువులు అనే మొసళ్ళ పాలిటి చక్రధారిలా, వీరయుద్ధం చేసి, వందనీయుడైన ఆతడు ఒక్కడే వందలమంది శత్రువులను నేలకు కూల్చాడు. తన దేశవాసుల గుండెలలో నిలిచాడు.

జే కొట్టిటు భారతి, కటు
ఢీ కొట్టు ఫిరంగిగుండ్ల ఢీ యని గుండ్లన్
పా కిట్టుల శ్రీనగరము
నా కొట్టుట కొల్ల? కల్ల, నరుకుడి ఖలులన్! (కం)

యిటు 'భారత్ మాతాకీ జై' అని భారతికి జై కొడతాడు. అటు శత్రువుల ఫిరంగి గుండ్లను ఫిరంగి గుండ్లతో ఢీ కొడతాడు. పాకిస్తాను యిలా శ్రీనగరును కొల్లగొడుతుందా? దుర్మార్గులను నరకండి!

అని కెరలుచు నని జేసెను
అని నలసిన వారు మరల నా యని జేయన్
కొనసాగగ జేసెను, తా
ననలము ననిలము గొనెనన నా యని జేసెన్! (కం)

అని ఎగసిపడుతూ యుద్ధం చేశాడు. యుద్ధంలో అలసిపోయిన వాళ్ళు మరలా యుద్ధంలో కొనసాగేట్లు చేశాడు, ప్రోత్సహించి. అగ్నికి గాలి తోడైనట్టు యుద్ధం చేశాడు.

శతఘ్నులన్, కృతఘ్నులన్, జ్వలజ్జ్వలప్రభాగ్నులన్
శతంబులన్ శుభఘ్నులన్, సహస్ర దుష్ట వ్యగ్రులన్,
నితాంత శౌర్యకాంతులన్ నిరంతరాయముం గొనన్,
పతంగమూర్తులై జ్వలింప, పాకు సేన బూదనన్. (తురగవల్గన రగడ)

శాశ్వతమైన జ్వలజ్జ్వాలాయమానమైన ప్రభలతో, శౌర్యకాంతులతో సూర్యులలా వెలుగుతూ శతఘ్నులను, కృతఘ్నులను, మన శుభములను హరించే దుష్టులను వందలు వేలుగా దహించివేసి, పాకుసేనలను బూడిద చేశారు.

ఒకరి కేడుగురుగ, ఉరవడి నదులుగ
వచ్చి పడిన పోరి, వంద్యు లనిని
ఓర్చి నిల్చినారు ఓటమి నొప్పక
కూలి వంద లనగ, కూల్చి వేల! (ఆవె)

మన సైనికులకు ఏడురెట్లుగా, ప్రవాహంలాగా ఉరవడిగా వేగంగా వచ్చిపడుతున్న శత్రువులతో పోరాడుతూ, ఓటమిని అంగీకరించకుండా, లొంగకుండా ఓర్చుకుని నిలిచి, మనవాళ్ళు వందల సంఖ్యలో కూలిపోయారు, కానీ శత్రువులను వేలసంఖ్యలో కూల్చారు.

ఒరిగిరి ధారుణిన్ కడకు నొక్కరు నొక్కరు ఉక్కు ముక్కలున్
కరిగెను మందుగుం డచట, కాగిరి కాల్పుల మూడు పక్కలన్
కురిసెడి బాంబులన్, కరకు గుండ్లను తానొక డీదులాడుచున్,
గురిమన వాయుసేనకవ గుర్తుల శత్రు పథంబు నందిడెన్! (చం)

చివరకు ఉక్కు ముక్కల్లాంటి మన వీరసైనికులు ఒక్కరొక్కరుగా నేలకూలారు. మందుగుండు అడుగంటింది. అదనుచూసుకున్న శత్రువులు మూడుప్రక్కలనుండీ కమ్ముకున్నారు. వర్షంలాగా కురుస్తున్న ఫిరంగి గుండ్లు, తుపాకీ గుండ్లు, బాంబుల మధ్యన ఈదులాడుతూ సోమనాథ్ శర్మ తానొక్కడూ సాహసించి, మన వాయుసేనలకు మన బృందాలు పోరాడుతున్న స్థలం కనిపించడంకోసం, శత్రువుల బృందాలను గుర్తుపట్టడంకోసం నాలుగుప్రక్కలా గుర్తులు పెడుతూ, చిన్న చిన్న జెండాలను పాతుతూ, తన పోరాటాన్ని కొనసాగించాడు.

గుండ్లు ఖతములైన, గుండె యఖాతమౌ
గురుడు నింపసాగె గుండ్ల నపుడు
ఒంటిచేతి సత్తు, ఓడెను నిస్సత్తు
ఓడిపోడు లక్ష్య మున్న వాడు! (ఆవె)

మన సైనికుల మరతుపాకులలో గుండ్లు ఐపోయాయి. అఖాతంలాంటి గుండెదిటవు చూపిస్తూ ఒక్కచేతితోనే గుండ్లను నింపుతూ తుపాకులు పట్టుకున్న వారికీ సహాయం చేశాడు. ఒంటిచేతి సత్తువతో నిస్సత్తువను ఓడిస్తూ, స్ఫూర్తిదాయకంగా పోరాడాడు. లక్ష్యం స్థిరంగా మనసులో ఉన్నవాడు ఎన్నడూ ఓడిపోడు.

వ. యింతన.

యింతలో.

భమ్మని భూనభోంతరము బద్దలు జేయుచు బాంబువచ్చి, హా!
తమ్ముడ! గోతిలోన తను దాగిన తావున పేలి, యగ్ని గో
ళమ్ముల జ్వాలలన్ ఫెళ ఫెళార్భటినయ్యె న దయ్యొ! ఖండ ఖం
డమ్ములు దేహమున్, అమరుడయ్యెను, నాకరమా వరుండయెన్!(ఉ)

ఒక బాంబు వచ్చి, భూమ్యాకాశాలమధ్యన బ్రద్దలు చేస్తూ, గోతిలో(ట్రెంచ్) అతనున్న చోట పడి అగ్నిగోళములను, జ్వాలలను వెలువరిస్తూ పేలింది. ఫెళఫెళా రావాలతో మంటలు కాల్చివేశాయి. సోమనాథ్ శర్మ దేహము ఖండ ఖండములు అయ్యింది! ఆవిధంగా ఆతడు అమరుడైనాడు. వీర స్వర్గలక్ష్మిని చేపట్టాడు!

ఆరు గంటలాపె నాపోరు రిపులను
ఆక్రమణము నాపి అడ్డుకొనిరి
వారి మొండి పట్టు వాయు సేనలకిడె,
శ్రీ నగరము నిల్ప చేరు వ్యవధి. (ఆవె)

సోమనాథ్ శర్మ నేతృత్వంలో ఆరుగంటలపాటు శత్రువులను ముందుకు రాకుండా ఆపుతూ ఆ పోరాటం జరిగింది. వారి మొండిపట్టు వలన ఆ ఆరుగంటల వ్యవధి భారత వాయుసేనలకు శ్రీనగరుకు చేరడానికి, మనబలగాలను పెద్దసంఖ్యలో మోహరించడానికి అవకాశాన్ని యిచ్చింది.

పందొందొందలపై మరొక్క నలభై పైనేడు దా వత్సరం
బందంబై భరతావనీ రజమదే ఫాలంబునన్ చింద, మో
మొందన్ నవ్వుల, వీర స్వర్గము గొనెన్ 'మూడౌ నవంబర్'న యా
డెందంబందున తృప్తి గొన్నటుల, నీరేడెన్ గదా కోరికల్!
పందల్ యత్నము లెండమావుల తృషల్ పాక్ ఘూక మూకంబువౌ!
(శా)

అది పందొమ్మిదివందల నలభై ఏడవ సంవత్సరం, నవంబర్ నెల మూడవతారీఖు. అందంగా నుదుటిమీద భారత ధరిత్రి ధూళి అద్దుకోగా, ముఖంలో చిరునవ్వులు చిందుతుండగా, మనసుకు తృప్తి కలిగినట్లుగా వీరస్వర్గాన్ని అలంకరించాడు మేజర్ సోమనాథ్ శర్మ. ఆతని కోరికలు నెరవేరాయి. పాకు పందల ప్రయత్నాలు ఎండమావులతో దాహం తీరినట్లు వ్యర్థములై పోయాయి.

ఒరిగెన్ నేలకు సోమనాథుడచటన్, ఓజస్సు తేజస్సులన్
మరువన్ జాలని వీరుడాతడు, మహా మధ్యందినంబున్ దివా
కరు, డా శ్రీనగరంబు నిల్చెననగా, కాశ్మీరమున్ నిల్చు టీ
ధరణీపూజలపీఠి రాలి పడుటన్ తానెర్ర మందారమై! (మ)

ఆవిధంగా నేలకు ఒరిగాడు మేజర్ సోమనాథ్ శర్మ. ఓజస్సు, తేజస్సులలో అతడు మరువజాలని వీరుడు. మధ్యాహ్నపు సూర్యుడు. శ్రీనగరు చేజారకుండా నిలిచింది, కాశ్మీరు నిలిచింది అంటే ఈ ధరణీ పూజా పీఠంపై ఆతడు ఎర్రమందారమై రాలిపడడంవల్లనే, దేశమాత పాదపీఠంపై తన ప్రాణాలను బలిదానం చేయడంవల్లనే!

మొరసెన్ దుందుభులొక్కపెట్టున సురల్ మోదంబుతో నాడగన్,
ఒరయన్ చన్నులు, సన్నసన్న నడుముల్ ఊగన్నులన్ మిన్నులున్
సరసంగా దరిజేర, కోరికలతో శంపాలతల్ అప్సరల్,
కురిసెన్ భారతి కన్నుదోయి జల, మే కుందున్నదో, మోదమో! (మ)

దేవదుందుభులు ఒక్కసారిగా మ్రోగాయి. దేవతలు ఆనందంతో తాండవం చేశారు. వక్షోజములు పరస్పరం ఒరుసుకుంటూ, సన్నని నడుములు ఊగుతుండగా, అన్నులమిన్నలు, మెరుపుతీగెలవంటి అప్సరలు కోరికలతో దరిచేరారు. భారతమాత కనులనుండి బాష్పాలు కురిశాయి. అవి శ్రీనగర్, కాశ్మీర్ నిలిచినయ్యి అని ఆనందబాష్పాలో, తన వీరపుత్రుడు మరణించాడని విషాద బాష్పాలో!

దర్పంబుల్ విడి, వీడు గాదె జిత కందర్పుండు? నాకీడుగా
జేర్పంగావలె నేడు వీడిననుచున్ చేటుల్ వియచ్చెచ్చెరల్,
కూర్పంగావలె నాకు నాకు ననుచున్ ఘోషింప యోషిజ్జనుల్,
నేర్పుల్ నాకరమావిభుండు నగుచున్ నే డౌను మీకంచు నో
దార్పన్, ఆశలు మోసులెత్త, వధువుల్ 'తత్తై'లు, గానంబులున్! (శా)

దర్పమును వీడి, వీడు మన్మథుని గెలిచే అందగాడు, ఈ సోమనాథుడు అపర సోముడు, శివుడు, వీడిని నాకు జతగా కూర్చాలి, అంటే, నాకు జతగా కూర్చాలి అని ఆకాశంలో దేవతా స్త్రీలు త్వరపడుతూ, ఘోష పెడుతుండగా, నేర్పుగా స్వర్గలక్ష్మీనాథుడు దేవేంద్రుడు నవ్వుతూ, నేడు మీ కోరిక నెరవేరుతుంది అని వారిని ఓదార్చాడు. ఆశలు మోసులెత్తి ఆ దేవతా స్త్రీలు ఆడి పాడారు.

సిందూరారుణ దివ్యమైన రుచులన్, శ్రీచక్రసింహాసనం
బందుండున్ మన కన్నతల్లి, భళిరా, వాహంబు సింహంబుగా!
బందుండౌదువు తమ్ముడా యనుచునో, వంద్యుండవన్ కారణం,
బందన్ చందన చర్చలో, యరుణిమల్ బారెన్ ఇనుండార్తిగన్! (శా)

ఎఱ్ఱని సిందూరపు కాంతులు చిమ్ముతూ శ్రీచక్రసింహాసనంపై ఆసీనురాలై ఉంటుంది మన తల్లి భారతమాత. సింహవాహనంపై ఊరేగేతల్లి మనతల్లి భారతమాత. కనుక నాకు బంధువువి అన్నట్లుగానో, వీరస్వర్గాన్ని పొంది వందనీయుడు అయ్యాడు అన్న కారణంచేత ఎర్రనిచందనపు

పూతలను అందించడం అన్నట్లుగానో, అరుణిమలను వెలువరించాడు సూర్యుడు ఆర్తిగా.

అమ్మది దివ్యమైనసిరి యబ్బెను నీకది తమ్ముడా! భలే!
అమ్మది వాహనంపు బలమైనది నీబలమౌ భుజంబులన్,
అమ్మది చక్ర మన్నసిరి యాపర వీరపు చక్రమంచు తా
కమ్మిన అశ్రులన్ అరుణ కాంతుల తర్పణ సూర్యుడిచ్చెడున్ (ఉ)

'భలే! మన అమ్మ దుర్గమ్మకు, భారతమాతకున్న సిరి నీకు అబ్బింది తమ్ముడా! అమ్మ వాహనమైన సింహముయొక్క బలము నీ భుజబలము అయ్యింది. (దుర్గ) అమ్మకున్న శ్రీచక్రపుసిరి నీకు పట్టనున్న 'పరమవీరచక్ర'సిరి ' అని, ఆనంద విషాద బాష్పాలు నిండిన కనులతో, అరుణకాంతులతో సూర్యుడు తర్పణలు యిచ్చాడు.

వినువీధిలో నంత వింత కాంతుల పుంత
దృశ్యులు కొంద రదృశ్యు లగుచు
వాయుసేనలవారు, వాహనంబుల, వీరు,
జేకొట్టు ఖేచరుల్ చేరినారు
గుండ్ల వర్షమరుల ఘూకంబులను ముంచ,
పూలవర్షము ముంచె పోటుమగని
లొంగిపొమ్మనుచు, మే లొంగి నతులిడుచు
నంత వాయుభటులు, నాకభటులు (సీ)

దివ్య దేహము గొని, తేరిపొరగ జూచి
నాడొ కింత సోమనాథు, డంత
నగవు చిలుక నేగె నాత్మ సంతృప్తితో,
వీర స్వర్గమందు విందు లంద. (ఆవె)

ఆకాశ వీధిలో అప్పుడు వింతకాంతులు నిండిపోయాయి. కొందరు దృశ్యులుగా, కొందరు అదృశ్యులుగా ఆకాశవీధిలో చేరారు. కంటికి కనిపించేవారు భారత వాయుసేనలవారు. కనిపించనివారు, దేవతలు, తమ తమ వాహనాలమీద వచ్చారు. మనసైనికుల గుండ్ల వర్షము శత్రువులమీద కురిసింది. దేవతల పూలవర్షము సోమనాథుని పార్థివ శరీరము మీద కురిసింది. లొంగిపొండి అని మన వాయుసైనికులు శత్రువుల సైనికులను హెచ్చరిస్తుంటే, ఒంగి ఒంగి దండాలు సోమనాథ్ శర్మకు పెట్టారు దేవతల భటులు. దివ్యమైన శరీరాన్ని పొంది, కొంతసేపు తేరిపార చూశాడు సోమనాథ్ శర్మ, భారత సైనికుల విజయాన్ని. అంతటితో నవ్వులు కురిపిస్తూ, సంత ృప్తితో వీరస్వర్గములో విందులు పొందడానికి వెళ్ళిపోయాడు!

ఇరవై నాల్గు శరత్తుల
సరి సిరి తొలి పరమవీర చక్రపు ధరుడై
ఒరిగెను ధరణిని వీరుడు
నరముల పొంగిడును సోమనాథుని గాథల్! (కం)

ఆతని జీవితపు సిరి యిరవై నాలుగు సంవత్సరములతో ముగిసింది. మొదటి పరమవీరచక్ర ధారియైనాడు, నేలకొరిగిన ఆ వీరుడు. సోమనాథ్ శర్మ గాథలు వింటే నరాలు పొంగుతాయి.

ముందటి కడువా చౌతున
చంద్రుని వలె దర్శనుండు, శారద జ్యోత్స్నల్
చిందిన నవ్వుల సోముడు,
వందితు కమవసలు యిందు పంచమి నాడౌ! (కం)

అంతకు ముందు రోజు 'కడువా చౌత్' అనే పండుగ. రోజంతా ఉపవాసం చేసి చంద్రుడిని చూసిన తరువాత భోజనం చేస్తారు, ప్రత్యేకించి ఉత్తర భారతీయులు. ఆనాటి శరత్కాలపు చంద్రుడివెన్నెలలాంటి తన నవ్వులను చిందించిన సోముడికి, సోమనాథ్ శర్మకు మరునాడు, యిందు

పంచమినాడు, అమావాశ్య అయ్యింది. అమావాశ్య చంద్రుడిలా కనుమరుగు అయినాడు!

ఆవిధముగ శ్రీనగరును
గావగ తానమరుడయ్యె గావున, తొలిదౌ
పావన పతకపు విరి పెలు
చన్ వరునిది, పరమవీర చక్రపు నిధియున్ (కం)

ఆవిధంగా 'శ్రీనగర్'ను రక్షించడం కోసం అమరుడైనాడు కనుక మొదటి 'పరమవీరచక్ర పతకధారి' అయినాడు సోమనాథ్ శర్మ. ఆతడి స్మృతికి పుష్పంలాగా, ఆతడి కీర్తి అనే నిధిలాగా మొదటి పరమవీరచక్ర పతకము ఆతడి వశమయ్యింది.

అనవిని సైనికుండొకడు హస్తము నెత్తిన నేమి టన్నచో,
మనవిని జేసినాడిటుల 'మాకొక కోరిక యున్న దన్నరో!
ఘనముగ రూపుదిద్ది రనగా నెవరా పర వీరచక్రమున్,
వినగ కుతూహలంబునగు వీనుల విందుగ విందు మందరున్!' (చం)

అని శిక్షణాధికారి చెప్పగా, వింటున్నవారిలో ఒక సైనికుడు తన చేతిని పైకి ఎత్తాడు. ఏమిటి? అని ఆ అధికారి అడిగాడు. ఆ సైనికుడు యిలా మనవి చేశాడు. 'ఆ పరమవీరచక్రాన్ని ఎవరు రూపుదిద్దారో తెలుసుకోవాలని మాకు కోరికగా ఉన్నది. ఆ వివరాన్ని తెలుసుకోవాలని కుతూహలముగా ఉన్నది. మేమందరమూ చెవులకు విందుగా వింటాము, ఆ వివరాలను చెప్పండి'.

అటులనె కూరుచుండుమని యా యధికారి కథా ప్రకారియౌ
'పుటకలు జీవకోటి కగు పుణ్యుల గణ్యుల ధన్య జన్మముల్
అటులె దధీచి, రంతి, శిబి, యామె యొకర్తుక మేటి కర్తుకౌ
నిటు పరవీర చక్రమును నిగ్గుల దిద్దె, విదేశి ముగ్ధయున్! (చం)

'అలాగే వివరంగా చెబుతాను, కూర్చో!' అని ఆ సైనికశిక్షణాధికారి ఆ కథను చెప్పడం ప్రారంభించాడు. 'పుణ్యాత్ముల, గణుతింపదగిన మహానుభావుల జన్మలు సమస్తజీవకోటికోసము జరుగుతాయి. దధీచి, రంతి, శిబి మొదలగు మహానుభావుల జన్మలు అలాంటివే. అలాంటి మహానుభావురాలే ఒక స్త్రీ, సాటిలేనివిధంగా పరమవీరచక్రమును రూపు దిద్దింది. ఆ స్త్రీ ఒక విదేశీ మహిళ!'

రమ్మిదె, సోదరా! రసభరమ్మగు గాథను చెప్పనుంటిరా!
చెమ్మలుతేల కన్నుగవ, చేతము పొంగగ మెచ్చుకున్ననో
సుమ్మిక నాకు రాదనెద శుద్ధముగా నొక గాథ చెప్పగా,
ఇమ్మగు వస్తువున్న, నొక ఈప్సిత, మండగ నమ్మ యున్ననూ! (ఉ)

సోదరా! స్వాగతం! ఒక రసభరితమైన గాథను చెబుతున్నాను! కనులు చెమ్మగిల్లి, గుండె ఉప్పొంగి మెచ్చుకునేట్లుచెబుతాను. అలా చెప్పలేకపోతే, చెప్పడానికి గొప్పకథ ఉన్నా, చెప్పాలనే కోరిక ఉన్నా, నాకు అండగా జగజ్జనని ఉన్నా, కథ చెప్పడం చేతగాదు అని ఒప్పుకుంటాను!

పుట్టినిల్లు పుణ్య భూమి స్విట్జరులాండు,
బాల మెట్టినిల్లు భారతంబు
తల్లి రష్యను, తన తండ్రి హంగేరియన్
ఎవడు చెప్పి ఎరుగ డిట్టి గాథ! (ఆవె)

ఆమె పుట్టినిల్లు పుణ్యభూమి ఐన స్విట్జర్లాండు. ఆమె మెట్టినిల్లు భారతదేశము. ఆమె తల్లి రష్యను. ఆమె తండ్రి హంగేరియన్. యిటువంటి విచిత్రమైన, పవిత్రమైన, ఉత్తమమైన కథను ఎవడూ చెప్పి ఉండడు.

'అలాగే వివరంగా చెబుతాను, కూర్చో!' అని ఆ సైనికశిక్షణాధికారి ఆ కథను చెప్పడం ప్రారంభించాడు. 'పుణ్యాత్ముల, గణుతింపదగిన మహానుభావుల జన్మలు సమస్తజీవకోటికోసము జరుగుతాయి. దధీచి, రంతి, శిబి మొదలగు మహానుభావుల జన్మలు అలాంటివే. అలాంటి మహానుభావురాలే ఒక స్త్రీ, సాటిలేనివిధంగా పరమవీరచక్రమును రూపు దిద్దింది. ఆ స్త్రీ ఒక విదేశీ మహిళ!'

రమ్మిదె, సోదరా! రసభరమ్మగు గాథను చెప్పనుంటిరా!
చెమ్మలుతేల కన్నుగవ, చేతము పొంగగ మెచ్చకున్ననో
సుమ్మిక నాకు రాదనెద శుద్ధముగా నొక గాథ చెప్పగా,
ఇమ్మగు వస్తువున్న, నొక ఈప్సిత, మండగ నమ్మ యున్ననూ! (ఉ)

సోదరా! స్వాగతం! ఒక రసభరితమైన గాథను చెబుతున్నాను! కనులు చెమ్మగిల్లి, గుండె ఉప్పొంగి మెచ్చుకునేట్లుచెబుతాను. అలా చెప్పలేకపోతే, చెప్పడానికి గొప్పకథ ఉన్నా, చెప్పాలనే కోరిక ఉన్నా, నాకు అండగా జగజ్జనని ఉన్నా, కథ చెప్పడం చేతగాదు అని ఒప్పుకుంటాను!

పుట్టినిల్లు పుణ్య భూమి స్విట్జరులాండు,
బాల మెట్టినిల్లు భారతంబు
తల్లి రష్యను, తన తండ్రి హంగేరియన్
ఎవడు చెప్పి ఎరుగ డిట్టి గాథ! (ఆవె)

ఆమె పుట్టినిల్లు పుణ్యభూమి ఐన స్విట్జర్లాండు. ఆమె మెట్టినిల్లు భారతదేశము. ఆమె తల్లి రష్యను. ఆమె తండ్రి హంగేరియన్. యిటువంటి విచిత్రమైన, పవిత్రమైన, ఉత్తమమైన కథను ఎవడూ చెప్పి ఉండడు.

మంధరగిరిధర! సుందర
బంధుర ఘనవర్ణ! గోపబాల విలోలా!
అంధకరిపువందిత! శ్రిత
కంధర! జమలాపురీశ! కామిత ఫలదా! (కం)

మంధర పర్వతాన్ని వీపున ధరించినవాడా! కూర్మావతారమును ధరించిన వాడా! సుందరమైన నీలిమేఘచ్ఛాయ కలిగిన శరీరమును కలిగినవాడా! గోపబాలకులతో క్రీడించడంలో మైమరచినవాడా! అంధకాసురుడిశత్రువైన పరమశివునితో నమస్కరింపబడేవాడా! ఆశ్రితులకు కొండవలె అండయైన వాడా! జమలాపురములో వెలసిన శ్రీ వేంకటేశ్వరా! కోరుకున్న ఫలములను ప్రసాదించేవాడా!

నగరిపు మదహారీ! నందవాటీ వినోదీ!
ఖగవర వరవాహా! కంసహంతా! అనంతా!
నగవరసుఖశాయీ! నాదవీధీ విహారీ!
నగధర! నుతశూలీ! నారసింహా! ముకుందా! (మాలిని)

శ్రీకృష్ణావతారంలో 'పర్వతములకు శత్రువైన దేవేంద్రుని' గర్వమును అణిచినవాడా! నందుని పల్లెలో వినోదించినవాడా! పక్షులకు రాజైన గరుత్మంతుని వాహనముగా చేసుకున్నవాడా! కంసుడిని అంతము చేసినవాడా! అనంతా! నాగులలో ఉత్తముడైన శేషునిపై శయనించేవాడా! నాదవీధిలో (వేద వీధిలో, ఓంకార వీధిలో, సంగీత వీధులలో) విహరించేవాడా! గోవర్ధనపర్వతాన్ని ఎత్తినవాడా! శివునిచేత నుతింపబడేవాడా! నారసింహా! ముకుందా!

వ.

యిది సాధ్వీమణి సావిత్రీబాయి ఖనోల్కర్ దివ్య స్మృతికి అంకితముగా, బమ్మెర పోతనాఖ్యు పదపరిచయ పులకిత గాత్రుడను, సజ్జన వేంకట రామరాయ పుత్రుడను, వేంకటేశ్వర రాయ పౌత్రుడను, సాహితీ

ప్రియంభావుకుల ప్రియ మిత్రుడను, వేంకట వరప్రసాదరాయ నామధేయుండను అగు నాచే విరచితమైన 'పరమవీరచక్ర'మను నామంబు గల పద్య గద్య నిహిత నిస్తుల కావ్యమందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

శ్రీ వేంకటగిరిపై నట,
ఠీవిన్ జమలాపురమున ఠేవల నిచటన్,
గావన్ సురతరు వగు యో
దేవా! దేవాది దేవదేవా! వినుమా! (కం)

నీ భక్తులను రక్షించడంకోసం శ్రీ వేంకటాచలము మీద, జమలాపురములో ఠీవిగా నిలిచినవాడా! ఆశ్రితులపాలిటి కల్పవృక్షము వంటివాడా! ఓ దేవాదిదేవా! వినుమయ్యా అని తృతీయాశ్వాసమును ప్రారంభిస్తున్నాడు కవి.

వ.
ఆ వీరసైనికులశిక్షణా శిబిరమునందు ప్రశిక్షకుడగు అధికారి యిట్లు చెప్పసాగెను.

స్విజ్జరులాండులోన గొనె చిన్నది జన్మము తల్లిదండ్రులా
సజ్జనులిద్దరూ, జనని సాధ్విర, మార్తయె సోవియట్టు నం
దజ్జనకుండు హంగెరిన తానన యాండ్రిడిమాడె యన్నరో!
గుజ్జనగూళ్ళనా డె పసిగుండెకు తల్లివియోగమౌ వ్యథల్! (ఉ)

సైనికుల శిక్షణాధికారి పరమవీరచక్రమును రూపొందించిన విదేశీ వనిత కథను కొనసాగిస్తున్నాడు. ఆ చిన్నది స్విట్జర్ల్యాండ్ లో జన్మించింది. తల్లిదండ్రులు ఇద్దరూ సజ్జనులు. తల్లి 'మార్త' జననము సోవియట్టు లో జరిగింది. తండ్రి 'యాండ్రీ డి మాడే' హంగేరీ లో జన్మించాడు. గుజ్జనగూళ్ళ నాడే ఆ చిన్నదానికి మాతృవియోగము కలిగింది.

కన్నియ చిన్నదద్దిరొక కంతుని తూణియ రాగవీణయౌ
తిన్ననిముక్కు సన్ననగు తీవియ గౌనుది తేనెకాంతి మై
పున్నమిచుక్క సొట్టలవి బుగ్గల సిగ్గులమొగ్గ నవ్వినన్
స్విన్నతలేని వాడెవడు చిన్నది కన్నుల తూపుదూసినన్? (ఉ)

ఆ చిన్నది మన్మథుని బాణమువంటి కన్యక. అనురాగవీణ. తిన్నని ముక్కు, సన్నని తీగవంటి నడుము కలది. తేనె రంగులోనున్న శరీరముతో పున్నమిచుక్కలా ఉండేది. బుగ్గలమీద సొట్టలతో, ఆ చిన్నది నవ్వితే, కన్నుల చూపుల తూపు దూస్తే ముచ్చెమటలు పట్టనివాడెవడు?

అద్దిర కుందనంబు, పదహారును నిండియు నిండకుండనే
హద్దులుగావు ఖండములు, హద్దులుగావు మతంబు, లడ్డు గా
విద్దరి వేషభాషలని విచ్చిన ప్రేమల నౌ స్వయంవరం,
బద్దిర భారతీయులకు భాగ్యము దెచ్చిన లచ్చి యచ్చుగన్ (ఉ)

ఆ చిన్నది బంగారం! పదహారేళ్ళు నిండీ నిండకముందే ఖండములు, మతములు అడ్డుగావు, వేష భాషలు అడ్డుగావు అని వికసించిన ప్రేమతో స్వయంవరం చేసి, ఆ చిన్నది అచ్చంగా భారతీయులకు సిరిని తీసుకొచ్చిన శ్రీమహాలక్ష్మియే!

వ.

స్విట్జర్లాండ్ దేశమునందు 'న్యూ కాజిల్' అను సరస్సుగలదు. దాని మనోహరమైన జలకళను గాంచిన చూపరుల మనంబులు దాని అలలవలె ఆనందమున ఎగసిపడుచుండును. ఆ సరోవర తీరముననున్న కారణమున 'న్యూ కాజిల్' అను పేరున పిలువబడు పట్టణము గలదు. అందు 'ఆంద్రీ డిమాడే' (Andre de Maday) యను పురుష పుంగవుడు తన ధర్మపత్ని 'మార్త హెంజేల్ట్' (Marthe Hentzelt) అను సాధ్వీరత్నముతో కాపురముండెను. హంగేరీ దేశస్థుడైన ఆ ధీరుడు తొలుత వీరసైనికుడై ప్రథమ ప్రపంచసంగ్రామమున హంగేరీ సైన్యమునందు అధికారిగ పోరాడెను. అనంతరము జెనీవా విశ్వవిద్యాలయమునందు సామాజిక

శాస్త్రఆచార్యుడై బోధనలు జేయుచుండెను. సామాజిక శాస్త్రమునందు, నారీమణుల స్వేచ్ఛ గురించియు గ్రంథములను రచించెను. అచట విద్యార్థినియైన 'మార్త హెంజేల్ట్'తో నతని పరిచయము ప్రణయముగ మారి వారు దంపతులైరి. 'మార్త హెంజేల్ట్' సోవియట్టు రష్యా దేశీయురాలు. అమె 'జీన్ జాక్వెస్ రూసో విద్యాలయము'నందు బోధకురాలిగా నుండెను. వివాహానంతరము వారు 'స్విట్జర్లాండ్'నందు నివసింపసాగిరి. వారికి జూలై యిరువదియ తారీఖు, పందొమ్మిది వందల పదమూడవ సంవత్సరమున **(20-07-1913)**ఒక బాలిక జనించినది. ఆ బాలికకు 'ఈవ్ యువానె మాడే డిమోరస్' అను నామధేయమిడి అల్లారు ముద్దుగ సాకుచుండిరి. కాలాంతరమున ఆ బాలికయే ఒక భారతీయ వీరసైనికుని ప్రేమించి, వివాహమాడి, ఈ వేటి వేదినిని మెట్టి, సావిత్రీ బాయి అను నామధేయమును చేపట్టినది. ఆమెయే భారత వీరసైనికులకొరకు 'పరమవీరచక్ర'మను పతకమును, యితర పతకములను రూపు దిద్దినది.

చిత్ర లేఖకురాలు చిన్నారి, చిత్రంబు
పతకంబులను దిద్దు, పంచిపెట్టు
కవనంబులను జెప్పు కవయిత్రి, పొన్నారి,
కథలు తండ్రినడుగు కదన కథలు
సూర్యు నారాధించ జూచిన జనకుని
రహిజూడగొనును, భారతిని బొగడు
సేనాని కొలు వింక చేయవా నీవంచు
బాల యలుగు, తండ్రి బతిమిలాడు (సీ)

త్యాగ ధనుల కథల తన్మయంబు గొనును,
భారతేతిహాస భవ్య కథల
చవి దధీచి, సీత, సావిత్రి కథలన్న
పుడితి నచట నేను పూర్వ మనును! (ఆ.వె)

ఆ చిన్నారి చిత్రలేఖనం చేసేది. చిత్ర విచిత్రములైన పతకములను తయారుజేసి పిల్లలకు పంచిపెట్టేది. కవితలు వ్రాసేది. తండ్రిని యుద్ధ గాథలు చెప్పుమని అడిగేది. సూర్యుని ఆరాధన చేసే తండ్రిని శ్రద్ధగా గమనించేది. భారతిని, భారతదేశాన్ని పొగిడేది. నువ్వీక సైన్యంలో యుద్ధం చేయవా అని తండ్రిని అడిగి, అలిగేది. తండ్రి బ్రతిమిలాడేవాడు. త్యాగపురుషుల గాథలు తన్మయంగా వినేది. భారత యితిహాస కథలు, దధీచి, సీత, సావిత్రుల కథలు అంటే ఇష్టంగా వినేది. నేను పూర్వము అక్కడ, భారతదేశములో పుట్టాను అనేది.

తల్లిని గోలుపోయి మది తల్లడమొందెడి చిన్నతల్లి, నా
తల్లియు తండ్రి తండ్రియవ, తప్పుల నొప్పుల దిద్దిచెప్పగన్,
చల్లని సానుభూతి, దయ, జాలిగుణమ్ముల వెల్లిగా, మరుల్
జల్లుగ మెల్లమెల్లనయె జాతవయస్యగ, తండ్రి పెంపునన్! (ఉ)

తన తల్లిని కోల్పోయి మనసులో తల్లడిల్లే ఆ చిన్నతల్లిని తల్లీ తండ్రీ తానై తప్పొప్పులు దిద్ది చెప్పగా చల్లని సానుభూతి, దయ, జాలి గుణముల సముద్రంలాగా మరుల జల్లుగా మెల్లమెల్లగా యుక్తవయస్కురాలు అయ్యింది ఆమె.

పూచిన పూవుబోడి తన పూర్వపు జన్మల నిద్రనుండియో
లేచిన దానిగా చదువు లేమన భారత రామగాథలున్
చూచును తూర్పుదిక్కు మరి జూపుల మార్చును పశ్చిమంబులన్
వేచిన దానిగా గనును, వేదన జెందుచు, వెచ్చనూర్చుచున్! (ఉ)

ఆ పూచినపూబోడి తన పూర్వజన్మల నిద్రనుండి లేచినట్లు చదివేది ఏమిటయ్యా అంటే మన భారత రామాయణ గాథలు. తూర్పుదిక్కుకు అంటే భారతదేశం వైపు చూసేది, మరలా పశ్చిమానికి చూపులు మార్చేది. వేచినట్లుగా చూసేది, వేడి నిట్టూర్పులు విడుస్తూ వేదన చెందేది.

ఒకనా దావిరిబోణి చేరినది యౌనొక్కర్తి యద్దేశ మం
దొకటన్ 'షామొనిజన్న' పేరుగల దండున్ గ్రామ, మచ్చోటికిన్
ఒక సేనానికరంబు జేరగని, తానుత్సాహమున్ చింద, మై
నికటంబై చనుదెంచి, వందనములన్ నిండైన హర్షంబుతో (మ)

ఒకనాడామె ఒక్కతి ఆ దేశంలోని 'శామోనిజ్' అనే గ్రామానికి చేరుకున్నది. అక్కడికి వచ్చిన ఒక సైనికుల బృందాన్ని చూసి ఉత్సాహంతో దగ్గరికి వెళ్లి నమస్కరించి నిండిన సంతోషంతో యిలా అడిగింది.

భళిరా! మీరలు భారతీయులు గదా? భాగ్యంబు మీదే గదా!
మిళితంబౌ దయ, వీర, ధీరతలు తామెచ్చోట, నచ్చోటులన్
దళితంబుల్ భవ దుఃఖ బంధములు కాదా యంచు దానంజలిన్,
గళితానందపు టశ్రులన్, కలియు యోగంబున్నదిచ్చోటనెన్ (మ)

భళిరా! మీరు భారతీయులు కదూ! భాగ్యమంటే మీదేకదా! మీరెక్కడ వుంటే అక్కడ దయ, వీర్యము, ధైర్యము ఉంటాయి, ఈ ప్రపంచపు దుఃఖాలు నశించిపోతాయి కదా అంటూ ఆనందబాష్పాలు రాలుస్తూ ఇక్కడ మిమ్మల్ని కలిసే యోగం ఉన్నది నాకు అన్నది.

ఎంతటి భాగ్యమో, కలిగిరెచ్చట రాముడు, సీత, ఊర్మిళల్
అంతటి ధీరులై మగ లనంతపు చింతలనోర్చు కృష్ణయున్
అంతములేని యాతనలనందగ సర్వజనాళి కోసమై
వంతులు వేసుకొందు, రెట వంతల కుందరొ, కల్గుటచ్చటన్ (ఉ)

ఎంత అదృష్టమో కదా ఎక్కడ రాముడు, సీత, ఊర్మిళ పుట్టారో, అంతటి ధీరులైన భర్తలు వుండికూడా అనంతమైన చింతలను ఓర్చుకున్న ద్రౌపది ఎక్కడ పుట్టిందో, సమస్త జనులకోసం అంతం అన్నది లేనియాతనలను పొందడంకోసం ఎక్కడ వంతులు వేసుకుని ముందుకువస్తారో అక్కడ పుట్టడం!

అన్నది యందగత్తె, మరి యన్నది ఉన్నది సంపదచ్చుటన్,
ఎన్నడు పంచుకొద్దిగను ఎయ్యది హెచ్చును, మించు నచ్చుతల్,
ఉన్నది వేదమూలముగ, నున్నది సంపద అచ్చు టయ్యదే,
ఎన్నగ ఏరికౌను తర మెక్కడ నాకపు సోకు? లక్కడే! (ఉ)

ఆ అందగత్తె యింకా యిలా అన్నది. అక్కడ, భారతదేశంలో పంచినాకొద్దీ పెరిగే సంపద, జ్ఞానసంపద ఉన్నది. వేదమూలమైన సంపద ఉన్నది. ఆ దేశాన్ని ఎంచడం, పొగడడం ఎవరికి తరమవుతుంది? స్వర్గపు సోకులు ఎక్కడ ఉన్నాయి? అక్కడే, భారత దేశంలోనే!

పేరును, తల్లిదండ్రులవి పేళ్లను, ఊరును జెప్పి, యప్పుడున్
మీరొకసారి మా గృహము మీ పదధూళితొ పావనంబుగా
కూరిమి జేయ రండనుచు కోరిన, తక్కిన వీరులందరున్
తీరిక జూతమంచు జనుదెంచిరి, విక్రముడుండె నచ్చటన్! (ఉ)

అలా పొగిడి, తన పేరును, తన తల్లిదండ్రుల పేర్లను తనవూరిపేరును చెప్పి, అప్పుడు మీరు ఒకసారి మా యింటిని మీ పాదధూళితో ప్రేమగా పావనంచేసి వెళ్ళండి అని కోరింది. తీరికగా ఉన్నప్పుడు చూద్దాము అని మిగిలిన వీరులందరూ వెళ్ళిపోయారు. విక్రముడు అనే సైనికుడు అక్కడే వుండిపోయాడు.

వ.

'అనంతరమేమి జరిగెనో వివరించుడు గురుదేవా, వీరగాథలు కదా మనోవ్యథా వీచికలెగయు విషాద సంసార సాగరమునకు చెలియలికట్టలు, వీరభారతసుతానీక పదఘట్టనలు కదా ఇట్టిట్టిరుచులనుటకు వీలెరుగని తేనెపట్టులు, రససౌధములకు మెట్టులు, ఆనందమున కాటపట్టులు, తామెరుగని వెందు కల వే గుట్టులు ' అని యా వీరశిబిరంబునందలి శిక్షితులగుచుండిన వీరులడుగగా, ప్రశిక్షకుడు ఇవ్విధంబున కొనసాగించెను.

వీరపత్నియు, వీరసోదరి, వీరమాత, వీర, ధీర, సైనికనిచయమునకు ప్రేరణయునైన సావిత్రీ చరితము సకలము నెరింగించెద, సావధానచిత్తులై వినుడు...'

తరళములగు చిరునగవులు
గురియుచు దరికరిగి, మమత గురియగ కనులన్,
విరిసియు విరియని సొగసుల
విరియగు పొలతుకను గనుచు విక్రము డనియెన్ (కం)

ప్రకాశించే చిరునవ్వులను కురిపిస్తూ దగ్గరకువెళ్ళి, కనులలో ప్రేమ కురిపిస్తూ, విరిసీ విరియని సొగసుల పూవులాంటి ఆ యువతిని చూస్తూ యిలా అన్నాడు విక్రముడు.

భారత సైనికుల్, కనగ భారతమాతయు, తత్పుతుల్పుతల్
గౌరవ మొందినా, రటుల గావుత! కూరిమి నీమనంబునన్
కోరికలెల్ల తీరగను కోరెద నెల్లరి పక్షమందునన్
జేరిక నీకు నే నివియె జేతు నమస్సులు, ధన్యవాదముల్ (ఉ)

చూడగా భారత సైనికులు, భారత మాత, భారతి పుత్రులు, పుత్రికలు అందరూ యిలా నీచేత గౌరవాన్ని పొందారు. అలాగే అగుగాక. స్నేహముతో నీ మనసులోని కోరికలన్నీ తీరాలని కోరుకుంటాను. అందరి తరపునా నీకు నమస్సులు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను!

మీరలు? విక్రమాఖ్యుదను! మీ కది నిక్కము, అర్థవంతమే!
ఊ రది? భారతం బఖిల! 'మూ'యది సర్వము మీ యధీనమౌ
పోరుకు, పొందు కెల్ల లన బోలదు! ఔ, నిక పోయివచ్చెదన్!
మీరిది చిత్రమౌననుట, మీకిది ఏలనొ పోవుటొచ్చుటల్? (ఉ)

ఆమె: మీరు..?

అతడు: నేను విక్రముడనే పేరు గలవాడిని!

ఆమె: నిజమే! మీకు ఆ పేరు అర్ధవంతమే. మీరు నిజంగా పరాక్రమవంతులే! మీ ఊరు?

అతడు: సమస్త భారతమూ నా ఊరే!

ఆమె: ఊ! భారతదేశం మొత్తమూ మీ అధీనమే, మీరు సమస్తభారత రక్షణను చేసేవారుకదా! అయినా పోరుకూ, పొందుకూ ఎల్లలు, సరిహద్దులు ఏముంటాయి?

అతడు: ఔను! ఇక వెళ్ళొస్తాను!

ఆమె: మీరు ఇలా అనడం చిత్రంగా ఉంది! మీకు వెళ్ళడం ఎందుకు? మళ్ళీ రావడం ఎందుకు? వెళ్లకుండా ఇక్కడే వుంటే పోలే!

వెళ్ళిన గద వచ్చుటలనె,
వెళ్లక ఇక్కడన ఉండవేయని యన్నన్?
వెళ్ళదు వెళ్ళక వేళకు,
వెళ్ళుడి, నే వెళ్లెద నని వెళ్లక నిలిచెన్! (కం)

అతడు: వెళ్తేనే కదా మళ్ళీ వచ్చేది, అందుకే వెళ్లొస్తాను అన్నాను!

ఆమె: వెళ్ళకుండా ఇక్కడే వుండండి అంటే?

అతడు: సమయానికి వెనక్కు వెళ్లకుండా కుదరదు

ఆమె: వెళ్ళండి! నేను వెళ్తాను, అని వెళ్ళకుండా అక్కడే నిలిచింది.

ఎన్నటికౌనొ, కాదొ, మరి ఏవిధి గూడునొ మిమ్ముజూచుటల్
అన్నది చిన్నగా మెలత, అంతరమందున వంతనందుచున్
మిన్నక ఊరకుండిన నిమేషమె ఒక్క యుగంబుగా జనన్,
అన్నులమిన్న చిందె దరహాసము, లేఖ లవుండవే యనన్! (ఉ)

ఎప్పటికి ఎలా అవుతుందో మిమల్ని మరలా కలవడం, అసలు అవుతుందోలేదో! అన్నది ఆమె చిన్నగా, మనసులో బాధ పడుతూ. మౌనంగా ఉన్న ఒక నిముషమే ఒక యుగంగా అనిపించింది. లేఖలు ఉన్నాయిగా,

లేఖల ద్వారా కలుసుకోవచ్చు అని అతడు అనగానే ఆ అన్నులమిన్న నవ్వులను చిందించింది సంతోషంగా.

లేకలు వ్రాసుకొందుమని, లేనగవొత్తగ, అంతటన్ విడన్
లేకనె వీడిపోయిరి, భలే! యతి చిత్రవిచిత్ర కూటముల్!
లోకము యాత్రికస్థలము, లోకులు వింతగ సంచరించుచున్,
యేకడ, యేరితో, నెపుడొ, ఎందుకొ కూడుట వీడిపోవుటల్! (ఉ)

లేఖలు వ్రాసుకుందాము అనుకుని, లేత నవ్వులు చిందిస్తూ ఇక వీడి వెళ్ళలేకనే, వీడిపోయారు వారు. భలే! అతి చిత్రమైన, విచిత్రమైన కలయికలు! లోకము ఒక యాత్రికస్థలము. లోకులు వింతగా సంచరిస్తూ, ఎక్కడ, ఎవరితో, ఎందుకో కలవడం,విడిపోవడం!

వ.

అట్లు ఉత్తర ప్రత్యుత్తరముల వలన పరస్పర క్షేమ సమాచారములను ఒకరికొకరు తెల్పుకొనుటకు వారు సమ్మతించి, భారములగు మనసులతో అచ్చటినుండి నిష్క్రమించిరి. ప్రథమ వీక్షణములనే ఆతడు ఆమె మనసును దోచుకొని అంతలోనే నిష్క్రమించినంత ఆమె యంతరంగమున అలముకున్న దిగులు యన్నట్లు చీకట్లు ఆకాశమున నలముకున్నవి. అంతలోనే వాని చిరునవ్వుల వెలుగులవలె చంద్ర రేఖలు పొడసూపినవి. ఆకాశమునందు చంద్రబింబము దోచెను, ఆమె హృదయాకాశము నందు వాని ముఖచంద్రబింబము వలె. మరల వానిని చూడలేకపోదునా యన్నఆమె ఆశలవలె చుక్కలు మినుకు మినుకుమన్నవి. వాని తలపులవలె చల్లని మారుతములు వీచినవి. అమ్మడి గుండెయందు వాని పలుకులవలె కొమ్మలయందు మధురములగు కూజితములు నిగిడినవి. నికటములగు కొలనులందు కలువలు అరవిచ్చుకున్నవి, కెరటములగు మధురోహల పారవశ్యమున ఆమె కనులవలె. పూర్ణ పురుషచంద్ర దర్శనమైనట్లు, ఆమె ముగ్ధకోమల స్నిగ్ధమూర్తి రుచి పూర్ణమైనట్లు పూర్ణచంద్ర దర్శనమయ్యెను.

చంద్రోదయ వర్ణన

చందురు డరుదెంచెను తమ
ముందరి తగవులు మరుగులు ముసిముసినగవుల్
చిందుచు రతి దంపతులకు
కందగ నొండొరులజేయ కసిగొనె మనముల్ (కం)

చంద్రుడు వచ్చాడు. అంతకుముందు జరిగిన తమ తమ తగవులు మరుగునపడ్డాయి. ముసిముసినవ్వులు చిందిస్తూ శృంగారక్రీడలో బాధించి పరస్పరం కసి తీర్చుకోవాలనే కోరికలు కలిగాయి దంపతులకు!

చందురు డొక డట మోమున,
చందురు లిరువురు కనగ కుచంబులయందున్
వందలు జాబిలుల కథన,
మొందు నఖక్షతుల బోంట్లు మోదుగుకొమ్మల్! (కం)

ఆమె ముఖంలో ఒక చంద్రుడున్నాడు. ఆమె కుచములలో ఇద్దరు చంద్రులున్నారు. వందల గోటిగిచ్చుళ్ళు జాబిలి గుర్తులైనాయి. ఆ నెలవంకలవంటి గిచ్చిన గుర్తులతో స్త్రీలు ఒళ్లంతా కందిపోయి, పూచిన మోదుగు కొమ్మలైనారు!

చంద్రుడు గగనము నాటల,
చంద్రుడు చెలి కౌగిట నిట, సరి సయ్యాటల్
చంద్రుడు సరిసరి కురిసెను
చంద్రుని దట, నిచట జాలు, చంద్రునిధారల్! (కం)

ఆకాశంలో చంద్రుడు క్రీడిస్తున్నాడు చుక్కలతో! ఇక్కడ ప్రియుడు చెలికౌగిట అలాగే సయ్యాటలతో క్రీడిస్తున్నాడు. అక్కడా ఇక్కడా సమానంగా చంద్రుని వెన్నెల ధారలు కురిశాయి!

వ.

ఆ వెన్నెలరేయి ఆమెకు పదే పదే వాని నవ్వుల వెన్నెలలను, రూపవిలాసమును గుర్తుచేసినది. కొన్ని గంటలక్రితమే జరిగిన పరిచయముగా ఆమెకు అన్పించలేదు, అది ఎన్ని జన్మల బంధమో అనిపించినది. కొన్నిగంటలక్రితమే వీడుకోలు పలికినట్లు అనిపించలేదు, కొన్నియుగముల ఎడబాటువలె అనిపించినది. వీడిపోవుచూ ఆతడు తన విలాసమును లిఖించి యిచ్చినది గుర్తుకు వచ్చి, ఆ కాగితమును అందుకుని, లేఖను వ్రాయనారంభించెను.

విక్రమ సేమమ మీకట?
సక్రమముగ భోజనంబు, సరిపడు నిదురల్,
ఈ క్రమ మారోగ్యమును, ప
రాక్రమపరిరక్ష గొందు రని మనవి, నతుల్! (కం)

విక్రమా! మీకు అక్కడ క్షేమమా? సక్రమముగా వేళకు భోజనము, చాలినంత నిద్రతో, ఈ రకంగా ఆరోగ్యాన్ని, మీ పరాక్రమాన్ని రక్షించుకోవాలని మనవి చేస్తున్నాను, నమస్కరిస్తున్నాను.

అమ్మ గతించిపోయినది ఆరక ముందునె ముక్కుపచ్చలున్
అమ్మయు నాన్నతా నగుచు అక్కున జేరిచి నాన్నసాకె నన్
నమ్మ వదేమొగాని నిను నా కనులారగ జూచినంతనే,
అమ్మను, నాన్ననూ, వలపు టామని కంతుని జూసినట్లయెన్! (ఉ)

ముక్కు పచ్చలారకముందే నా తల్లి మరణించింది. అమ్మ, నాన్న తానే అవుతూ నన్ను పెంచాడు మా నాన్న. నన్ను నమ్మవుకానీ, అదేంటో, నిన్ను కనులారా చూడగానే అమ్మను, నాన్నను, వలపు వసంత వేళలో మన్మథుడిని చూసినట్లు అనిపించింది! నీలో తల్లినీ, తండ్రినీ, ప్రియుడినీ అందరినీ చూశాను!

భారత, రామగాథలును, భారతి మై జన వేద వీథులన్
నా రతి కాళిదాసకవి, నామది శంకరు దాత్మసాక్షిగా
నారతు లెత్తి జోతలిడ నాగతి పొందగ నా నరేంద్రు నిన్
తీరము జేర్చినట్టివి, యతీంద్ర గదాధర పాదపద్మముల్ (ఉ)

భారత, రామాయణ గాథలు, భారత వేదవీథులలో శరీరాన్ని పొందడం, అక్కడ ఉండడం నాకుయిష్టము. కాళిదాసమహాకవి అంటే నాకు ప్రేమ. నాకు మనసు ఆదిశంకరునిమీద. ఆత్మసాక్షిగా హారతులిచ్చి నమస్కరించి, నాకు గతిగా నేను భావించేవి ఆ నరేంద్రుడిని తీరము జేర్చిన యతీంద్రుడు ఐన గదాధరుని పాదాలు, రామకృష్ణపరమహంస పాదాలు!

అనుచును జననము నాదిగ,
తన రుచులను, యభిరుచులను, తన కథనములన్
మనమిడి లేఖను మొదలిడె
వనరుహలోచన, తెలతెల వారెను ముగియన్! (కం)

యిలా అంటూ, పుట్టినదిమొదలుగా తన యిష్టాలను, అభిరుచులను, తన కథలను మనసుపెట్టి లేఖలో రాయడం మొదలెట్టింది ఆ పద్మాక్షి. ఆ లేఖ ముగిసేసరికి తెలతెలవారింది!

వ.

అంతట తొలగిన నిరాశలట్లు చీకట్లు చిట్లెను. నూత్న ఆశల కిరణములట్లు నిత్యనూతన ఆశాకిరణములు మొలిచెను. శుభవార్తలను జెప్పు పురోహితునివలె లోకహితుడు బయలుదేరెను. తన లేఖను పంపుటకు ఆమె ఉద్యుక్తురాలయ్యెను.

వలపలి కేలలో వలపుల లేఖతో
తడబడు వణకు వై దర్భిదోచె
దోచె హోయిడు యగ్ని ద్యోతనుండు నభను
భారతంబు మధుర పర్వమంచు
విక్రముండు మధుర విక్రముండుగ దోచె,
భారతీ కళ్యాణ భావి దోచె
కళ్యాణ మగునంచు గగన మండలమందు
సాక్షి దోచెను, జగత్సాక్షి యపుడు. (సీ)
సమర యమర విజయసైనిక ధ్వానంబు
లనగ దోచె పికముల సదు లపుడు,
విష్ణుపాదమందు వీరవైష్ణవ నిత్య
పరమవీరచక్ర ప్రభలు దోచె. (ఆ.వె)

కుడిచేతిలో ప్రేమలేఖతో తడబడుతూ వణుకుతున్న రుక్మిణిలాగా అనిపించింది ఆమె. ఆకాశంలో అగ్నిని కలిగించే సూర్యుడు కనిపించాడు, భాగవతంలో అగ్నిద్యోతనుడిలా. భారతదేశం మధుర కాబోతున్నట్లు అనిపించింది. విక్రముడు మదురానగర విక్రముడైన శ్రీకృష్ణునిలా కనిపించాడు. భారతదేశానికి భవిష్యత్తులో కళ్యాణం జరుగబోతున్నట్లు, శుభము కలుగబోతున్నట్లు కనిపించింది. కళ్యాణము అవుతుంది, శుభముకలుగుతుంది అని సాక్ష్యం చెప్పనున్నట్లుగా, జగత్సాక్షి ఐన సూర్యుడు కనిపించాడు.

యుద్ధరంగంలో అమరులు, విజయులు ఐన సైనికుల జయజయ ధ్వానాలలాగా ఉదయకాలంలో కోకిలలు కూస్తున్న సవ్వడి వినిపించింది. విష్ణుపాదమైన ఆకాశంలో వీరవైష్ణవుడు, వైష్ణవవీరుడు, నిత్యుడు ఐన సూర్యుని గుండ్రని వృత్తాకారపు వెలుగులు కనిపించాయి. రాబోతున్న పరమవీరచక్ర ప్రభలలాగా కనిపించాయి సూర్యచక్ర ప్రభలు!

సూర్యోదయ వర్ణన

జారెడు యామినీ కరియచాయలు, వేకువ లవ్వ నెర్ణనౌ
జీరలు, జ్యోత్స్నలం దలతి చిక్కిన తెల్లని వన్నెలుం, దగన్
వారిజ కోటులం దన కవారిగ పొంగెడు పుప్పొడుల్ గొనం
దీరిన నల్లనల్, ఎరుపు, దెల్లని, పచ్చని రంగులీ ధరన్,
దీ రగు వర్ణచిత్ర మిల! తిగ్మకరుండను చిత్రకారుడున్! (ఉ)

జారిపోతున్న రాత్రినుండి నల్లని రంగును, అప్పుడప్పుడే ఉదయిస్తున్నకాంతుల ఎఱ్ఱని రంగును, మాయమవుతున్న వెన్నెలనుండి తెల్లని రంగును ఉదయం అవుతుండడంతో వికసిస్తున్న పుష్పముల పుప్పొడి రేణువులనుండి పచ్చనిరంగును తీసుకుని, నలుపు, ఎరుపు, తెలుపు, పసుపు అనే ప్రాథమిక వర్ణములతో జగత్తు వర్ణచిత్రంగా రూపుదిద్దుకున్నది, సూర్యుడు ఆ వర్ణచిత్రకారుడు అయినాడు!

కన్నుల జూడలేక, పలు కన్నది లేక, వినంగ శక్తియున్
సున్నము గాగ, వాసనయు చూడగ లే కటు శ్వాసమాత్రమై
యున్నవి జీవు లన్ని పడి యున్నటు పక్కల దక్కి స్పర్శకున్,
పన్నగమైన కాల, మటు బా గిడు వైద్యుడు భాను డొచ్చెడిన్! (ఉ)

కాలము అనే పాము కాటుకు గురై, చూపు, పలుకు, వినికిడి, వాసనచూసేశక్తి, స్పర్శ అన్నీకోల్పోయి, శ్వాసమాత్రంగా పక్కమీదపడి వున్న

జీవులకు చికిత్స చేసి బాగుజేసే వైద్యుడిలాగా సూర్యుడొచ్చాడు! పాము కాటుకు గురైనవాడికి ఈ లక్షణాలన్నీ ఉంటాయి. వుండీ లేనట్టు శ్వాస ఉంటుంది, అందుకే శ్వాసమాత్రంగా అనడం. సూర్యుడు ఎలాగూ ఆరోగ్యాన్నిచ్చేవాడు, కనుక వైద్యుడిలాగా వచ్చాడు. రాత్రంతా పక్కమీద పడి ఉన్నవారు, ఉదయించిన వెంటనేనో, తర్వాతో లేవడం జరిగేదే.

పురముల నపుడును యిపుడును,
అరయగ నొక వనము నపుడు, అన్నిటి నిపుడున్
ధరణిజ నపవాదు కపుడు,
ధరణి నెపుడు, సిగ్గిది యని తన యరుణిమలున్! (కం)

అప్పుడు 'పురములను' కాల్చాడు, శివునిగా, యిప్పుడూ పురములను కాలుస్తున్నాడు తనవేడిమితో. అప్పుడు ఒక(ఖాండవ) వనాన్ని కాల్చాడు (శ్రీకృష్ణునిగా, దగ్గరుండి మరీ కాల్పించాడుకనుక), యిప్పుడు అన్ని వనములనూ కాలుస్తున్నాడు తన వేడిమితో! ధరణిజ సీతను అపవాదు వస్తుంది అని అప్పుడు కాల్చాడు(రామునిగా) ధరణిని, భూమిని ఎప్పుడూ కాలుస్తూనే ఉన్నాడు, తనవేడిమితో. కనుక తన కృత్యములను తలచుకుని సిగ్గుతో ఎర్రబడ్డాడు బహుశా, అందుకే ఈ ఎర్రని కాంతులు సూర్యునకు!

('శివాయ విష్ణురూపాయ' అన్నది అందరికీ తెలిసినదే. ' ఆదిత్యంచ శివం విద్యాత్ శివ మాదిత్య రూపిణం ఉభయోరంతరం నాస్తి ఆదిత్యస్య శివస్యచ' అని, శివుడే సూర్యుడు, సూర్యుడే శివుడు, ఇరువురిలో భేదంలేదు,ఈ రకంగా కూడా, సూర్యనారాయణుడు – నారాయణుడు – శివుడు ఈ ముగ్గురిలో ఏ భేదమూ లేదు, దీన్ని శ్లేషగా చెప్పడానికి ప్రయత్నంచేశాను – రచయిత)

కిరి వలనను, కరి వలనను,
గరము వలన, గగనములకు గతముల ఘనముల్,
చిరుతల కిడుములు కలగిన
తరుణములను తలచుటనగు తరుణారుణముల్! (కం)

కిరి అంటే పంది. అది వరాహవతారాన్ని హిరణ్యాక్షుడిని తలచుకుని కావచ్చు, అర్జునుడితో యుద్ధం చేసిన సందర్భము, మూకాసురుడు మరణించడం గుర్తుకొచ్చి కావచ్చు. కరి అంటే ఏనుగు, తెలిసిందే. అది మొసలినోటికి చిక్కిన ఏనుగు గుర్తుకొచ్చి కావొచ్చు, కంసుడు పంపిన కువలయా పీడం అనే ఏనుగు గుర్తుకొచ్చి కావచ్చు, గజాసురుడు గుర్తుకొచ్చి కావచ్చు. గరము అంటే విషము, గరళము మింగిన సందర్భము కావచ్చు, గరళము నిండిన కాళీయుడు గుర్తుకొచ్చి కావచ్చు. గగనములకు అంటిన 'ఎదిగిన' గతముల ఘనతలు, అంటే వామనావతారం కావచ్చు, 'గంగ పొంగును' దించడానికి ఎదిగిన శివ విశ్వరూపమూ కావచ్చు. చిరుతలకు, అంటే ప్రహ్లాదుడు కావచ్చు, మార్కండేయుడు కావచ్చు, వారికి కలిగిన కష్టములను, ఆ యా సందర్భాలను గుర్తుచేసుకొనడం వలన కావచ్చు, తరుణ అరుణుని, బాల సూర్యుని ఎర్రని కాంతులు, సూర్యోదయం లోని ఎర్రని వర్ణము అని కవి భావన!

వీ డాదిన భూత మగును,
లే దేరికి నిట్టి కొడుకు లె మ్మని రోటన్
నా డా కట్టుట వలనై
నా డా ఎర్రనలు సూర్య నారాయణుడున్? (కం)

'కేయూరవాన్ మకర కుండలవాన్ కిరీటీ హారీ హిరణ్మయవపుర్ధృత శంఖ చక్రః..' అని స్తుతింపబడే సూర్యమండలాంతర్వర్తి ఐన సూర్యనారాయణుడే శ్రీ కృష్ణుడు కనుక, ' వీడు ఆదిభూతం(!) కావచ్చు, 'యిలాంటి కొడుకు' ఎవరికీ లేరమ్మా అని కోపంతో, తను చేసిన అల్లరికి శిక్షగా ఆనాడు రోట కట్టుబడినవిషయం గుర్తుకొచ్చిందా, అందువలన

రోషంతో కోపంతో యింత ఎర్రన ఐనాడా 'సూర్యనారాయణుడు'?

భళ్ళున తెల్లారెను, చెడు
కళ్ళని దిగబోయ శిశువు కతి ఎర్రనివౌ
నీ, ళ్ళిను బాలుని, కవి పడి,
ఏళ్ళును, బీళ్ళుయును యూళ్ళు నెర్రన బారెన్! (కం)

భళ్ళున తెల్లారింది. బాలభానుడు ఉదయించాడు. ఆ భానుడనే బాలకునకు దృష్టిదోషం తగులకుండా ఎఱ్ఱని నీళ్ళను తిప్పి దిగపొశారేమో, ఆ నీళ్ళు పడడంవల్లనేమో అన్నట్టు యేళ్ళు, బీళ్ళు, ఊళ్లు అన్నీ ఎఱ్ఱబారాయి, ఆ అరుణోదయ కాంతులలో!

చీకటి యసురుని తనువున
బాకులు రవి కిరణములవ బారిన రుధిరం
బాకసమున కలమెననగ,
వేకువ కలిగెను, తొలగిన వేదన లనగన్! (కం)

చీకటి అనే అసురుడి శరీరములో దిగబడిన బాకులేమో సూర్యుని కిరణములు, ఆ బాకులు గుచ్చుకొనడంవలన ప్రవహించిన రక్తపు ఎర్రదనము ఆకాశానికి అంటుకున్నదేమో అన్నట్లు ఎఱ్ఱగా ఉదయమయ్యింది. వేదనలు తొలిగి ప్రశాంతత కలిగినట్లు హాయిగా ఉదయమయ్యింది!

తూరుపు కొండను స్తనముగ,
గారపు తనయుడు రవి తన కాకలి కలుగన్,
చేరెను నభమను జననిని
తీరిన దాకలి తిమిరము, దిక్కుల వెలిగెన్! (కం)

ఆకలి కలిగి, ఆకాశము అనే తల్లిని సూర్యుడు అనే గారాబాల కొడుకు చేరుకున్నాడు, తూరుపు కొండ అనే స్తనమును పొందాడు, ఆకలిని

తీర్చుకొనడంకోసం. ఆకలి అనే చీకటి తొలిగింది, దిక్కులలో వెలిగిపోయాడు ఆ కొడుకు, తెల్లవారింది!

ఒదవెడు సిగ్గుతో నొప్పగ తమకంబు,
రేయదితిన్ మౌని రేడు గలువ
కడుపు పండినటుల గగనంబు పండగా,
కలిగె శిశువనగా కలిగెనినుడు
కాదు, ఔనంచు లో కాంక్ష మెరసినట్లు,
మంచు ముసుగులోన మహియు మెరసె
చెలరేగెడి మరుల చెంప కెంపుల సొంపు
దిక్కులందు గలిగె, దిశలు వెలిగె (సీ)

మొలచు పులక లనగ మొదటి కిరణములు,
తొలగు సిగ్గు లనగ దోచె తమము,
గరగరికల తరుణి కనులన సగములు
విరిసె కమల తతులు, వెలుగు గలిగె! (ఆ.వె)

అదితికి సిగ్గు, తమకము రెండు ఒకేసారి కలుగగా, ఆ రాత్రి అదితితో మునివరుడు కశ్యపుడు సంగమించాడేమో,ఆమెకు కడుపు పండిందేమో అన్నట్లు ఆకాశం పండి, కలిగిన శిశువు అన్నట్లు సూర్యుడు కలిగాడు(పుట్టాడు)సిగ్గు అనేది అపరాధభావన, ఉద్దేశపూర్వకంగా సిగ్గు అన్నాడు కవి, శృంగారభావము మాత్రమే అయితే 'వ్రీడ' అనేవాడు. కామాన్ని జయించలేని కారణంగా కలిగిన సిగ్గు అని!

కాదు-ఔను.. తప్పు-తప్పదు .. అనే ఊగిసలాటలాగా కనిపించీ కనిపించనట్లుగా మంచుపరదాల మాటున భూమి మెరిసిపోయింది. అదితికి చెలరేగుతున్న మరుల కారణంగా చెంపలకు కలిగిన కెంపుల రంగు అన్నట్లుగా కెంపుల రంగులు దిక్కులకు కలిగింది, ఎర్ర ఎర్రగా దిక్కులు వెలిగిపోయాయి.మొదటి కిరణాలు పొడిచాయి, పులకలు మొలిచినట్లు. యిక తొలిగిపోతున్న సిగ్గులు అన్నట్లుగా చీకట్లు తొలిగిపోయాయి.

మదనభావ పారవశ్యంతో సగం మూసుకున్న అదితికనులలాగా కమలములు అరవిచ్చుకున్నాయి, తరువాత పూర్తిగా యివి విచ్చుకుంటాయి, అవి మూతబడుతాయి అని ధ్వని! వెలుగు కలిగింది, ఉదయము అయ్యింది!

జయ హయముఖ! హయ వర్ధన!
హయ మర్దన! హైహయాన్వ యాంత! యనంతా!
జయ జయ హయ వాహన! ఘన!
జయ జయ జమలాపురీశ! జయ జగదీశా! (కం)

హయముఖా! హయగ్రీవా! వేదమును వర్ధిల్లజేసినవాడా! (హయము అంటే వేదము అని కూడా) గుర్రం రూపములో వచ్చిన రాక్షసుడిని సంహరించినవాడా, శ్రీకృష్ణా! కార్తవీర్యార్జునుడి వంశము ఐన హైహయ వంశమును అంతముచేసిన పరశురామా! అనంతా! గుర్రమునెక్కి వచ్చే కల్కిస్వరూపా! నల్లనివాడా! ఘనుడా! జమలాపురీశా! జగదీశా! నీకు జయము!జయము! జయము!

నరవరసఖ! గోదానాథ! శ్రీరంగ నాథా!
గరుడవరవిహారా! గానకేళీ విలోలా!
పరమపురుష! శ్రీశా! పాండురంగా! పరేశా!
మురహర! రసలోలా! మోహనా! మోహనాశా! (మాలిని)

అర్జునుని సఖుడా! ఉత్తములైన మానవులకు సన్నిహితుడా! గోదానాథా! శ్రీరంగనాథా! ఉత్తముడైన గరుడుని వాహనముగా చేసుకుని విహరించేవాడా! గానక్రీడలో మైమరచేవాడా! పరమపురుషా! శ్రీలక్ష్మీపతీ! పాండురంగా! పరమునకు ఈశ్వరుడా! మురాసురుడిని సంహరించినవాడా! రసలోలా! మోహనాకారా! మోహమును నశింపజేసేవాడా!

వ.

యిది సాధ్వీమణి సావిత్రీబాయి ఖనోల్కర్ దివ్య స్మృతికి అంకితముగా, బమ్మెర పోతనాఖ్యు పదపరిచయ పులకిత గాత్రుడను, సజ్జన వేంకట రామరాయ పుత్రుడను, వేంకటేశ్వర రాయ పౌత్రుడను, సాహితీ ప్రియంభావుకుల ప్రియ మిత్రుడను, వేంకట వరప్రసాదరాయ నామధేయుండను అగు నాచే విరచితమైన 'పరమవీరచక్ర'మను నామంబు గల పద్య గద్య నిహిత నిస్తుల కావ్యమందు తృతీయాశ్వాసము.

చతుర్థాశ్వాసము

శ్రీ జమలాపురి వర! సుర
భూజ! కలిమల హరణా! విభో! వినుమయ్యా!
పూజల గొని బొగడుచు నా
రీజన భూషణమనదగు రీతులు సతివౌ! (కం)

జమలాపురమునందున్న శ్రేష్ఠుడా! కల్పవృక్షము వంటివాడా! కలిదోషములను హరించేవాడా! ప్రభూ! వినుమయ్యా! ఆ సతివి, సావిత్రివి, పూజలు చేసి, నారీజన భూషణము అని పొగడే రీతులవి, అంతటి ఉత్తమురాలు ఆమె!

వ.

ఆవిధంబుగా తన తొలిలేఖను పంపినదాదిగా కనులు వాకిటనిడి, మనము భారతముననిడి, తనువు విరహతాపమున సెగలిడి, సుడివడి, ఆతని ప్రత్యుత్తరమునకై త్వరపడి, పదపడి వసంతమరుదెంచినంతట

ఆ మధుమాసమందు విననాయెను పల్కులు నర్మగర్భముల్!
'మీ మగవారు మమ్ములను మించుచు పైకన రాగనీరుగా!'
'ఓ మగువా! వినేటికి యి దొప్పును యిప్పుడు నాకు నెప్పుడున్!'
వా! మధు వానుటే నువుగ వచ్చుట పైకన నాకమెచ్చుటల్! (ఉ)

ఆ మధుమాసములో నర్మగర్భములైన పలుకులు వినబడ్డాయి. మీ మగవారు మిమ్ములను మించి, మమ్ములను 'పైకి రానీయరుగా' అనీ, ' ఓ మగువా!విను! ఎందుకు! అది నాకు యిప్పుడే కాదు, ఎప్పుడూ సమ్మతమే! వా! సుధలను అందుకోవడమే నువ్వు పైకి రావడం అంటే, స్వర్గం అతిశయించడమే! మమ్ములను జీవితంలో సంఘంలో పైకి రానీయరుగా మీ మగవారు అని ఆవిడ అంటే అదేమీ కాదు, నువ్వు ఉన్నతంగా పైకి వస్తే అది నాకు అమృత తుల్యమైన అనుభూతి తప్ప మరొకటి కాదు, నువ్వు ఉన్నత స్థితికి రావడం అంటే స్వర్గముకన్నా మిన్నగా ఐపోదూ జీవనము? అని పైకి అన్నట్టుగా, లోపల శృంగారసూచకమైన పలుకులు నర్మగర్భంగా వినబడుతున్నాయి ఆ వసంతఋతువులో!

రాలుట? వానధారలుగ రాశులు పూవులు! ధారలౌటలా?
జాలుల తేనెపారుటలు! జాలుల? ఏరులుగా ప్రవాహముల్!
నేలను నింగి నేకతమ నెచ్చట జూసిన తేటిమోతలై
లీలగ ముంచివేసె రసలీల లనంగ జనాళికాశలున్ (ఉ)

ఎటుచూసినా పూవులు రాలుతున్నాయి! రాలడమా కాదు, వానధారలలాగా, రాశులుగా పూలు కురుస్తున్నాయి. ధారలా? కాదు, కాలువలుగా తేనెలు పారుతున్నాయి. కాలువలా? కాదు, ఏరులుగా ప్రవాహములై తేనెలు పారుతున్నాయి. నేల, నింగి ఏకమయ్యేట్లు ఎక్కడచూసినా తుమ్మెదల ధ్వనులై, లీలగా రసలీలలు అంటే జనులకు ఆశలు ముంచెత్తాయి. రసలీలలు, మన్మథుడి బృందానికి ఆశలు ముంచెత్తాయి!

ఆవిరు లావిరుల్ గొనగ, నామని, నావని, నాయనంగునిన్
దావమునైన యా విరహదారుణతాపము తాళలే, కహో!
నావధకే గదా! యిటుల నాలిగ, గోలగ, గోల గాలగా,
పూవుల నమ్ముతెమ్మెరలు, బూదియ గమ్మని తిట్టు, ఘొల్లనున్! (ఉ)

ఆ విరులు, ఆ పూవులు ఆవిరులు ఎగవేస్తుంటే, వసంత ఋతువును, ఆ తోటను, ఆ మన్మథుడిని, దావానలమైన ఆ దారుణ విరహతాపాన్ని తట్టుకోలేక, అహో! నా వధ కోసమే కదా యిలా నాలిగా, గోలగా, కన్య కాలిపోవాలనే కదా పూలబాణాల గాలులు, నువ్వు బూడిద గానూ! అని మన్మథుడిని తిడుతుంది. ఘొల్లున రోదిస్తుంది.

వ. అంత
వాసంత మందంత పంచమంబున గాన
వాహినుల్ ముంచెత్త, వలపు వరద
లెత్తంగ, మెత్తనౌ లేమంబు లెక్కింత
లెట్టు దినంబులు, లేదు లేఖ
యంచు వాకిట కన్నుయై పొంచు, నన్నుంచె
నాయింట కావలి, నన్ను ముంచె!
బండగుండెలు మొండిభటులవి, ఎటులవి
కరుగు? కడుపు చింప, కాళ్ళ వరద! (సీ)
అనుచు ఘోష వెట్టి, యార్చి, నిట్టూర్చియు
మునిగె శోక జలధి ముద్దుగుమ్మ,
అంత నొక దినంబు అరుదెంచె నొక లేఖ,
పడతి కట్లు వలపు పడవ గట్లు! (ఆ.వె.)

అలా వసంతంలో కోకిలలగానము పంచమ స్వరంలో ప్రవాహములెత్తగా, ఆమెకు వలపు వరదలెత్తగా మెత్తబడ్డ ఆ లేమ, ఆ తరుణి రోజులు లెక్క బెడుతుంది. లేఖ రాలేదు అని వాకిట కన్ను వేసి పొంచి చూస్తుంది. నా యింటికి నన్నే కావలి పెట్టాడు, కావలి గాస్తున్నట్లు ప్రహరీకి, యింటికీ ప్రదక్షిణ చేస్తున్నాను. నన్ను ముంచాడు! ఈ మొండి భటులవి బండ గుండెలు! అయినా ఏమనుకుంటే ఏం లాభం? కడుపు చించుకుంటే కాళ్ళ మీద వరద అవుతుంది! యిలా అనుకుంటూ ఘోష పెట్టి, నిట్టూర్చి ఆ ముద్దుగుమ్మ శోకజలధిలో మునిగింది. అంతలో ఒకరోజున ఒకలేఖ వచ్చింది, ఆమె వలపుల పడవ గట్టుకు చేరినట్లు!

తొలివలపుల లేఖ, తొలిసేవలకు రూక,
కోరి తొలిగ మగడు కొన్న కోక,
తొలి విజయముపొందు, తొలికలయిక, ముద్దు,
తొలివి తొలుగ, వెపుడు దోచు తీపి! (ఆ.వె.)

మొదటి ప్రేమలేఖ, మొదటి ఉద్యోగవేతనం, భర్త తొలిసారిగా కోరి కొన్న చీర, తొలి విజయపుపొందు,తొలిసమాగమం, మొదటి ముద్దు యిలా మొదటి అనుభవాలు, అనుభూతులు ఎన్నడూ మరుపుకు రావు. ఎప్పుడూ తీయగా అనిపిస్తాయి.

శ్రావణంబున తొల్లి చల్ల చల్లని జల్లు
చిప్పిల్ల చోద్యంపు చిగురు వోలె,
అలరించు తొలి చుక్క అమ్మ పాలది దక్క,
చిన్ని నవ్వుల చిందు శిశువు భంగి
నల్ల నల్లని మేఘ నాగంబులను గన్న
పింజళ్ళ కేకిదౌ పిల్ల వోలె,
పొంగెత్త తేనియల్ భృంగసంగతి కంగ
లార్చెడు చిన్నారి అలరు భంగి (సీ)

అందుకొనెను లేఖ అదరుచు నిలువెల్ల,
అంతరంగమందు ఆశ లెగసె
ముద్దుగొనుచు దాని మురిసి గుండియకత్తి,
లేఖ తెరిచి చదివె లేమ యపుడు. (ఆ.వె.)

శ్రావణమాసంలో చల్లని తొలకరి జల్లు చినికినపుడు చోద్యంగా చూసే చిగురులాగా, ఆనందకరమైన అమ్మపాల తొలిచుక్క దక్కినపుడు చిన్ని నవ్వులు చిందించే శిశువులాగా, నల్ల నల్లని కొండలలాంటి మేఘాలను చూసినపుడు గంతులేసే పిల్లనెమలిలాగా, తుమ్మెద పొందుకోసం అంగలార్చే తేనెలు పొంగువారుతున్న చిన్ని పూవులాగా, నిలువెల్లా వణకుతూ ఆ లేఖను

అందుకున్నది ఆమె. ఆమె అంతరంగంలో ఆశలు ఎగిసిపడ్డాయి. మురిసిపోతూ, ఆ లేఖను ముద్దుపెట్టుకుంటూ, గుండెకు హత్తుకుని, అప్పుడు ఆ లేఖను తెరిచి చదివింది ఆమె.

సేమము నేనిట చెలియా!
సేమము నీకగునని తలచెద నే నచటన్,
ఏమన నే మగునోయని
నామది తలపుల నణతును, నాదొక విధమౌ! (కం)

నేనిక్కడ క్షేమం చెలియా! అక్కడ నీకు క్షేమమేనని తలుస్తాను. ఏమంటే ఏమవుతుందో అని నా మనసులోని తలపులను నాలోనే అణచుకుంటాను నేను. నాదొక తీరు!

లోకులతో లోకుడ, నే
కాకిగ కరివరద విమల కాముడ, చెలియా!
పోకడ చిత్రము నగు, నా
లోకము దారుణము, రణము, లోననె మమతల్! (కం)

లోకులతో ఉన్నపుడు లోకంలో ఉంటా. ఒక్కడిని ఉన్నపుడు కరివరదుడైన శ్రీహరికి నిర్మలమైన ప్రేమికుడిని నేను. నా పోకడ చిత్రమైనది. నా లోకము దారుణమైనది. అది యుద్ధరంగం! నా ప్రేమలు అన్నీ లోపలే ఉండిపోతాయి. బయటకు వ్యక్తపరచను నేను.

సాములు, పుణ్యకాము లిట సారవిహీన కథా కదంబముల్,
తామును దారవాద, పరదారల దారు, లుదారవాదులున్
కామము, రోదసీ, జలధి, కానన, శైల మహోగ్రవీధులన్,
నీమముగాగ, మాకు గన నిద్ధర నద్దుల నద్ది ముద్దుగన్! (ఉ)

యిక్కడ సాములు సారహీనమైన కథా కదంబకార్యక్రమాలు! తాము భార్యామయ ప్రపంచంలో,పరస్త్రీల దారులలో, ఉదారంగా వుండే సాములు ఇక్కడ! ఆకాశము, సముద్రము, అడవి,పర్వతాల మహా ఉగ్రమైన వీధులలో ఈ భూమిని, సరిహద్దులను ముద్దుగా కనిపెట్టుకుని ఉండడం మా నియమము, సైనికులము కదా!

భూముల పిచ్చిలేదు, రణభూమి యటన్నను పిచ్చిమాకు గో
తాముల లచ్చి కాదు రుచి, తాండవకేళి రణాంగనాన మా
భామల, తల్లి దండ్రు లెడబాసియు, పిల్లల మోసపుచ్చి, మే
మో మరి రేపు, మా పనుచు ముచ్చట నిచ్చట మూకవిచ్చుటన్!(ఉ)

మాకు భూములపిచ్చి లేదు. రణభూమి అంటే పిచ్చి. సంచులలో నింపుకునే డబ్బులమీద కాదు.

యుద్ధభూమిలో తాండవకేళి ఆడడం అంటే మాకు రుచి. మా స్త్రీలను, తల్లిదండ్రులను ఎడబాసి,పిల్లలను మోసంచేసి, వెంటనే, రేపో, మాపో వచ్చేస్తాము అని అబద్ధాలు చెప్పి, యిక్కడ యుద్ధరంగంలో శత్రువులను చీల్చడంలో ఉంటాము ముచ్చటగా!

మనుగడ మూడగు దినములు
మనసగు, మధురమునగు శుభమగు విధి మనుటల్
మనికకు, మనసునకు వలెను
మనిషికి గద రస పరవశ మధురిమ మగువా! (కం)

బ్రతికే మూడునాళ్ళు మనసైన, మధురమైన, శుభమైన రీతిలో బ్రతకడం బ్రతుకుకు, మనసుకు కావాలి కదా! రసపరవశత్వ మధురిమ మనిషికే కదా మగువా!

ఉదరముకొరకగునవి, నీ
హృదయము కొరకగునవి, రస హృష్టములవియొ
చదువుల, కొలువుల విధములు
ఉదరము, హృదయము తనియుట ఉచితము ఉవిదా! (కం)

పొట్టకూటికోసం చేసేవి, నీ హృదయాన్ని సంతోషంగా ఉంచుకోవడంకోసం చేసే రసాత్మకమైనవి యిలా చదువుల, ఉద్యోగాల విధాలు ఉంటాయి. కడుపు, మనసు రెండూ నిండడం ఉచితము, అవసరము కదా!

చేయునది వలచు టెరుగుము,
చేయుము వలపిడెడి పనులు చేయుట నైనన్,
చేయుట మానుము చివరకు
చేయుట రుచి నిడని పనిని, చెలియా సరియా? (కం)

చేసేపనిని ప్రేమించడం నేర్చుకో! లేదూ నువ్వు ప్రేమించేపనులను చేయడం అయినా నేర్చుకో! చివరికి, నీకు చేయడం రుచించని పనులను చేయడం మానుకో కనీసం! సరేనా చెలియా?

వ.

యిట్లు దోబూచులాడుచూ ఊరించు విజయమువలె, సగము గెలిచిన యుద్ధము వలె, సగము అర్థమై సగము కాని కవిభావనవలె అటునిటూ గాని వర్షమువలె వాని ప్రథమ లేఖ యుండెను. నాటినుండి మొదలుకొని ఉత్తర ప్రత్యుత్తరముల వరద పోటెత్తినది. నానాటికీ వారిరువురి అభిరుచులు, ఆలోచనలు, ఆశలు, ఆశయములు పరస్పరానుగుణములుగా, ఏకవాహినిగా పరుగులెత్త సాగినవి. ఆమె మానసికముగా పూర్తిగా వానికి అంకితమైనది. శారద తదియనాటి చంద్రునివలె ఆమె అభిలాష బయల్పడినది. ఆతని మనంబు శ్రావణ చంద్రునివలె నుండెను. వలపుల వెన్నెల గోచరించుచున్ననూ మనోనిశ్చయంబు మరుగుననే యుండెను. ఆతని ఉద్యోగ జీవితము ఉన్నత పదవులకు వృద్ధిచెందుచుండెను. వానిపట్ల

ఆమె యనురక్తి వృద్ధిచెందుచుండెను. పదవుల బాధ్యతల రీత్యా ఆతడు అనేక ప్రదేశములకు తిరుగుచుండెను. ఆమెమనసు దూరదేశమునుండియూ వాని చుట్టే తిరుగుచుండెను. యివ్విధంబున మూడు వత్సరములు గడిచినవి. ఆమె తండ్రికి క్రమక్రమముగా తన కుమార్తె స్థితి అర్ధమైనది. ఐననూ ఆతడు లోకమును చదివినవాడు కనుక గుంభనముగ నుండెను. ఇక ఆతనికి దూరముగా, మనుగడ భారముగా ఉండజాలని స్థితికి ఆమె చేరుకున్నది. చెవులకు వాని పలుకులు, కనులకు వాని రూపము, పెదవులకు వాని నామము, శరీరమునకు వాని స్పర్శ, మనసునకు వానితోడి జీవనము లేకున్న మరణించుట యన్నట్లుగ ఐనది ఆమె స్థితి. తండ్రికి ఒకనాడు తన మనసును వెల్లడించినది. భారతావనిని తన మెట్టినిల్లుగా ఎంచుకున్నట్లు చెప్పినది. మూడు సంవత్సరములక్రితము పరిచయమైన దినమునుండీ ఆ భారతీయ సైనికునిపట్ల తన మనసు లగ్నమైన విధమును తెలియజేసినది. తమ ప్రణయము పరిణయముగా పరిణమించవలసిన తరుణము వచ్చినదని స్పష్టపరచినది. ఆమె తండ్రి సమ్మతించలేదు. ఐననూ ఆమె తన భావిని నిశ్చయించుకున్నది. ఆ రోజుననే ఆతని వద్దనుండి వచ్చిన లేఖ వలపులమధువు నిండిన కుండయైన ఆమె గుండియ యందు కోరికల సుధలను గుమ్మరించినది. ఆ వెన్నెల రాత్రి ఆతనికి ప్రత్యుత్తరము వ్రాయుటకు సిద్ధపడినంత మరుల మధువు అలలెత్తినది. ఉరకల పరుగుల నురుగుల కోరికలవాహిని ప్రవహించినది.

వేళయొ వెండివెన్నెలది, వేపెదు పాళ వియోగమైన దా
కేళికి కన్యకున్ రతుల కిచ్చుల చెచ్చెర నూహలైన, వా
నాళిక లేతనౌ సుదతి నాశల ఊయలలూప వేచె, నా
వేళయు పాళలేక పెనవేసెడు మన్మథకేళి వేళకై. (ఉ)

వెండి వెన్నెలవేళ అయ్యింది. వేపుకునే వియోగం పాళ అయ్యింది. ఆ కన్యకు రతికేళికి కోరికలతో తీవ్రవేగముతో ఊహలు చెలరేగాయి. తీగలా నాజూకైన ఆ సుదతిని ఆశల ఊయలలు ఊపడంతో,వేళా పాళా అనే హద్దులు లేకుండా పెనవేసుకునే మన్మథకేళికోసం ఎదురుచూడసాగింది.

పొలమారు పలుమారు, భోజనం బగుచుండ,
నీవు తలచితంచు నిండు కడుపు
మాగన్ను గవ, నన్ను మధుర కంఠంబుతో
నీవు పిలిచినట్లు, నిదు రికెట్లు?
నా పూలతోటలో, నా కాలిబాటలో,
నావెనుకన నీవు, నా భ్రమట్లు!
నవ్వకోయీ! ఒంటినై స్నాన మాడుచో,
చాటుగా నువు చూడసాగినట్లు! (సీ)

నడిమి రే, యుషస్సు, నట్టనడిమి రోజు
అపుడు, నిపుడు ననుచు ఆశ గొలుపు,
నీదు తలపు సలుపు నీయాన, నీలేఖ
నిలుపు వాకిట నను, నిలుతు వేచి! (ఆ.వె.)

భోజనం చేసేప్పుడు అనేకమారులు పొలమారుతుంది. నువ్వు నా గురించి ఆలోచిస్తున్నావేమో, అందుకే పొలమారుతున్నది అనుకుంటాను. నువ్వు నన్ను తలచుకుంటున్నావు అనుకోవడంతో యిక కడుపునిండిపోతుంది. మాగన్నుగా ఉన్నప్పుడు, నిద్ర పడుతూ ఉన్నపుడు నువ్వు నన్ను నీ తీయనిగొంతుతో పిలిచినట్లు అనిపిస్తుంది, యిక నిదుర ఎలా పడుతుంది? నేను పూలతోటలో నడుస్తున్నపుడు, నా కాలిబాటలో, నా వెనుక నువ్వు ఉన్నట్లు, అలా భ్రమ కలుగుతుంది. నవ్వొద్దు సుమా, నేను స్నానం చేస్తున్నపుడు చాటుగా నువ్వు చూస్తున్నట్లే అనిపిస్తుంది! అర్ధరాత్రి, ఉదయం, మిట్టమధ్యాహ్నం అప్పుడూ యిప్పుడూ అంటూ నీ తలపు నాకు ఆశ కలిగిస్తుంది. నన్ను సలుపుతుంది. నీమీదొట్టు! నీ లేఖ నన్ను వాకిట్లోనే నిలబెట్టి ఉంచుతుంది, దానికోసం, ఆ నీ లేఖకోసం ఎదురుచూస్తూ నిలుచుంటాను!

నేనొక టెయ్యెదో పుటక నీ భరతావని నందియుంటనన్,
తా నొకటేవిధిన్ మదిని తాండవమాడు సదాశివుండు, యా
జానకి, వల్లభుండు జత జాహ్నవి వీచి, దధీచి యోచనల్
కానగ, నిన్ను జోడు గొనగా నగు దారులు కర్మభూమికిన్! (ఉ)

నేను ఏదో ఒకజన్మలో నీ భారతదేశంలో పుట్టివుంటాను. అందుకేనేమో, ఆ తాండవశివుడు నటరాజు ఒకటేపనిగా నా మనసులో తాండవ మాడుతుంటాడు. ఆ సీత, ఆమె భర్త తోడుగా, గంగా కెరటం, త్యాగమూర్తి దధీచి ఆలోచనలు కలుగుతాయి. చూడగా, నిన్ను జతగా పొందితే ఆ కర్మభూమికి దారులు ఏర్పడుతాయి.

గాలికి నూగునీ తెరలు గాథలు, కోరిక లెన్నిఊయలల్!
కూలికి లేని బానిసను గొంటివి, తవ్వుచునుంటి నీ స్మృతుల్!
జాలిగ జూచుచున్నదది జాబిలి వెన్నెలజాలు తోటలో
కాలది సోకినా వరమె గాద గులాబికి, నాతిగుండెకున్ (ఉ)

గాలికి ఊగుతాయి ఈ విధంగా గాథలు. కోరికలు ఎన్ని ఊయలలు? కూలికి లేని బానిసగా చేసుకున్నావు నన్ను! నీ స్మృతులను తవ్విపోస్తున్నాను! జాబిలి జాలిగా చూస్తున్నది.తోటలో వెన్నెల మడుగు అవుతున్నది. ఈ గులాబికి, ఈ స్త్రీ గుండెకు కనీసం నీ కాలు సోకినా వరమే కదా!

మొద్దు తుపాకిపై మనసు, ముద్దుల ముద్రకు ముగ్ధపైన లే,
దద్దిర మొద్దు సైనికుని తత్త్వ! మదర్థ మొకింతముందు గా
వద్దుర! బుద్ధిహీనతగ వద్దుర, ఈదశ నాతికెన్నడున్
హద్దుర దేశభాషలన? హక్కులు ప్రేమ లవెల్లవారికిన్! (ఉ)

మొద్దు తుపాకీమీద మనసు, ముద్దుల ముద్రవేయడానికి ముగ్ధపైన లేదు, అదీ మొద్దుసైనికుని తత్త్వము. అది ఒకింత ముందు అర్థం గావద్దూ, యిప్పుడు అనుకుని ఏం ప్రయోజనం?బుద్ధి లేనట్లుగా ఈ దశ స్త్రీకి ఎన్నడూ రాకూడదు. దేశము, భాషలు అనేవి హద్దులా? అడ్డంకులా? ప్రేమలు

ఎల్లరికీ హక్కులు కదా!

అల్లరి చేతువో బతుకు? అల్లుకుపొమ్మని పందిరౌదువో?
ఒల్లను పొమ్మనందువొకొ? ఊహల సౌధము గూల్చివేతువో?
కల్లలుగాదు, నీ జతగ కాపురమో, రసగంగ పొందులో,
ఎల్లలు దాటివచ్చెదను, ఏలవొ, గంగలొ తేలమేలువో! (ఉ)

నా బతుకును అల్లరిచేస్తావో, అల్లుకుపొమ్మని పందిరివి అవుతావో, నిన్ను అంగీకరించను, పొమ్మంటావో, నా ఊహల సౌధాన్ని కూల్చివేస్తావో, అబద్ధం కాదు. నీ జతగా కాపురమో, నీతో రసగంగ పొందులో జరగాలి. హద్దులు దాటి వస్తాను. నా దేశాన్నివిడిచి వస్తాను. నన్ను యేలుకోకుంటే గంగలో తేలడం మేలు పో!

చేరగ దీతువా, సుధలు చిందెడి జీవన పానపాత్రమౌ
దూరము జేతువా, బతుకు దుస్తర దుఃఖవిషంపు పాత్రమౌ
భారము నీదెగా! వలపొ, బండగ గుండెను పిండివేతువో!
నీరమొ, ముంచ, పాలొ, నను నీపర మైతిని, నీవధూటికన్! (ఉ)

దగ్గరకు తీసుకుంటావా, అమృతాన్ని కురిపించే జీవిత పానపాత్ర అవుతుంది. దూరం చేస్తావా,బతుకు దుస్తరమైన దుఃఖపు విషపాత్ర అవుతుంది. భారమునీదే కదా! వలపో, బండలాగానా గుండెను పిండేస్తావో జాలి లేకుండా! నన్ను ముంచడానికి నీరో, పాలో, నీపరమైనాను. నీ వధువును నేను!

ఏలర! యేలరా? యిగన దేలవ? దేలర దేటి చందమౌ
లీలల తేనెజాలులను, లేమల లేతల దెల్లవారలున్
కాలము ఒక్కరీతిజన కౌగిలి కాన్కల గారవించుటల్
జాలము సేతురే?వలచు జంటలు కాలము జారనిత్తురే? (ఉ)

ఏలుకోరా! ఎందుకురా? యికనైనా తుమ్మెదలా లీలలతో తేనెల ప్రవాహంలో తేలవా? తేలుమురా! లేత కన్నెపిల్లలను తెల్లవార్లూ సమయము ఒకేరీతిగా సాగిపోయేట్లు, తేడా లేకుండా,కౌగిళ్ళ కానుకలలో గౌరవించడానికి ఆలస్యం చేస్తారా? ప్రేమించే జంటలు కాలాన్ని జారిపోనిస్తారా?

మత్తుగ మెత్తగా వలపు మత్తును జల్లితి వెయ్యదో మదిన్,
విత్తిన ప్రేమబీజమది వేలుగ కోర్కుల కొమ్మరెమ్మలున్
గుత్తులు గాగ బూచినది, గొందువొ, యే లని ఊరకుందువో!
ఇత్తు ఫలంబులు న్విరుల, నిచ్చుట కచ్చుటకొత్తు హాలికా! **(ఉ)**

మత్తుగా, మెత్తగా ఏదో వలపు మందును చల్లావు నా మనసులో! నాటిన ప్రేమబీజము వేల కోరికల కొమ్మలను, రెమ్మలను గుత్తులుగా పూచింది! స్వీకరిస్తావో, ఎందుకని ఊరుకుంటావో కానీ, ఫలములను, పూలను యిస్తాను నీకు(సత్సంతానమును యిస్తాను) యివ్వడానికి అక్కడికి వస్తాను కృషీవలా!

కంజవిపులలోచన! ఖర
భంజన! కరిరంజన! రస పంజళిబృందా
కుంజ నిరంతర శింజిత
మంజులపద కలిత రాసమండల భూషా! **(కం)**

విశాలముగా విరిసిన పూల వంటి కనులను కలిగినవాడా! ఖరుడిని సంహరించినవాడా! కరిని ఏనుగును ఆనాడు రంజింపజేసినవాడా! రసకేళిలో బృందావనములోని పూల పొదలలో నిరంతరమూ ధ్వనించిన మంజులమైన పదములతో రాసమండలానికి అలంకారమైనవాడా!

విశద విమలసత్త్వా! వేంకటేశా! రమేశా!
ప్రశమిత కలిఘోరా! ప్రార్ధనామాత్ర తోషా!
పశుగణ పరిపాలా! పాంచజన్యాఖ్యహస్తా !
నిశిచరనికరాంతా! నీలమేఘోజ్జ్వలాభా! (మాలిని)

స్పష్టంగా తెలిసే నిర్మలమైన సత్త్వము కలిగినవాడా! వేంకటేశా! లక్ష్మీశా! నాశనము చేయబడ్డ కలిఘోరములను కలిగినవాడా, కలిఘోరములను నాశనముచేసేవాడా! ప్రార్ధనచేతనే సంతోషింపజేసేవాడా! యింద్రియములనే పశుగణములను పాలించేవాడా, పశుపాలకుడవైన శ్రీకృష్ణా! పాంచజన్యమనే శంఖమును ధరించిన హస్తము కలవాడా! నిశాచరుల సమూహమును నాశనము చేసేవాడా! నీలిమేఘపు కాంతులను కలిగినవాడా!

వ.

యిది సాధ్వీమణి సావిత్రీబాయి ఖనోల్కర్ దివ్య స్మృతికి అంకితముగా, బమ్మెర పోతనాఖ్యు పదపరిచయ పులకిత గాత్రుడను, సజ్జన వేంకట రామరాయ పుత్రుడను, వేంకటేశ్వర రాయ పౌత్రుడను, సాహితీ ప్రియంభావుకుల ప్రియ మిత్రుడను, వేంకట వరప్రసాదరాయ నామధేయుండను అగు నాచే విరచితమైన 'పరమవీరచక్ర' మను నామంబు గల పద్య గద్య నిహిత నిస్తుల కావ్యమందు చతుర్ధాశ్వాసము.

పంచమాశ్వాసము

శ్రీరంగా! దనుజ నళిన
సారంగా! జలధిజాంగసారస భృంగా!
కారాంగణ భవ భంగా!
వీరాంగణ గంగపొంగు వింగడమిటులన్! (కం)

శ్రీరంగా! రాక్షసులు అనే కలువలపాలిటి గజమువంటి వాడా! సాగరకన్యకా దేహమును మరిగిన తుమ్మెదవంటి వాడా! ఖైదువంటి

ప్రపంచముయొక్క బంధములను త్రెంచేసే వాడా! వీరభూమిలో పొంగిన శౌర్యగంగ ఈ విధముగా స్పష్టము!

వ.

వీరసైనికుల శిక్షణా శిబిరమునందు ప్రధాన శిక్షకుడు సావిత్రీబాయి ఖనోల్కర్ చరితమును యివ్విధమున కొనసాగింపసాగెను.

అంతట నొక దినమున నొక
తంతిని యతడందుకొనెను తను విక్రముడా
యింతిది సందేశము, 'ఓ
కాంతుడ! ముంబయిన నేను కాలిడితినిరా!' (కం)

అప్పుడు ఒకరోజున విక్రముడు ఒక తంతిని అందుకున్నాడు ఆ యింతినుండి. అందులో ' ఓ పురుషుడా! నేను బొంబాయి వచ్చాను' అని సందేశము ఉన్నది.

వచ్చితి! విడిచితి జన్మము
నిచ్చిన నా జనకు నిపుడు, నెపుడో జననిన్
ముచ్చటగా కాపురమో,
చచ్చుటలో, ఒకటి వీర సాధ్యము పొసగన్! (కం)

నాకు జన్మనిచ్చిన తండ్రిని యిప్పుడు విడిచి వచ్చాను. తల్లిని ఎప్పుడో విడిచాను! ముచ్చటగా నీతో కాపురమో, లేక మరణించడమో ఈ రెండే ఉన్నాయి నాకు. వీరులకు సాధ్యమైనది ఒకటి (పరమవీరచక్రం) జరిగేలా చూసి మరణించడం అని ధ్వని!

చదివెను, వినిచెను జనకుని,
కది విని, కడుముదము నొంది, కౌగిలి, జనకుం
'డిది కడిదిర సిరియగు, మన
కెదురగునది యెదురుకోలు కెందుకు తడియన్? (కం)

అది చదువుకున్నాడు విక్రముడు, తన తండ్రికి కూడా చదివి వినిపించాడు. ఆయన తండ్రి అది విని, మిక్కిలి సంతోషించి, కుమారుడిని కౌగలించుకుని, యిది గొప్ప సంపదగా మనకు ఎదురు వస్తున్నది! 'ఎదురుకోలు'కు ఎందుకు ఆలస్యం?

అని, తన బంధుమిత్రులను యాదరముం గొనివచ్చి, కన్యకన్
ఘన రఘునాథ నాముడగు గాదిలి మిత్రుడు సచ్చరిత్రుడున్
తన సుతగాగ కన్యకను దానము జేయగ, రోచిషన్, స్నుషన్
గొనెనటు కోమలిన్, సుధల కోరక కోరిక లూరి తీరెడిన్! (చం)

అని, తన బంధుమిత్రులను గౌరవంగా వెంటబెట్టుకుని, ఆ కన్యకను తన సన్నిహిత మిత్రుడైన రఘునాథ్ అనే సచ్చరిత్రము కలిగిన వ్యక్తి తన కుమార్తెగా భావించి కన్యాదానము చేయగా, ఆ వెలుగుల కన్యను తనకు కోడలిగా చేసుకున్నాడు. ఆమె భారతీయ సంప్రదాయానుసారము విక్రముడికి భార్య అయ్యింది. తేనెలు చిలికే ఆ అరవిరిసిన మొగ్గవంటి కన్యకకు కోరికలు ఊరి, నెరవేరాయి.

గణితమందునొకడు గణనీయుడా దాత
గాగ కదనవేది గా గృహీత
ఘన రాంజి దొండాజి గాగ మామ, ఖనోల్క
రుల యింట లక్ష్మి దా రూపమపుడు
ప్రాక్పశ్చిమంబుల పాత కొత్తలమేలు
మేళనం బదియైన మేలు మేలు
అన్న వేదాంతసింహంబు ఆమెకు దేవు,
దట్టి గురుని గురు డామె గురుడు (సీ)

సాధ్వి కొత్త పేరు సావిత్రి యైనది,
రమణి మెట్టినింటి రాణి యయ్యె
రమణి కొక్క కోర్కె, రామకృష్ణ మఠము
చూడ గలిగె, మఠము జూడ నేగె. (ఆ.వె.)

గణితశాస్త్రములో ప్రసిద్ధుడైన రఘునాథ్ పరంజపే కన్యాదాత కాగా, యుద్ధశాస్త్ర కోవిదుడు విక్రం ఖనోల్కరు కన్యను స్వీకరించాడు. ఘనుడు ఐన రాంజీ దొండాజీ మామ అయినాడు, ఆ కన్యను కోడలిగా స్వీకరించాడు! ఖనోల్కరు వంశీయుల యింటిలో అప్పుడు ఆ లక్ష్మి వెలసింది. 'ప్రాక్పశ్చిమాల పాత కొత్తల విలువల మేలు కలయిక జరిగితే మానవాళికి మేలు జరుగుతుంది' అన్న వేదాంత కేసరి, స్వామి వివేకానంద ఆమెకు దేవునివంటి వాడు, ఆయన గురుదేవుడైన రామకృష్ణపరమహంస ఆమెకు కూడా గురుదేవుడే మరి. కనుక అలానే ప్రాక్పశ్చిమాల కలయికలాగా, ఆమెకు, విక్రముడికి కలయిక జరిగింది.

ఆ సాధ్వికి కొత్తపేరు 'సావిత్రి' అని పెట్టడం జరిగింది. ఆమె తన మెట్టినింటికి రాణి అయ్యింది. ఆమెకు ఒక కోరిక కలిగింది, అది శ్రీ రామకృష్ణ మఠమును సందర్శించడం. రామకృష్ణమఠమును చూడడానికి వెళ్ళింది.

వ.

అవ్విధమున పందొమ్మిదివందల ముప్పైరెండవ సంవత్సరము, డిసెంబరు ముప్పై ఒకటవ తారీఖున స్విట్జర్లాండ్ కూతురు 'ఈవ్' భారతి కోడలు సావిత్రిగా నామధేయమును గైకొని, రాంజీ దొండాజీ ఖనోల్కర్ కుమారుడు విక్రంజీ రాంజీ ఖనోల్కర్ సతీమణి యైనది. మెట్టినింట కాలుమోపిన పిదప యామె తొలిగా కోరిన కోరిక 'భగవాన్ శ్రీ రామకృష్ణుల' యాశ్రమమును సందర్శించుట. రామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులైన స్వామి అభేదానందతో 'దొండాజీ ఖనోల్కర్' కు గతమున పరిచయమున్న కారణముగా కొత్త కోడలిని అభేదానందుల దర్శనార్థము వెంటబెట్టుకుని వెళ్ళినాడు మామ. అచ్చట

ఆనందంబగు రాజహంసి యలలన్, ఆనంద కాసారమం,
దానందంబుగ నీదులాడు సరణిన్ తానొచ్చె నచ్చోటకున్,
మేనందం బులకాంకురంబు, నగవుల్ మేలొల్కుచున్ తా నభే
దానందుం డటు, రామకృష్ణ పద సంధానుండు లేడొందనన్! (శా)

ఆనంద స్వరూపమైన రాజహంస ఆనందము అనే సరసులో అలలలో అందంగా ఈదులాడుకుంటూ వచ్చినట్లు, శరీరమునకు పులకలు కలిగేట్లు నవ్వులుచిందిస్తూ, అభేదానందుడు అక్కడికి వచ్చాడు, తనలా శ్రీరామకృష్ణ పదముల బంధమును కలిగినవాడు వేరే ఎవరూ లేరు అన్నట్టు, వారికి దర్శనము యివ్వడానికి.

ప్రత్యక్షంబిది భారతంబు ధరణిన్ ప్రత్యక్ష వైకుంఠమున్
ప్రత్యక్షంబుగ రామకృష్ణు లొకటై ప్రత్యక్షమైనట్లుగన్,
ప్రత్యక్షంబు గదాధరుండు గురుడౌ ప్రత్యక్ష శిష్యుండటన్
ప్రత్యక్షంబవ, మోద బాష్ప జలముల్ ప్రత్యక్షమౌ వీక్షణన్! (శా)

యిది స్పష్టముగా కనిపించే విషయము. భారతదేశము భూమి మీది ప్రత్యక్ష వైకుంఠము. ప్రత్యక్షంగా రాముడు, కృష్ణుడు ఒకటై యిక్కడ ప్రత్యక్షమైనట్లుగా ప్రత్యక్షమైన గదాధరుడు, శ్రీ రామకృష్ణ పరమహంసకు ప్రత్యక్షశిష్యుడైన స్వామి అభేదానందుడు అక్కడ అలా ప్రత్యక్షమయ్యేప్పటికి ఆయనను దర్శించి, ఆమెకు ఆనందబాష్పాలు ప్రత్యక్షమైనాయి!

సాష్టాంగంబు నమస్కరింప, బలికెన్ సార్ద్రేక్షణల్ బర్వుచున్,
యిష్టాభీష్ట విశిష్ట సిద్ధియగునో యింతీ! ప్రసిద్ధంబు నీ
శిష్టాహార, విహార, చారణము, నీ శీలంబు లౌగా మహో
త్కృష్టంబుల్ గురురామకృష్ణకరుణాదృగ్జాలముల్, లీలలున్! (శా)

ఆమె సాష్టాంగముగా నమస్కరించింది. ఆయన సార్ద్రమైన చూపులను ప్రసరిస్తూ 'నీకు యిష్టమైన కోరికలు సిద్ధిస్తాయి నారీ! నీ ఉన్నతమైన ఆహార, విహారాదులు , నీ శీలము ప్రసిద్ధములౌతాయి. గురుదేవుడు శ్రీ రామకృష్ణుని కరుణాదృక్కులు, లీలలు మహోత్కృష్టమైనవి' అని ఆశీర్వదించాడు ఆమెను.

అభేదానందుల ఆశీస్సులను అందుకుని ఆనందపరవశురాలైన సావిత్రీబాయి కోరిన రెండవ కోరిక మహాభారతయుద్ధము జరిగిన ధర్మక్షేత్రమైన కురుక్షేత్ర సందర్శనము. ఆ పుణ్యభూమిసందర్శనముకొరకు ఆమె బాల్యమునుండీ కలలుగన్నది. యిప్పుడామె కోరిక నెరవేరినది. ఒక పితృతిథినాడు కురుక్షేత్రమును సందర్శించినయామె శ్రీకృష్ణ భగవానుని సహస్ర నామములను జపించి, భీష్మపితామహుడు ఆమెకు ఆదర్శమూర్తియైన కారణమున భీష్మ పితామహుని యివ్విధమున ప్రస్తుతించి, ఆనంద పరవశురాలైనది.

కోరిక లూరు ప్రాయమది, కోరను కోరనె లేదు తండ్రి, నీ
తీరది! నీకు నీవుగ విధించుకొనం గడకొంటి వయ్యరో!
కోరను రాజ్యమున్, గొనను కోమలి పొందుల నంచు, తండ్రికై,
దారుణ మైన శిక్షలను, దాసరికంబును, బ్రహ్మచర్యమున్! (ఉ)

అది కోరికలు ఊరే వయసు. నీ తండ్రి కోరను కూడా కోరలేదు. నీకు నీవే 'రాజ్యాన్ని, యింతులతో కలయికను కోరుకోను, సుఖాలను విడిచిపెడతాను' అని నీ తండ్రికోసం దారుణమైన శిక్షలను, దాస్యాన్ని, బ్రహ్మచర్యాన్ని విధించుకున్నావు తండ్రీ!

కొడుకు లనంగ నెందరిల కోర్కుల లక్షల ఘోర శిక్షలున్,
పిడుగులు, కన్నవారు విలపించెడు చెడ్డలు, నడ్డ దిడ్డములే!
కొడుకులు రాము, డీవు నన, కొద్దిగ హెచ్చుర నీవు చర్చలన్!
యిడుముల తోడు రామునకు, యిచ్చట నీ కెవరయ్య చూడగన్? (చం)

కొడుకులు ఎందరు లేరు ఈ భూమిలో? లక్షల కోరికలతో ఘోరమైన శిక్షలుగా తల్లిదండ్రులకు పరిణమించేవారు! తల్లిదండ్రుల పాలిటి పిడుగులు, ఎందుకు కన్నామా అని కన్నవారు విలపించే చెడ్డవాళ్ళు, అడ్డ దిడ్డమైనవారు ఎందరు లేరు కొడుకులు? కొడుకులంటే రాముడు, నువ్వు, ఇద్దరే! ఇంకా చెప్పాలంటే, చర్చ చేస్తే, కొద్దిగా నీవే ఎక్కువ రాముడికన్నా కూడా! అక్కడ

రాముడికి కష్టాలలో తోడు ఉన్నారు, తమ్ముడు, భార్య! ఇక్కడ నీకెవరు తోడుగా ఉన్నారు ?

మాట యొసంగినన్ మరలు మాటయు నుండమి, సంగరంబునన్
మోటిన చాలమిన్ తుద కమోఘ మహోగ్ర కుఠార రాముడున్,
చేటు విపత్పరంపరల చెక్కు చెదర్చని నిగ్రహంబులన్,
మాటలు వేయునేటికి? సమానుడు నీకగు రాముడొక్కడే! (ఉ)

మాట యిస్తే ఆడినమాట తప్పక పోవడంలో, యుద్ధంలోకి దిగితే అమోఘమైన ఉగ్రుడైన వీరుడు ఆ పరశురాముడు కూడా సరి రాకపోవడంలో, నష్టాలు, కష్టాల పరంపరలు వచ్చినా చెక్కు చెదరకుండా నిగ్రహించుకోవడంలోనూ, వేయి మాటలెందుకు, నీకు సమానుడైనవాడు ఆ శ్రీరామచంద్రుడు ఒక్కడే!

గ్రీష్మపు మింటి భానుదవు, క్రీడియు కృష్ణుడు జంటకల్వ లా
యూష్మము నోర్వలేక, తల యొంచిన గాంచిన ధర్మజుండు 'నీ
శుష్మము తాళలేము, దయ జూడుము తాత!' యటన్న, నీవుగా
భీష్మ పితామహా! ధనువు వీడుట, యోడుట నీకు యున్నదే? (ఉ)

గ్రీష్మ భానుడివి నీవైతే, కృష్ణార్జునులనే జంట కలువలు ఆ వేడిమికి తాళలేక, నీకు తలవంచితే, నీ వేడిమిని, నీ శక్తిని తట్టుకోలేము, తాతా! మమ్ములను కనికరింపుము అని ధర్మరాజు వేడుకుంటే, నీకు నీవై ధనుస్సును విడిచిపెట్టావు, యుద్ధం చేయడం మానేశావు కానీ, భీష్మపితామహా! నీకు ఓడిపోవడం అనేది ఉన్నదా?

ధారుణి ధర్మమున్ నిలుప దానమొసంగితి వాయువున్ భళా!
నీ ఋణ మెట్టు లీగ నగు? నీ వనపత్యుడవై గతించుటల్
కారణమయ్యె, నీకు నిడగా నగు తర్పణ లర్పణల్, విధుల్
బారులు తీరిరయ్యె! నిను భారత జాతిపితా యనందు నే! (ఉ)

ధరణిలో ధర్మమును నిలపడంకోసం, ధార్మికులైన పాండవులు విజయులు కావడంకోసం నీ ఆయుష్షును ధారపోశావు భళీ! నీ ఋణం ఎలా తీర్చుకోగలము? నీవు సంతానం లేకుండా మరణించిన కారణంగా నీకు తర్పణలు యివ్వాలని ధర్మశాసనం ప్రకారం ఆ విధిని నిర్వర్తించడంకోసం, నీకు తర్పణలు యివ్వడంకోసం జనులు బారులు తీరారయ్యా!నీవే భారతజాతిపితవు అంటాను నేను!

వ.

కురుక్షేత్రము, బదరీ, ప్రయాగల సందర్శనము చేసుకున్న పిదప భర్త కోరికమేరకు నూతన దంపతుల శృంగార విహారయాత్ర రసమయముగా, ప్రణయ సరసమయముగా, మధుమాస సమయముగా జరిగినది. అనంతరము ఒకానొక దినమున మామయైన 'దొండాజీ' కోడలిని చేరబిలిచి, వాత్సల్య పూర్వకముగాయిట్లడిగినాడు. ' అమ్మా! బాల్యమునుండి నాకు రెండు కోరికలున్నవి యంటివి, అవి చెల్లించితిని. ముచ్చటగా మూడవకోరిక ఏమైనా కలదా? చిరునవ్వులు చిందుతూ సావిత్రీబాయి పలికినది. 'నాతికి రెండు కోరికలు మాత్రమే కోరెడి అవకాశము అని కదా భారతీయుల సంప్రదాయము మామగారూ, నాకింక ఏమి కోరుటకు కొరత యున్నది కనుక? లోకమున స్త్రీలకు పుట్టినింట మాత్రమే లభించు పితృవాత్సల్యము నాకు మెట్టినింటనూ లభించినది. కోరిన మెట్టినిల్లు స్వాగతించినది. కోరిన శూరుడు, సుగుణవంతుడు పెనిమిటియైనాడు'. దొండాజీ మురిపెముగా కోడలిని ప్రశంసించి, 'నీవన్నది సమంజసమే, కనుక, నీవు కోరుకొనకుండనే ముచ్చటగా మూడవ బహుమతి నీకు లభించుటయూ సంప్రదాయమే, కనుక, అమ్మా! భారతదేశమును యింతగా ఆరాధించిన నీకుయిచ్చుటి ప్రధానమైన భాషలను నేర్చుకొనవలయునన్న వాంఛయున్న సంగతి నాకు తెలియును. ఒక మహానుభావుడైన పండితుడు నీకు గురువై సంస్కృతము, తెలుగు, తమిళము, మళయాళము, కన్నడము, హిందీ, పంజాబీ, గుజరాతీ, మరాఠీ భాషలు నేర్పుటకు నియమింపబడినాడు తల్లీ! నీ భర్త సైన్యాధికారిగా దేశమునందలి వివిధ ప్రాంతములకు వెళ్లి నివసించుటయూ తప్పనిది, కనుక ఆయా ప్రాంతముల భాషలు నేర్చియుండుట నీకు సౌకర్యముగనూ

యుండును' అనినాడు. ఆనందబాష్పములు జాలువారుచుండగా కృతజ్ఞతాపూర్వకముగ మామ పాదములంటి నమస్కరించినది సావిత్రీబాయి. దామోదరశర్మయను ఆంధ్ర పండితుడు, బహుభాషా కోవిదుడు, మాన్యుడు ఆమెకు గురువై ప్రధాన భారతీయ భాషలను ఆమెకు బోధింపసాగినాడు. ఆమె బాల్యమునుండియు సంస్కృత భాషలోని భారతీయ వేద, యితిహాస, పురాణ వాఙ్మయములను వలపుతో పఠించినది కనుక గురుముఖతః సంప్రదాయబద్ధముగ తొలుత సంస్కృతమును అభ్యసింప మొదలిడినంత మూడు మాసములలో దేవనాగరియందు వ్రాయుట, పఠించుట, తన గురునితో సంస్కృతమున సంభాషించుట జరిపినది. దామోదరశర్మ ఆశ్చర్య పులకిత గాత్రుడైనాడు.

అమ్మా! నీవీ వీటను
ముమ్మాటికి పూర్వ జన్మ మొందితివనుచున్,
చెమ్మలు దేరిన కన్నుల
సమ్మదమున సంస్తుతించి, సాధ్విని యిటులన్ (కం)

అమ్మా! ముమ్మాటికీ ఇది నిజము! నీవు ఈ భారత భూమిమీద పూర్వజన్మను పొందావు. అందుకే నీకు ఆ పూర్వజన్మ అనుబంధం కారణంగా ఈ దేశము మీద, ఈ భాషలమీద యింత నిష్ఠ ప్రేమ, ఉన్నాయి తల్లీ అని సంతోషంతో చెమ్మగిల్లిన కనులతో ఆమెను పొగిడి యిలా అన్నాడు.

కలలివి జీవనంబు లిల కల్గుటలున్ కొనసాగు స్వప్నముల్
మలయజ శీతలంబులగు మారుత మిచ్చట కొచ్చి సోకుటల్
అలలివి కాల సాగరము నారడి తీరము జేర పోరుటల్
యిలనగు గాథ లన్నియును ఎన్నడొ ఎవ్వడొ చెప్ప సాగెడిన్ (చం)

ఈ జీవితములు స్వప్నములలాంటివి. కొనసాగే ఆ స్వప్నాలే ఈ భూమిమీద మాటిమాటికీ జన్మించడం. మలయపర్వతం మీది చల్లని

గాలులు, మలయమారుతములు సుదూరం ప్రయాణం చేసి సోకడంలాగా! కాలము అనే సాగరంలోని అలలు ఈ జన్మలు, తీరాన్ని చేరడానికి పోరాటం యిది. భూమి మీదిజన్మల తీరు ఎన్నడో, ఎవ్వడో చెప్పడం మొదలుబెట్టి, అలా కొనసాగే గాథలవంటివి.

కథ మిగిలిన, మిగులు కథనంబు కథకుడు
చెప్ప దొడగు భంగి చెలగి నడచు,
జీవనంబు లిలను చిత్రంపు గాథలు,
శేష మున్న వర కశేష మగును! (కం)

కథ మిగిలిపోతే కథను చెప్పేవాడు మరలా కొనసాగించి చెప్పినట్లుగా నడిచే వింత గాథలు ఈ భూమిమీద జన్మించడం అనే గాథలు! శేష కథ ఉన్నంతవరకూ అశేషంగానే ఉండే కథలు యివి.

కావున, పూర్వ జన్మముది కార్య మపూర్వము పూర్ణమవ్వగన్,
నీ విట కాలుమోపితివి, నీ కగు పూర్ణ శతంబు వర్షముల్!
గావుత లెల్ల కామనలు, కార్య జయంబులు, ధుర్య కార్యముల్!
దీవన లందుమమ్మరో! సుధీనుత మాన్యత, ధన్య జన్మమౌ! (ఉ)

కావున, పూర్వజన్మములో చేయకుండా మిగిలిపోయిన ఒక అపూర్వమైన కార్యము పూర్తిచేయడంకోసం నువ్వు ఇక్కడ కాలుమోపావు. నీకు పూర్ణ శతవర్షముల ఆయుష్షు కలుగుగాక! నీ కోరికలన్నీ ఫలించునుగాక! సకలకార్యముల విజయము లభించుగాక! గొప్ప కార్యములు జరుగుగాక! నా దీవనలను అందుకో తల్లీ!సుధీరులచే నుతింపబడే గౌరవముతో నీజన్మ ధన్యమవునుగాక!

పూర్వపుణ్యఫలము పొందు గంటిని తల్లి!
శిష్యురాల! గురుని జేసినావు!
గురుడెవండు? నీకు గురుడైన గురుడు, పో!
శిష్యురాల! శిష్య శ్రేష్ఠవీవు! **(ఆ.వె.)**

నా పూర్వపుణ్య ఫలితాన్ని పొందాను తల్లీ! శిష్యురాలా! నన్ను నీకు గురువును చేశావు! నన్ను గొప్పవాడిని చేశావు. గురువు ఎవరయ్యా అంటే నీకు గురువైనవాడే గురువు! శిష్యురాలా! శిష్యులలో శ్రేష్ఠురాలివి నువ్వు!

అనుచు శిష్యురాలి నాశీస్సుల బొగిడి,
సంప్రదాయ విధిని చదువ జేసె
చదువ, వ్రాయ, పలుక ఛందబద్ధంబుగా
నేర్పె నపుడు గురుడు, నేర్చె నామె! **(ఆ.వె.)**

ఇలా పలుకుతూ శిష్యురాలిని ఆశీస్సులతో పొగిడి, సంప్రదాయబద్ధంగా ఆమెకు చదువు నేర్పాడు. చందోబద్ధంగా చదవడం, వ్రాయడం, పలుకడం నేర్పాడు ఆమెకు ఆ గురువు. ఆమె అలానే నేర్చుకున్నది.

సకల ములకు జనని సంస్కృతంబు నపుడు
చదువ జేసె గురుడు, సాధ్వి నేర్చె,
మగని మాతృభాష, మనసౌ మరాఠీని,
తీపి తీపి చవుల తెలుగునపుడు. **(ఆ.వె.)**

సమస్త భాషలకూ తల్లి యైన సంస్కృతమును చదివించాడు. ఆ సాధ్వి తన మగడి మాతృభాషయైన మరాఠీని, తీయ తీయనిరుచుల తెలుగును నేర్చుకున్నది.

తమిళము, కన్నడ, మలయా
ళములను, హిందీయును, గుజరాతును, పంజా
బి మరియు నుర్దూ, పార్శీ
తమకము గొని నేర్చె సుదతి, తడయక, వడిగన్! (కం)

తమిళము, కన్నడ, మలయాళము, హిందీ, గుజరాతి, పంజాబీ, ఉర్దూ, పార్శీ మొదలైన భాషలను తమకముతో నేర్చుకున్నది ఆమె ఆలస్యము లేకుండా, వేగముగా!

వ.

ఇట్లు తన పూర్వపుణ్య వశమున శిష్యురాలైన సావిత్రీబాయికి పుత్రికావాత్సల్యమున ఆ దామోదర పండితుడు పూర్వోక్తములైన భారతీయ భాషలను బోధించినాడు. తన మగని మాతృభాషయైన మరాఠీని, తీయ తెన్గుభాషనూ విశేషమైన ప్రేమతో అభ్యసించినది సావిత్రీబాయి. ఒక సంవత్సర కాలమున అన్ని భాషలలోనూ వ్రాయుట, చదువుట, మాట్లాడుటలయందు ప్రావీణ్యత సాధించినది. మగని మాతృభాషయందు, తన గురువైన దామోదరుని మాతృభాషయందుకవిత్వము చెప్పుట యారంభించినది. సైన్యాధికారుల విందు సమావేశములందు, సైనికుల ఉత్సవములందు భారతీయుల పురాణేతిహాసముల గురించియు, సాహిత్యము గురించియు, లలితకళలగురించియు సోదాహరణముగా, సాధికారముగా ఆమె చేసెడి ప్రసంగములు, ఆమె చిత్రించిన చిత్తరువులు, కళాఖండములు ప్రధాన ఆకర్షణలుగానుండెను. సేవా శిబిరములు, వైజ్ఞానిక శిబిరములు, కళామహోత్సవములు, ఒకటి యని కాక, సమస్త విద్యలకూ నిలయమైన సరస్వతీమూర్తివలె యామె భాసించుచుండెను. ఒక్కొకపరి ఆహూతుల అభిలాషమేరకు వివిధ సంప్రదాయముల భారతీయ శాస్త్రీయ నృత్యములను ప్రదర్శించుచుండెడిది. ఒక్కొకపరి శాస్త్రీయసంగీత గానవాహినులయందు ముంచెత్తుచుండెడిది. ఆంగ్లేయ, భారతీయ అధికారులు, సామాన్యులు అందరూ ఆమెను నడయాడెడి విజ్ఞానకోశముగా వ్యవహరించుచుండిరి. భారతదేశమున స్వతంత్ర సంగ్రామము ఉద్ధృతమైన

దినములలో ఆమె యంతరాత్మ సామాన్య భారతీయుల వ్యథలపట్ల, విశేషించి స్త్రీల, బాలికల దుస్థితి పట్ల సంక్షుభితమైనది. సామాజికసేవా మార్గములద్వారా స్త్రీల, బాలికలఉన్నతి కొరకు ఆమె తన వంతు కృషిని చేయుచుండెను. భర్త వివిధ పదోన్నతుల వలన స్వదేశములోని ట్రావెంకూరు, కర్ణాటకలనుండి కాశ్మీరము వరకు, ఢిల్లీ నుండి రాజస్థాను వరకు తిరుగుచున్న సమయములందు ఆమె భర్తను నీడయై అనుసరించినది. భారతమునంతయూఈరీతిని ఆమె దర్శించినది. ఆంగ్లేయుల పాలనలోనున్నపుడు ఈజిప్ట్, సిరియా, లెబనాన్, సింగపూర్, జపాన్, బర్మా మున్నగుదేశములకు భర్త అధికార నిర్వహణకు వెళ్ళినపుడు ఆమె మామగారికి సేవజేయుచూ కుటుంబ బాధ్యతను జూచుకొనుచుండెను. ఆదర్శప్రేమైక దాంపత్య జీవనము ప్రసాదించిన మాతృత్వభాగ్యముగా కల్గిన తొలి సంతానము, మగశిశువునకు 'అశోకు'దని ఆమెపేరిడినది. ఆ శిశువు అశోకుడు ఆమెను శోకమున ముంచి శైశవముననే మృతి చెందినాడు. కొంతకాలము ఆమె యా శోకమునమునిగిపోయినది. కాలక్రమమున యిరువురు కుమార్తెలకు, నడుమన నొక కుమారునకు ఆమె తల్లియైనది. యింతలో భారతదేశము స్వతంత్రము బడయుట నిశ్చయమైనది. అంతదనుక విదేశీయుల పాలనలోని సైనికులకున్న పురస్కారముల, పతకముల స్థానమున స్వతంత్ర భారత వీర సైనికులకు పురస్కారములను, పతకములను రూపొందించవలసిన అవసరమేర్పడినది. ఆనాటి సైనికవిషయముల అధికారి హీరాలాల్ అటల్ మహాశయుడు ఒక శుభదినమున ఆమె గృహమునకు యేతెంచినాడు. ఆ సమయమున ఆమె భర్త ఢిల్లీ ప్రాంతమునకు ముఖ్య సైన్యాధికారిగా బాధ్యతలను నిర్వర్తించుచుండెను. అతని యధికారము పశ్చిమమున రాజస్థాను-పాకిస్తాను సరిహద్దువరకు, తూరుపున మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వరకు నుండెను. అట్టి సమయమున ప్రపంచ ప్రసిద్ధమగు సర్కస్ కంపెనీ యొకటి ఢిల్లీయందు తమ సర్కస్ ప్రదర్శనకొరకు విచ్చేసినది. ఆమె భర్త ముఖ్య అతిథిగా ఆ సర్కస్ ప్రదర్శన ప్రారంభమునకు ఆహ్వానింపబడినాడు. ఆమె తన పిల్లలకు 'సర్కసు ప్రదర్శన' చూపించుటకు వారిని వెంటబెట్టుకుని వెళ్ళినది. హీరాలాల్ అటల్ మహాశయుడు ఆమెను చూడగోరి, తానునూ

ఆ ప్రదర్శన కేగినాడు.

రింగున మాస్టరు క్రికెటు నాడించగా,
నచట నేన్గు క్రికెటు నాడెనపుడు
బ్యాటు తొండము బట్టె, బౌలరు యొక కోతి
యయ్యె, నంపైరయ్యె హాస్యగాడు
పిల్లి, యుడుత లట ఫీల్డర్లు స్కోరర్లు
కాకు లయిన నయ్యె కాకి లెక్క
చిలుకల వ్యాఖ్యాన చిత్రంబు లయ్యెను,
పరుగెత్తి యంపైరు పట్టె బంతి! (సీ)

తొండ మెత్తి ఏన్గు దొరలించి కొట్టగా,
వెక్కి ఏడ్చి, కోతి వెక్కిరింప,
హాస్యగాడు వెళ్లి యా రింగు మాస్టరు
నెత్తి మీద గొట్టి నెట్టి వేసె! (ఆ.వె.)

'సర్కస్ రింగ్'నందు రింగు మాస్టర్ జంతువులతో క్రికెట్ ఆట ఆడించడం మొదలుబెట్టాడు ప్రేక్షకుల వినోదం కోసము. ఒక ఏనుగు తొండముతో బాట్ పట్టుకుని ఆడడం మొదలెట్టింది.

ఒక కోతి బౌలర్ గా అవతారమెత్తింది. హాస్యగాడు ఎంపైర్ అయ్యాడు. పిల్లి, ఉడుత ఫీల్డర్లు అయినాయి. కాకులు స్కోరర్లు అయినాయి, యిక కాకిలెక్క అయ్యింది! చిలుకలు వ్యాఖ్యాతలుగా చిత్రంగా మొదలెట్టాయి. ఎంపైర్ గా ఉన్న హాస్యగాడు తానే పరుగెత్తి వెళ్లి బంతిని పట్టుకున్నాడు. దానితో ఏనుగు ఆ ఎంపైరును తన తొండముతో కొట్టింది. హాస్యగాడు వెక్కి వెక్కి ఏడ్చాడు. వాడిని కోతి వెక్కిరించింది. హాస్యగాడు వెళ్లి ఆ రింగు మాస్టారు నెత్తిమీద కొట్టి అతడిని నెట్టివేశాడు.

ముక్కాలి పీటపై ముదమున మదగజం
బెక్కె, దానిని సింహ మెక్కె నపుడు
సింహంబు పైననో జింకపిల్లయు నెక్కె,
జింక నెక్కిన దొక్క సీమకుక్క
శునకముపై పిల్లి సుఖముగ కూర్చుండె,
పిల్లిపైన నొకటి పిల్ల ఎలుక
హాస్యగాడం దించె అరటి పండు నొకటి,
అందుకున్న గజము అతని జరిచె (సీ)
హాస్యగాడు అడలి ఆరునొకటి రాగ
మాలపించెనపుడు అందగాడు,
అంత జారి పడెను అరటి తొక్కను తొక్కి,
పిల్ల లంత నవ్వ పిక్కటిల్ల! (ఆ.వె.)

తరువాత ఒక ముక్కాలిపీటమీద ఒక మదపుటేనుగు ఎక్కింది సంతోషంగా. ఏనుగుమీద ఒక సింహం ఎక్కి కూర్చుంది. సింహం మీద ఒక జింకపిల్ల ఎక్కింది. ఆ జింకమీద ఒక సీమకుక్క ఎక్కింది. ఆ కుక్కమీద ఒక పిల్లి వచ్చి సుఖంగా కూర్చుంది. పిల్లిమీద ఒక ఎలుక ఎక్కి కూర్చుంది! హాస్యగాడు ఏనుగుకు ఒక అరటిపండును అందించాడు. అరటిపండును అందుకుని ఏనుగు హాస్యగాడిని తొండంతో ఒక్క చరుపు చరిచింది. హాస్యగాడు బాధను నటిస్తూ ఆరున్నొక్క రాగం అందుకున్నాడు. అంతలోనే అరటిపండు తొక్కను తొక్కి జారి పడ్డాడు. వినోదంగా చూస్తున్న పిల్లలందరూ పిక్కటిల్లేలా నవ్వారు.

మల్లెల తోటలు వేలుగ
తెల్లగ విరిసినవొ యనగ దేలెడు నగవుల్
ఘొల్లను పిల్లల జూసిన,
తల్లిని తనమృత తనయుని తలపులు కలచెన్! (కం)

వేల మల్లెతోటలు ఒక్కసారే తెల్లగా విరిసినట్లుగా ఘొల్లున నవ్వులలో తేలుతున్న పిల్లలను చూసిన ఆ తల్లిని, సావిత్రీబాయిని చనిపోయిన ఆమె కుమారుడి తలపులు గుర్తుకువచ్చి కలచివేశాయి!

రేగెడి పాతగాయములు రెచ్చిన సాగర వీచులై గొనన్,
ఊగెడి చిన్న తెప్పయన నొప్పుకళాత్మకమైన మానసం
బాగతి తెల్లకాగితము బాగుయు నోగుయు పారదర్శకం
బే గద! బీజమంత దొక పెల్లు వటంబుగ పెంచి, మించగన్! (ఉ)

రేగే పాతగాయాలు రెచ్చిపోయిన వీచికలలాగా తాకితే ఆ అలల తాకిడికి ఊగే చిన్న తెప్ప లాంటిది కళాత్మకమైన, కళాకారుడి మనసు. కళాకారుడి మనసు తెల్లకాగితం వంటిది. బాగు ఓగు, మంచి చెడ్డ పారదర్శకం లాగా ఉండే ఆ మనసులోనుండి పైకే కనిపిస్తాయి. కళాకారుడు భావాలను దాచుకోలేడు. చిన్న విత్తనం లాంటిదాన్ని కూడా పెద్ద వటవృక్షంలాగా పెంచి పెద్దజేస్తాడు. కళాకారిణి, సున్నిత మనస్కురాలైన సావిత్రీబాయి తనమనసులో చెలరేగిన బాధను దాచుకోలేకపోయింది.

ఇంతన ఫలములగొని యొక
దంతికమున నేదొ నుడువ డాసిన, యవిగొని,
నంత, విదూషకు డతడిని
యంతట తరముచు జొరబడె యవనిక మరుగున్ (కం)

యింతలో యేవో పండ్లు తీసుకుని ఒకడు హాస్యగాడిని సమీపించాడు. హాస్యగాడితో యేదో చెప్పాడు. హాస్యగాడు అతడు తెచ్చిన పండ్లను అందుకుని, వాడిని తరుముకుంటూ తెరచాటుకు వెళ్ళిపోయాడు.

విసరెను నగవులు యలలటు,
ఉసురనుచును నతివ శిశుని యూహలు కలయన్,
నిసువుల రక్షకభటులకు
నొసగెను, తను బయలు వెడలె నూరట కొరకై (కం)

మరలా పిల్లల నవ్వులు అలలలాగా విసిరాయి. చనిపోయిన తన కుమారుడి స్మృతులతో బాధపడుతూ ఉసూరుమంటూ, తన పిల్లలను తన రక్షకభటులకు అప్పజెప్పి, ఆమె బయటకు వెళ్ళింది కొద్దిగా ఊరట పొందుదాము, తేలికపడుదాము అనుకుని.

ఓరగ జారిన తెరలో
నారసి హాసికు నితరుల నడుమన వగవన్,
జేరిక నడుగగ తెలిసెను,
సారమతని శిశుమృతి యతి సారము వశమున్! (కం)

బయటకు వెళ్తుండగా ఓరగా జారిన తెరచాటున హాస్యగాడు యితరుల మధ్యన రోదిస్తూ కనిపించాడు. దగ్గరకు వెళ్లి సంగతి ఏమిటో అడిగిన ఆమెకు తెలిసింది, ఆ హాస్యగాడి బిడ్డ అతిసారమువలన చనిపోయిన సంగతి.

గుండెవీణ తీగ గుంజి తెంపినటుల,
శ్రుతి సుధల విష మప శ్రుతియు నటుల
హాయని విలపించు హాస్యగాని కనియె,
చెలగు వగల పగటి చీకటట్లు! (ఆ.వె.)

గుండె అనే వీణతీగను బలవంతంగా లాగి తెంపినట్లు, అమృతంలాంటి చక్కని శ్రుతిలో విషములాగా అపశ్రుతి పలికినట్లుగా, పగటిపూట కమ్మిన చీకటిలాగా, మిక్కిలి బాధతో హా యని విలపిస్తున్న హాస్యగాడిని చూసింది. అందరినీ నవ్వించేవాడు తానూ ఏడుస్తూ కనిపించాడు!

వ. సావిత్రీబాయి లోనకేగి హాస్యగాడిని ఊరడించుటకు ప్రయత్నము జేయుచూ యిట్లు పలికినది.

సింహపు నోటిలో తలయు, చిమ్మెడి యగ్నుల గోళమందు నీ
బృంహిత మైన మేను జన బృందము నవ్వగ, దేహ, మాత్మ గా
లం హసనంబులన్ వగలడంచెడి నీవలె కొందరయ్య! జూ
డం హసియించు లోక, మొక డందగ నుండడు నిండుకన్నులన్! (ఉ)

సింహముయొక్క నోటిలో నీ తలను పెట్టి, అగ్నిజ్వాలలను చిమ్ముతున్న గోళములో నీ శరీరమును దూర్చి, నీ హాస్యముతో ప్రజలను నవ్విస్తూ, నీ శరీరము, నీ యాత్మ కాలిపోతున్నా నవ్వులతో బాధలను అణిచివేసే నీలాంటివారు కొందరేనయ్యా! చూసి నవ్వేవారే కానీ ఈ ప్రపంచములో ఒక్కడూ చెమ్మ నిండినకనులతో అండగా ఉండడు!

నువ్విట హాయిగా కడు వినూత్నములౌ పలు అద్భుతంబులన్
జివ్వున గుండెలాగు నవి చిక్కుల చింతల నొక్కి, పొక్కకన్
నవ్వుచు జేయ జూచెదరు, నాటక మింతయు చూడ చోద్యమౌ,
దవ్వుల పాంథుడా! బతుకు దారుల ఒంటరి వీవు సోదరా! (ఉ)

నువ్విక్కడ హాయిగా నీ గుండె జివ్వున లాగే చిక్కులను, చింతలను బయటపడకుండా లోపలే దాచుకుని, ఎంతో వింతలైన ఎన్నో అద్భుతాలను నవ్వుతూ చేస్తుంటే చూడాలని కోరుకుంటారు. యిదంతా చూడడానికి చోద్యమైన ఒక వింత నాటకము. దూరప్రయాణము చేసే ఓ బాటసారీ! సోదరా! బ్రతుకుదారులలో నువ్వు ఒంటరివాడివి.

లోకము హాస్యమోహిత విలోకనముల్ ప్రసరించు ప్రేక్షకా
నీకము నిండినట్టి, దిది నిష్ఠుర కర్కశ ఘోర నిర్దయా
భీకరమయ్యె! జాలియు లభించని జీవుల దర్శనాస్థలం
బే కద! హాస్యగాడి విట! భే షనిపింతువు లోన కుందుచున్ (ఉ)

ఈ లోకము హాస్యముతో సమ్మోహనము చెందిన చూపులను చూసే ప్రేక్షకులతో నిండినది. యిది ఒక నిష్ఠురమైన, కర్కశమైన, ఘోరమైన

నిర్దయతో నిండినది, భయంకరమైనదయ్యా! ఈ ప్రపంచము జాలికూడా లభించని జీవుల దర్శనాస్థలమే కదా! (ప్రపంచమే ఒక సర్కస్ అని) నువ్వొక హాస్యగాడివి యిక్కడ, లోలోపల బాధపడుతూనే భేష్ అనిపించుకుంటావు!

జీవన దీప మారెడిది, చిన్నది, పాకెడి నీడయౌను ఈ
జీవులు నాటకంబులను చిందర వందర లందు కుందుచున్,
పోవుదు రాడి, జారు తెర పోవ కనన్ వినరావు జాడలున్
జీవుల గాథ మూఢుడు వచించిన దౌనిల మూఢ కోటికై,
జూవెడి ఘోర, ముత్సుకవిజుష్టము, శూన్యరసావశిష్టమున్! (ఉ)

జీవితము అనే దీపము ఆరిపోయేది, చిన్నది, పాకే నీడవంటిది. ఈ జీవులు నాటకములలో చిందరవందరగా బాధలుపడుతూ నటించి వెళ్ళిపోతారు,తెర జారుతుంది, పోయినతర్వాత జాడలు కనబడవు, వినబడవు. జీవుల గాథ మూర్ఖుడు చెప్పిన కథ, మూర్ఖులకోసం చెప్పిన కథ. ఘోరమైన ఉత్సుకతతో కూడినది, చివరకు రసశూన్యమైనదిగా కనిపిస్తుంది!

ము ల్లది గుచ్చుకొన్న నతి మోపగు బాధనెరుంగు, మున్న నా
ము ల్లది గుచ్చుకున్ననగు మోపగు బాధను మోసినాడె పో!
కల్లలు గాదు, నాకు నొక కంటకమున్నది గుండెలోన! నా
యల్లరి చిన్నికూన ఎర యయ్యె నకాలపు మృత్యు కేళికిన్,
చెల్లరె! శాంతి నొందుమిక, చెప్పుట తేలిక యంచెరుంగుదున్! (ఉ)

ముల్లుగుచ్చుకున్నపుడు కలిగే తీవ్రమైనబాధను గతంలో తనకు ముల్లు గుచ్చుకున్నపుడు కలిగిన తీవ్రమైనబాధను మోసినవాడే తెలుసుకోగలుగుతాడు. అబద్ధం కాదు, నా గుండెలో కూడా ఒక ముల్లు గుచ్చుకున్నది! నా యల్లరి చిన్ని కూన అకాలపు మృత్యుకేళికి ఎర కావడం అనేదే ఆ ముల్లు. అయ్యయ్యో! యిక శాంతిని పొందుమయ్యా! దుఃఖాన్ని శాంతింపజేసుకో! ఇలా చెప్పడం తేలిక, చేయడం కష్టం అని నాకు తెలుసు!

అపుడపు డగు చిలిపి పలుకు,
నపు డపు డిట పిడికె డెడద నలమును తిమిరం,
బపు డపు డొక చిరుత నగవు,
లెపుడగు నిటు లనుదినములు, లేటివి వ్రణముల్! (కం)

అపుడపుడు నాబిడ్డ పలికినట్లే అనిపిస్తుంది! అపుడపుడు ఈ పిడికెడు గుండెను చీకటి అలుముకుంటుంది. అపుడపుడు ఒక చిరునవ్వు నవ్వినట్లు అనిపిస్తుంది. ఎప్పుడూ యిలా అవుతూనే ఉంటుంది. గాయాలు యింకా పచ్చిగానే ఉన్నాయి!

లోకులు కాకు లెంద రిట, లోపల బాకులు నిండియుండు పూ
రేకులు, పూతరేకులును, రేచులు లోపల, పైకి గోవులున్
నీకిది ఎన్నడో ఋణము నీవుగ చేసిన, దీవె తీర్చనౌ
బాకిర జీవనం బిచట! పార దెగేయుట, తీరు తీర్చుటన్! (ఉ)

కాకులలాంటి లోకులు ఎందరో లోపల బాకులు నిండి ఉంటాయి, పైకి మాత్రం పూల రేకులలా, పూతరేకులలా ఉంటారు. లోపల రేచుకుక్కల్లా ఉంటారు, పైకిమాత్రం గోవుల్లా ఉంటారు. జీవితము నువ్వు ఎన్నడో చేసిన అప్పు, నువ్వే తీర్చాల్సిన బాకీ! ఎగ్గొట్టడం కుదరదు. తీర్చడం వల్లనే తీరుతుంది!

వ.

యిట్లు కొంతతడవు హాస్యగానికి ఊరడింపు పలుకులు పలికి భారమైన హృదయముతో ఆమె బయటకు నడిచినది. అచ్చటి తోటలో ఊరటకొరకు తిరుగ నారంభించినది. ఆమె తన శిశువుయొక్క విషాద గాథను, హాస్యగాని విషాద గాథను మరల మరల తలచుకుని వేదనచెందినది. కొంతసేపటికి వేదన స్థానమున విరక్తి జనించి, వైరాగ్యము ఆవహించి మౌనముగా, గంభీరముగా ఆ తోటలోని ప్రకృతిని, అచ్చటి నానాజాతుల పూలతీవెలను, చిరువృక్షములను కలయజూచుచూ ముందుకు సాగుచుండెను.ఆమె సర్కస్ గుడారములోనుండి బయటకు వచ్చినదాదిగా, హాస్యగాని కథ విని

యాతడిని ఓదార్చుట వరకూ అంతయు మౌనముగా గమనించుచున్న హీరాలాల్ అటల్ మహాశయుడు ఆమె వెనుకనే అనుసరించి వచ్చుచుండెను.

ప్రపంచమునందలి సమస్తములైన విచిత్ర పుష్పజాతులకు నెలవైన ఆ వనమున నడయాడుచున్న ఆమె పదములు ఒక చోట యాగినవి. 'గాజు సుమం'బను అక్షరములను జూచి యచ్చట ఆగిపోయెను. Diphylleia grayi - Skeleton Flower గాజు సుమంబు (అస్థిపంజర సుమంబు) అను చిత్రమైన జాతికి చెందిన పుష్పమది. చూచుటకు తరళములైన తెల్లని దళములతో శ్వేత ఛత్రమువలె నుండు ఆ పూవు నీటి బిందువులు సోకినంతనే గాజువారును. దళములు, కేసరములతో మొత్తముగా గాజువలె మారును. పారదర్శకముగా నగును. మరలా తడి యారినంతట పూవువలె మారును! ఆహా! విధాత కళా కౌశల్యమేమనవచ్చును! తూర్పు అమెరికా, తూర్పు ఆసియాలోని కొన్ని ప్రాంతములలో కనిపించు దానిని ప్రత్యేకమైన వాతావరణము కల్పించి గాజు తొట్టియందు పెంచుచున్న ఆ ఉద్యానవన పరిరక్షకుని యామె అభినందించినది. ఆమె ప్రస్తుత మానసికస్థితి ఆ పుష్పమును సైతము జాలిగా పరామర్శింపజేసినది. ఆమె యిట్లు దానిని ఉద్దేశించి పలుకసాగినది.

నీవలె నెందరో, చినికెనే నొకటేనియు చిన్కు జాలిగా,
జీవము గాజువారు, నెద చీలును, యస్థుల పంజరంబులై
పోవుదు, రెండిపోవు రసపూర్ణ పరీమళముల్ వ్యథాశ్రులన్
తీవెల నీవు, జీవితము తీరని బాకిగ వారు నీవలెన్! (ఉ)

నీలాగా ఎందరో, ఒక జాలి చినుకు చినికిందా జీవము గాజువారిపోతుంది. గుండె చీలిపోతుంది. అస్తిపంజరములై జీవరహితములై పోతారు. రసపూర్ణమైన పరిమళములు దుఃఖబాష్పాలతో గాజుగా మారి, ఎండిపోతాయి. తీగకు నీవు, తీరని జీవితమనే బాకీతో వారు ఒకేరకంగా వుండిపోతారు.

గాజుసుమంబ! చిత్రము లగాధము లవ్విధి రీతి చేతలున్
పూజకు నోచుకో వకట! పొందవు సుందర కేశబంధముల్
మోజుగ, లేనె లే దొకటి ముద్దయు ముచ్చట, యేటికైనదే
నీజననంబు? కాల మట నిండిన, నెండిన జూడరెవ్వరున్! (ఉ)

గాజుపుష్పమా! విధి రీతులు, చేతలు, చిత్రమైనవి, ఊహలకు అందని అగాధమైనవి! నువ్వు పూజకు నోచుకోవు. అందమైన కురుల బంధంలో మోజుగా ఉండడానికీ నోచుకోవు. ఒక ముద్దూ ముచ్చట లేదు! నీ జన్మ ఎందుకో కదా! కాలము తీరి నువ్వు రాలిపోయినా, ఎండిపోయినా చూసేవారు ఉండరు!

మాటలకే కదా నిను సుమంబని పిల్చుట, చాటుమాటుగా
మాటలు యస్థిపంజరసుమంబని, నీమది చీల్చి, కూల్చుటల్!
పోటులకాకముల్ జనులు, పుండ్లగు నీకని జాలిగొందురే?
ఓటమి, గెల్పులేని యొక యోగివి, రాగవిరాగ శూన్యవే! (ఉ)

మాటవరుసకే నిన్ను పూవు అనిపిలువడం. చాటుమాటుగా నిన్ను అస్థిపంజర సుమము అని పిలిచి, నీ మనసును చీల్చి కూల్చడం. జనులు పొడిచే కాకులవంటివారు. నీకు పుండ్లు పడుతాయని జాలి పడుతారా? ఓటమి, గెలుపు లేని ఒక యోగివి నువ్వు. రాగము, విరాగము లేనిదానివి.

నీ వనురాగలోకనకనీనిక లందిన, నందకుండినన్,
జీవవిపంచి రాగిణులు చిమ్మిన, శూన్యత నివ్వటిల్లినన్,
తీవెల జీవనంబు లొక తీరగు బాధ్యత నోర్చి తీర్చగన్,
పూవుగ, గాజుగా మనెదొ! పూజలు నీకగు పుణ్యపుష్పమా! (ఉ)

నువ్వు అనురాగము నిండిన చూపులకు నోచుకున్నా, నోచుకోకున్నా, జీవనవీణ రాగములను ఎగసినా, శూన్యత ఆవరించినా, తీగమీద జీవించడం ఒక బాధ్యతగా, ఆ బాధ్యతను తీర్చుకోడానికి ఓర్చుకుని, పూవుగా, గాజుగా బ్రతుకుతావేమో, నీకు పూజలు చేయాలే పుణ్యపుష్పమా!

దినముల నెవ్వడే విసరె? దెచ్చిన దెవ్వడు సంగ్రహంబులన్?
కనలెడు తేటులౌ మధుర గాథలురా యవి, మత్తచిత్తముల్
గొనినవి కాటు, నీ కిచట కూడి వియోగము నొంద, జీవనం
బనునది యాత్రరా! సుధల బాధల వీచుల యానపాత్రరా! (చం)

ఈ లోకంలో మనుగడకు రోజులను, ఆయువును ఎవడు విసిరివేశాడు? ఇక్కడికి కొని తెచ్చినవాడు ఎవడు? కసిగా ముసురుకునే తేనెటీగల లాంటి మధురమైన గాథలు అవి, బతుకులవి. మధురస్మృతుల గాథలు మత్తెక్కిన తేనెటీగల లాంటివి. నిన్ను కాటు వేశాయి. కలిసి, విడిపోవడానికి జీవితము అనేది ఒక యాత్ర. సుధల, బాధల కెరటాలపై సాగే పడవ!

జాలము వత్సరంబులది జాలిగ వీడదు, లేదు జాలమున్
లీలగ శీకరంబులగు రీతుల చిల్కెడు కాలవాహినుల్
ఏలన? లేవు లే విచట లేవుర కాలము, కాలవాహినుల్
కాలపు నిద్రలన్ సమ సగంబులు కాదుర జీవనం, బి దే
మాలిమి, మన్ననల్, క్రియలు, మౌనము లందున నొట్టిబండరా!(ఉ)

సంవత్సరాల వల జాలిపడి విడిపోదు. జాలమూ లేదు. కాలవాహినులు లీలగా తుంపరలై చినుకుతాయి. ఎందుకు? యిక్కడ కాలమూ లేదు, కాల వాహినులూ లేవు, అన్నీ జడములై పోయినాయి. కాలపు నిద్రలలో చెరిసగాలుగా సమానంగా సాగదు జీవనము. మంచి చెడ్డల, సుఖ దుఃఖాల హెచ్చుతగ్గులు ఉంటాయి. ఏ మాలిమిలో, మన్ననలో, క్రియలో, మౌనములో ఒక బండలాంటిది, బండబారిపోయింది!

జీవితమొక పాషాణము,
జీవితమొక చిరుకదలిక, జీవిక చిత్తిరా!
జీవిత మొంటరి బాణము!
జీవనగతి వడి నొకపరి, చిరుగతి నొకటన్ ! (కం)

జీవితము ఒక శిల. జీవితము ఒక చిరు కదలిక, అనంతమైన కాలంలో. జీవితము ఒక ఒంటరి బాణము, ఒంటరిగా తన లక్ష్యం వైపు తాను సాగుతుంది, సాగవలసిందే! జీవన పయనము ఒకోసారి వేగంగా, ఒకోసారి మందకొడిగా!

జీవనమొక పెను లోహము
జీవన లోహము ఎగయును జీవము రగులన్
జీవన లోహము దిగబడు
జీవుల యస్థికల యందు, జీవము చితియా! (కం)

జీవనము ఒక పెను లోహము, ఒక మండే యినుపగోళము, స్పందనలకు అతీతమైనది. అది జీవనము మండేలా ఎగసిపడుతుంది. జీవన లోహము జీవుల అస్థికలలో దిగబడుతుంది. జీవము చితియై పోతుంది,చితిమీదికి పోతుంది!

అంతవరకు దూరముగా, మౌనముగా ఆమెను అనుసరించుచూ వచ్చిన హీరాలాల్ అటల్ మహాశయుడు ఆమెను సమీపించి అనునయముగా యిట్లు సంభాషింపసాగెను.

ఎట్టులె యిట్టు లౌ ననుట? ఎంత వివేకివి! నీ వెరుంగ నే
గుట్టులు నున్న? విచ్చటల గూడుట గాదె ఋణానుబంధ? మే
పట్టున తీరునో ఋణము పద్దులు మాయుట కన్నుమూయుటల్,
గట్టుకు చేరు నే పడవ గంగన మున్గియొ గాక తేలియో! (ఉ)

యిలా అంటే ఎలా? నీవెంత వివేకము గలదానివి, నీకు తెలియని ఏ మర్మములు ఉన్నాయి యిక్కడ? ఇక్కడ, ఈ ప్రపంచములో కలయిక ఋణానుబంధము కదా! ఋణము ఎప్పుడు తీరితే అప్పుడు ఆ పద్దు మూసేయడమే కదా! అలాగే ఎప్పుడు ఋణము తీరితే అప్పుడు పరస్పరము విడిపోవడమే కదా! ఏ పడవ అయినా గట్టుకు చేరవలసినదే, గంగలో మునిగినా ఎక్కడో ఒడ్డుకు కొట్టుకువస్తుంది, లేదూ అంటే తేలి, నీటి మీద ప్రయాణము చేసి తీరానికి చేరుతుంది. ప్రతిజీవీ మృత్యువుకు ఆవలి తీరానికి చేరుకుంటుంది, అకస్మాత్తుగా మధ్యలో దుర్ఘటన వల్లనో, పూర్తిగా కాలం తీరడంవల్లనో!

ఆయువు తలిరాకు చివర
నూయల లూగెడి చినుకగు, నొక క్షణికమగున్!
బాయును మత్తుని వలె, వడి
తీయును పరుగును, నరుగును! తిరములె తనువుల్? (కం)

ఆయువు చిగురుటాకు చివరన ఊయలలూగే చినుకు వంటిది. ఒక క్షణకాలమే నిలిచి ఉండేది. తరువాత వీడిపోతుంది. పిచ్చివానిలా ఉరుకులు పరుగులు పెడుతూ వెళ్ళిపోతుంది, చెప్పా పెట్టకుండా! శరీరములు శాశ్వతములా?

ఊరట చెందుమమ్మ! అలలూచిన కొండయె? తెప్ప యూగెడిన్!
భారమొ, ఘోరమో జరిగె, బాధ్యత లున్నవి, భావి యున్న దే!
పారెడి జ్ఞానవాహినుల భారత వీరుల కంకితంబులౌ
దారుల జూడుమమ్మ! రహదారులొ, రప్పలొ, ఆగు టొప్పునే? (ఉ)

ఊరట చెందుము తల్లీ! అలలు ఊపితే తెప్ప కానీ, కొండ ఊగుతుందా? నువ్వు కొండలాంటి దానివి. జీవితములో ఎదురయ్యే ఒడిదుడుకులకు నువ్వు చలించకూడదు! భారమో, ఘోరమో జరిగిపోయింది. నీకు బాధ్యతలున్నాయి. భవిష్యత్తు ఉన్నది. ప్రవాహంలా పారే నీ జ్ఞానవాహినుల సాయంతో, భారత వీరులకు అంకితమయ్యే

మార్గములను చూడు తల్లీ. రహదారులో, రప్పలో ఏవి ఎదురైనా, ఆగటం కుదురుతుందా? సాగిపోవాల్సిందే గమ్యానికి! సుఖాలో, కష్టాలో, ఏవి సంభవించినా, బ్రతుకు పయనము ఆగిపోకూడదు. చివరిదాకా సాగాల్సిందే!

నీమము, నీ వివేచనయు, నీదు కళాభినివేశమున్ గనన్,
నామది నొక్క కోర్కె జననంబయె, సోదరి! విన్నవించెదన్
ధీమతులౌ సిపాయిలకు దివ్యముగా పతకంబు దిద్దుమా!
యే మన, నీవుగాక మరి ఎవ్వరు దక్షులు భారతీక్షమన్? (ఉ)

నీ నియమము, నీ వివేకము, నీ కళాభినివేశము చూసినతరువాత నామనసులో ఒక కోరిక కలిగింది సోదరీ! అదేమిటో చెబుతాను విను. ధీమతులైన సిపాయిలకు ఒక దివ్యమైన పతకమును రూపుదిద్దుము తల్లీ! ఏమి చెప్పను? నువ్వు గాక ఇందుకు దక్షులు ఎవరున్నారు భారత భూమిమీద?

రామాయణంబు పారాయణం బది నీకు,
భారతంబు నెరుగు భవ్యమతివి
అష్టాదశ పురాణ హాయిసుధల గొన్న
ఉపనిషత్తులెరుగు ఉవిదవీవు
భారతీయ కళలు, భారతీ ధర్మంబు,
అరచేత నుసిరిగా నరయ నీకు
సంగీత సాహిత్య సంగమం బగునీకు
సాటి ఎవరిలను సారమరయ? (సీ)

చిత్తశుద్ధియందు, చిత్రలేఖనమందు,
నృత్య, గాన కళల, సత్య మందు,
శారదావతార సారంబ! పతకంబు
తీర్చి, సైనికులకు దిద్దుమమ్మ! (ఆ.వె.)

రామాయణము నీకు పారాయణము. భారత యితిహాసమును తెలుసుకున్న గొప్ప మేధస్సు కలదానివి. హాయి యైన అష్టాదశపురాణముల సుధలను అందుకున్న దానివి. ఉపనిషత్తులను తెలుసుకున్న స్త్రీవి. భారతీయ కళలు, భారతీయ ధర్మము నీకు అరచేతిలో ఉసిరికాయవంటివి. సంగీత సాహిత్యాల సంగమము ఐన నీకు, సారమును తెలుసుకోవడంలో ఈ యిలలో సాటి ఎవరు? చిత్తశుద్ధిలో, చిత్రలేఖనంలో, నృత్య, గాన కళలలో, నిజము చెబుతున్నాను, సరస్వతీ అవతార సారమైన తల్లీ, ఒక పతకాన్ని రూపు దిద్ది సైనికులకు అందించుమమ్మా!

అనిన, నిమేషమాత్రమున యంగన గంగలు పొంగు కన్నులన్
తన రగు చెంగు నద్దుకుని, తారల తళ్కుల కుల్కు చిల్కుచున్,
వనగతమైన కౌముదులు, వాన లగాధ పయోధి వీధులన్
అనినటుగాక, ఈశ్వరుని యాజ్ఞగ జూసెద నట్లె చేసెదన్ (చం)

అనగా, ఒక నిముషం తరువాత ఆమె గంగలు పొంగుతున్న తన కన్నులను, మేలైన తన చీరచెంగుతో అద్దుకుని, తడితో కనుగుడ్లు మెరుస్తుండగా, అడవిన గాచిన వెన్నెలలాగా, అగాధమైన సముద్రములో కురిసినవానలాగా మీరు చెప్పిన నా ప్రతిభ కాకుండా, ఈశ్వరుని ఆజ్ఞగా భావించి చూస్తాను. మీరు చెప్పినట్లే చేస్తాను.

నాదు పురాకృతంబునగు నాసుకృతంబు ఫలించె నెంచగన్
కా దన, నొక్క మేటిపతకంబును ముద్దుగ రూపు దిద్దెదన్
వేదన బాసెదన్, యిక నివేదన, వే గొని దాన జేసెదన్,
సోదర! సైనికానివహ శోభలు హెచ్చుగ, మూక విచ్చుగన్! (ఉ)

నా పూర్వజన్మలో చేసిన సుకృతము ఫలవంతమైనట్లుగా భావిస్తున్నాను. కాదు అనకుండా, ఒక మేటి పతకమును ముద్దుగా రూపు దిద్దుతాను. నా వేదనను తొలిగించుకుంటాను. ఆ పతకమును త్వరగా తయారుజేసి, దానిని నివేదనగా సైనికులకు సమర్పిస్తాను, సోదరా! సైనికుల శోభలు పెరిగేట్లు, శత్రువులను నాశనం చేసేట్లు చేస్తాను.

భారత వీరసైనికుల ఖండన ఖండన చక్రధారలన్,
పూరిత త్యాగవాహినుల పూసెడి శౌర్యపు గంగపొంగులన్
ప్రేరితమై, రణాంగణము ప్రేంఖణ పూర్ణ త్రివర్ణ కీర్ణమై,
ధారుణి భారతీ జయవిధాన నిధానము గాగ దిద్దెదన్,
కారణమౌ ఋణంబు పతకంబును దీర్చెద, తీర్చి దిద్దెదన్! (ఉ)

యుద్ధములో శత్రువులను ఖండించే భారత వీరులచక్ర ధారలతో, త్యాగవాహినులతో పూసి పారే శౌర్య గంగ పొంగులతో ప్రేరణ పొంది, యుద్ధభూమి చలిస్తున్న భారత దేశపు త్రివర్ణ పతాకపు కాంతులతో నిండిపోయేలా, భూమి మీద భారతి జయ విధానము అనే నిక్షేపము అయ్యేట్లుగా, నాది ఋణము అయ్యి ఉండవచ్చు ఈ భూమికి, అది తీర్చుకోడానికి కారణముగా, నాకు ఋణపడే విధముగా, పతకమును తీర్చి దిద్దుతాను.

నాథు నాజ్ఞ గొందు, నపుడు యారంభింతు,
అడ్డుజెప్ప డింతయైన, గాని,
దేహ మాత్మ లేము, దేహమనుగతమై
ఆత్మ వెలుగు, ప్రేత మౌను లేక! (ఆ.వె.)

నా భర్త యొక్క అనుమతిని తీసుకుని, అప్పుడు ప్రారంభం చేస్తాను పతకాన్ని రూపు దిద్దడం. అతడు ఏ మాత్రమూ నేను అనుకున్నదానికి అడ్డుచెప్పడు కానీ, అతడు దేహము, నేను ఆత్మను, అదీ మా అనుబంధము, అదీ భార్యా భర్తల అనుబంధము. దేహము అనుకూలిస్తేనే, సరిగా నిలిచి ఉంటేనే ఆత్మకు వెలుగు ఉంటుంది. దేహము లేకుంటే ఆత్మ ప్రేతాత్మ అవుతుంది. కనుక అతడితో చెప్పి ప్రారంభిస్తాను.

కలిమలముల హరణములగు
కలుముల నెలవైన కలికి ఘనమగు యురమున్
వెలుగుల కళ లలల నెగయ
వెలసిన జమలాపురీశ వేంకటరాయా! (కం)

కలిదోషములను హరించే సంపదలకు, అంటే, సుగుణములకు నెలవైన శ్రీమహాలక్ష్మి వెలసిన ఘనమైన వక్షస్థలము వెలుగుల కళలు అలల మాదిరి ఎగసివేస్తుండగా వెలసిన జమలాపురీశా! వేంకటేశ్వరా!

నిగమవినుత నిత్యా! నిత్య సత్యప్రకాశా!
అగణిత బహురూపా! ఆదిమధ్యాంతభాసా!
నగధర! మృదుహాసా! నాగతల్పాధివాసా!
సొగసరి జమలాద్రీ శోర్వి సంతాపనాశా! (మాలిని)

వేదములచే వినుతింపబడే శాశ్వతుడా! నిత్యమైన, సత్యమైన ప్రకాశమును కలిగిన పరంజ్యోతీ! లెక్కలేనన్ని రూపాలను ధరించేవాడా, అన్నిరూపములలోనూ నీవై ఉండేవాడా, సృష్టికి మొదట, మధ్యన, చివరలోనూ ఉండేవాడా! అలనాడు మందరపర్వతాన్ని, ఆ తరువాత గోవర్ధనపర్వతాన్ని మోసినవాడా! మృదువైన నవ్వులను కురిపించేవాడా! నాగతల్పము మీద పడుకునేవాడా! శేషశాయీ! సొగసుల జమలాద్రీశా! భూమియొక్క సంతాపాన్ని, పాపులను నాశనం చేసేవాడా!

వ.

యిది సాధ్వీమణి సావిత్రీబాయి ఖనోల్కర్ దివ్యస్మృతికి అంకితముగా, బమ్మెర పోతనాఖ్యు పదపరిచయ పులకిత గాత్రుడను, సజ్జన వేంకటరామరాయ పుత్రుడను,వేంకటేశ్వరరాయ పౌత్రుడను, సాహితీప్రియంభావుకుల ప్రియ మిత్రుడను, వేంకట వరప్రసాదరాయ నామధేయుండను అగు నాచే విరచితమైన 'పరమవీరచక్ర' మను నామంబుగల పద్య గద్య నిహిత నిస్తుల కావ్యమందు పంచమాశ్వాసము.

శ్రీజమలాపురి కల్పక
భూజా! పద్మావతీశ! భువన నిధానా!
రాజిలు వీరకుమారుల
మోజుల గాథల విధములు ముద్దుగ వినుమా! (కం)

శ్రీప్రదమైన జమలాపురములోని కల్పవృక్షమువంటివాడా! పద్మావతీ పతీ! ప్రపంచములకు పెన్నిధివంటివాడా! ప్రకాశించే వీరకుమారుల మనసైన గాథల తీరుతెన్నులు ముద్దుగా వినవయ్యా!

వ.

అవ్విధంబున భారతీయ సైనికవీరులకు వారి ధైర్య శౌర్య పరాక్రమ పురస్కారముగ ఒక నూతన పతకము రూపుదిద్దు బాధ్యత సావిత్రీబాయికి అప్పజెప్పినాడు అప్పటి సైన్యాధికారి హీరాలాల్ అటల్ మహాశయుడు. ఆమె తన మామకు ఆ విషయమును తెలిపి, ఆయన ఆశీస్సులు గొని, పెనిమిటికి తెలిపి అతని అంగీకారమును గొని నూతన పతకమును రూపుదిద్దుటకు ఉద్యుక్తురాలైనది.

అంతట నొక శుభదినమున,
యింతియ ఏకాంతమందు యిద్ధపు మతియై,
అంతర్వీక్షణ గతియై,
అంతర్యామిని గని, యగు యాదేశమునన్ (కం)

అప్పుడు, ఒక మంచిరోజున, ఆస్త్రీ, సావిత్రీబాయి, ఏకాంతములో, పరిశుద్ధమైన మనసుతో, అంతర్వీక్షణా మార్గంలో, ధ్యానంలో అంతర్యామి ఐన శ్రీహరిని దర్శించి, లభించిన ఆదేశముతో.

చక్రికి అంజలించి, రిపుచక్రదురాక్రమణా పరాక్రమన్
శక్రికి, శత్రునక్ర శుభచక్రికి, సక్షమ భారతీక్షమా
చక్రసురక్షణానిపుణసైనికమూర్తికి, శౌర్యకీర్తికిన్,
సక్రమ విక్రమాదరణ సార్థకమౌ పతకంబు దిద్దెడిన్! (ఉ)

చక్రధారి ఐన శ్రీహరికి నమస్కరించి, చక్రాకారంలో చుట్టూ కమ్ముకుని దురాక్రమణ చేసే విధానముగల శత్రువులపాలిట పరాక్రమంలో దేవేంద్రుడికి, మొసళ్ళవంటి శత్రువులపాలిట శుభచక్రమును ధరించినశ్రీహరికి, సక్షముడైన, భారతభూమండల సంరక్షణా నిపుణుడైన సైనికమూర్తికి, ఆతని శౌర్య కీర్తికి, కీర్తింపబడే శౌర్యముగలవాడికి, ఆతడి విక్రమానికి సక్రమమైన ఆదరణ సార్థకమయ్యే పతకాన్ని రూపు దిద్దింది

దేవుల దేవుడై చను దధీచిది త్యాగఫలంబుగా, పురా
దేవుల మస్తకంబులను డెంప, నగంబు సగంబుగా గొనన్
చేవగు వజ్రమున్ రిపుల చెండగ దీనుల కంద దండయౌ
భావము పోహళించి, రసబంధురమౌ పతకంబు దిద్దెడిన్! (ఉ)

దేవులపాలిటి దేవుడై నడయాడిన దధీచి త్యాగఫలంగా, పురాదేవులు, అంటే, దేవతలకన్నా ముందు జన్మించినవారు.అంటే రాక్షసుల తలలను ఖండించడానికి, పర్వతాన్ని సగానికి నరకడానికి చేవ కలిగిన వజ్రాయుధాన్ని స్ఫూర్తిగా తీసుకుని, శత్రువులను చెండాడడానికి, దీనులకు అండదండగా నిలవడానికి సామర్థ్యము కలిగినది అనే భావం స్ఫురణకు వచ్చేలా, వీర, దయారసబంధురమైన పతకాన్ని రూపు దిద్దింది.

నాల్గు దిక్కులందు నాల్గు వజ్రాయుధం
బులను గలుగు నట్లు పోత బోసె
నాల్గు వదనములది నడిమధ్య, సింహంబు
దేశ చిహ్నమద్ది తేజరిల్లె. (ఆ.వె.)

నాలుగువైపులా నాలుగు వజ్రాయుధాలు ఉండేలా పోతపోసింది. మధ్యలో దేశచిహ్నమైన నాలుగుముఖముల సింహం తేజస్సుతో నిలిచింది.

వెనుక వెలసె పరమ వీరచక్ర మనుచు
దేవనాగరినయు తెలియ నాంగ్ల
మందు పలుకులు నడి మధ్యలో కమలము,
పరమవీరచక్ర పతకమయ్యె! (ఆ.వె.)

వెనుకవైపు దేవనాగరి, ఆంగ్లములలో 'పరమవీరచక్రము' అనే పలుకులను నిలిపింది. మధ్యలో కమలమును నిలిపింది. ఆ విధంగా పరమవీరచక్రపతకము తయారయింది.

భారత త్యాగగాథలను, భారతవీరుల శౌర్యధారలన్
ప్రేరితమైనచిహ్నముగ, భీకరసంగరరంగపావనో
దారులు, శత్రుముష్కరవిదారులు, శూరుల కంకితంబుగా,
కారణజన్మురాలు పతకంబును ముద్దుగ తీర్చిదిద్దెడిన్! (ఉ)

దధీచి యొక్క (భారత) త్యాగగాథలు, భారతవీరుల శౌర్యధారలతో ప్రేరణపొందిన చిహ్నంగా, భయంకరమైన యుద్ధరంగంలో పావనమూర్తులు, ఉదారులు, శత్రువుల సమూహాలను వధించేవారు ఐన శూరులకు, సైనికులకు అంకితంగా ఆ కారణజన్మురాలు పతకాన్ని ముద్దుగా తీర్చిదిద్దింది.

ఎన్నడు రిత్తవోనియసి, యెన్నడు బిత్తరవోని మానసం,
బెన్నడు చచ్చిపోనికసి పెల్లుగ, త్రుళ్ళెడి మూక త్రెళ్ళగన్
సన్నుత శౌర్య ధుర్యులగు సైనికులన్నల కంఠసీమలన్
వన్నెల కుల్కుచిల్కు అభివంద్యమునౌ పతకంబు దిద్దెడిన్! (ఉ)

ఎన్నడూ వృధా కాని ఆయుధము, మొండిపోని ఆయుధము, ఎన్నడూ బిత్తరపోని మనసు, ఎన్నడూ చచ్చిపోని కసి హెచ్చు అవుతుండగా మిడిసిపడే శత్రుమూకలను వధించడానికి శక్తికలిగిన, సన్నుతింపబడే శౌర్యము కలిగిన అన్నలు సైనికుల కంఠసీమలలో వన్నెలతో కులుకులను చిలికే పతకాన్ని, నమస్కారానికి అర్హము ఐన పతకాన్ని తీర్చి దిద్దింది.

నాలుగు దిక్కుల యిరవై
నాలుగు గంటలు తడయక నరసింహములై
నేలను గాచెడి గురుతుగ
నాలుగుముఖముల హరి యది నడిమిన వెలసెన్!   **(కం)**

దేశానికి నాలుగు దిక్కులలో, యిరవై నాలుగు గంటలూ ఆగకుండా, జాగులేకుండా ఈ నేలను రక్షించే నరసింహాలైన సైనికులకు గుర్తుగా నాలుగుముఖాల సింహం ఆ పతకానికి మధ్యలో వెలిసింది.

వజ్రకఠోర మనంబును,
వజ్రము దేహమును, నీతి, వజ్రము రీతిన్
వజ్రములవి నలుదిసలన
వజ్రపరమవీరచక్ర పతకం బయ్యెన్!   **(కం)**

వజ్రకఠోరమైన మనసు, వజ్రములాంటి శరీరము, వజ్రములాంటి నీతి, వజ్రములాంటి ఆచరణా విధానము కలిగిన సైనికులకు ప్రతీకలుగా ఆ పతకముమీద నాలుగు దిక్కులలో నాలుగు వజ్రాలు నిలిచాయి. వజ్రంలాంటి పరమవీరచక్రపతకము తయారయింది.

ముట్టిన దంగీకారము
పట్టికి, ప్రభువుల వలనను పతకము కొరకై
పట్టుల తేనియ, మనసుల
చట్టున వ్యధ, పరమవీర చక్రము కథయున్!   **(కం)**

ఆ పతకానికి, ఆ నమూనాకు ప్రభుత్వమునుండి ఆమెకు అంగీకారం లభించింది. ఆ పరమవీరచక్ర కథ పట్టుతేనెలా మధురమైనది. చటుక్కున వ్యధనూ గుర్తుచేస్తుంది, ఆ పతకము పొందినవారి గాథలను, వారు పడిన బాధలను గుర్తుచేసి.

అంతవరకు నున్న ఆంగ్లేయ పతకము
చెల్లిపోయె, దొరలు వెళ్ళిపోవ
వీగిపోయె, తొలగె విక్టోరియాక్రాసు
పరమవీరచక్ర పతకమొచ్చె! (ఆ.వె.)

ఇంగ్లీష్ దొరలు వెళ్లిపోవడంతో అంతవరకూ ఉన్న ఆంగ్లేయప్రభుత్వ పతకము ఐన విక్టోరియా క్రాస్ చెల్లకుండా రద్దయిపోయింది. పరమవీరచక్రపతకము వచ్చింది.

1. ప్రథమ పరమవీరచక్ర పతకము - మేజర్ సోమనాథ్ శర్మ

అట్టిది తొలిదగు పతకము
నట్టుల ధరియించె సోమనాథుడు కీర్తిన్;
ఎట్టుల మరువగనగునవి?
గట్టులు తెగ నతని శౌర్యగంగలు పొంగెన్! (కం)

అటువంటి పరమవీరచక్ర తొలిపతకాన్ని ముందు చెప్పినట్లుగా సోమనాథ్ శర్మ అందుకున్నాడు. అతని శౌర్యగంగలు గట్టులు తెంచుకుని ప్రవహించాయి. ఎలా మరిచిపోతాము అతని ప్రతాపగంగలు? అతని శౌర్యానికి అడ్డులేకుండాపోయింది.

యిచ్చుట చెప్పగా నగును, ఎంత విచిత్రపు నాటకంబులన్
ముచ్చట నాడు నవ్విధియు, ముద్దుల పాత్రల మౌదు మందరున్!
అచ్చుగ ఆమెయల్లునికి అన్నగు నాతడు సోమనాథు, డా
రెచ్చిన వీరుడే తొలి ధరించెను దానిని యామె దిద్దగన్! (ఉ)

యిక్కడ చెప్పటం బాగుంటుంది. ఎంతటి విచిత్రమైన నాటకములను ఆడుతుంది ఆ విధి! మనమందరమూ ఆ నాటకంలో ముద్దుల పాత్రలము అవుతాము. స్వయానా ఆ సావిత్రీబాయి అల్లుడికి అన్నయైన మేజర్ సోమనాథ్ శర్మ, ఆ రెచ్చిన వీరుడే మొదటి సారిగా ఆమె రూపుదిద్దిన పతకాన్ని ధరించాడు.

2. ద్వితీయ పరమవీరచక్ర పతకము - జాదూనాథ్ సింగ్

జాదూనాథను సింగము
ఆ దారుణ ధరణి గూలె ఆనందముగన్,
సోదర! పాకీ రణమున,
మోదపు రెండవ పతకము మురిపెము గొనగన్! (కం)

సోదరా! జాదూనాథ్ సింగ్ అనే సింహము పాకిస్తానుతో జరిగిన యుద్ధములో, ఆనందంగా ఆ దారుణమైన భూమిన కూలి, సంతోషించిన రెండవ పతాకాన్ని స్వీకరించినాడు.

3. తృతీయ పరమవీరచక్ర పతకము - రామ రఘోబా రాణే

రామ రఘోబా రాణే
నాముడు, మూడవ పతకము నౌషేరాలో
పాములు పాకుల రణమున,
ధీ మహి తనయుడు కలబడి, ధీరత గొనియెన్! (కం)

రాం రఘోబా రాణే అనే పేరుగలిగిన వీరభూమిపుత్రుడు పాములవంటి పాకిస్తానువారితో జరిగిన యుద్ధంలో నౌషేరాలో పోరాడి ధీరుడై మూడవ పతకమును అందుకున్నాడు.

4. నాల్గవ పరమవీరచక్ర పతకము - పీరూ సింగ్ షెకావతు

పీరూ సింగు షెకావతు,
వీరుడు, తిత్వాలు నందు విరమణ పొందెన్,
పోరుచు పాకులతో నని,
కారణముగ నాల్గవ పతకంబును గొనియెన్! (కం)

పీరూసింగ్ షెకావత్ అనే వీరుడు పాకిస్తానువారితో యుద్ధంచేస్తూ తిత్వాల్ లో వీరమరణం పొందాడు. ఆ కారణంగా ఆతడు నాలుగవ పరమవీరచక్ర పతకమును పొందాడు.

5. ఐదవ పరమవీరచక్ర పతకము - కరమ్ సింగ్

కర్మయోగి వీర కర్మసింగుకెరలి,
పాకుతోడ నని భళిగ జేసి,
ధీరుడనగ నచట తిత్వాలు నైదవ
పరమ వీర చక్ర వరుడు నయ్యె! (ఆ.వె.)

కర్మయోగి ఐన సైనికవీరుడు కరంసింగ్ ఉత్సాహముతో పాకిస్తాన్ వారితో 'తిత్వాల్'లో మేటిగా యుద్ధం చేసి, ఐదవపరమవీరచక్రపతక వరుడైనాడు.

6. ఆరవ పరమవీరచక్ర పతకము - గుర్ బచన్ సింగ్

కాంగో సంక్షోభపు పో
రాంగణి గురువచనసింగు రాలెను, తా దా
నంగొనె నారవ పతకము,
వింగడమిది, వీరజన్మ విశ్వముకొరకా! (కం)

కాంగో సంక్షోభకారణంగా జరిగిన యుద్ధములో గుర్బచన్ సింగ్ సలేరియా ఆ యుద్ధభూమిలో రాలిపోయాడు. ఆ కారణంగా ఆరవ పరమవీరచక్రపతకాన్ని ఆతడు అందుకున్నాడు. వీరుడి జన్మ సమస్తవిశ్వంకోసం అనేది విశదమేకదా!

7. ఏడవ పరమవీరచక్ర పతకము - ధన్ సింగ్ థాపా

చైనాతో యుద్ధములో
తా నా వీరధనసింగు థాపా పోరెన్,
యేనా డెరుగని పోరది,
ఆనా డేడవ పతకము ఆతని దయ్యెన్! (కం)

చైనాతో జరిగిన యుద్ధములో వీరుడైన ఆ ధన సింగ్ థాపా ఏనాడూ ఎరుగనటువంటి పోరాటం చేశాడు. ఆనాడు, ఆ కారణంగా ఏడవ పరమవీరచక్రపతకము ఆతనికి దక్కింది.

8. ఎనిమిదవ పరమవీరచక్ర పతకము - జోగిందర్ సింగ్

జోగిందరు సింగటు కసి
రేగిందగు కాలనాగు రీతిగ పోరున్
సాగించెను చైనాతో,
యోగం బష్టమ పతకము, యోధుని మృతియున్! (కం)

జోగిందర్ సింగ్ ఆ విధంగా కసిరేగిన కాలనాగులా చైనాతో యుద్ధం జరిపాడు. ఎనిమిదవ పరమవీరచక్రపతకము అతడికి ప్రాప్తించిది, మృత్యువు కూడా!

9. తొమ్మిదవ పరమవీరచక్ర పతకము - సైతాన్ సింగ్

సైతాన్ సింగటు చైనా
భూతాలను వేల గూల్చి భూమిన రాలెన్
పూతాత్ముని దయె పతకము
తా, తాలిమి, తొమ్మిదవది, ధన్యత నొందెన్! (కం)

సైతాన్ సింగ్ ఆ విధంగా చైనా భూతాలను వేలమందిని కూల్చి భూమిన రాలిపోయాడు. ఆ పవిత్రుడికి ప్రేమగా లభించి ఆ తొమ్మిదవ పరమవీరచక్రపతకము ధన్యతను పొందింది!

10. పదవ పరమవీరచక్ర పతకము - అబ్దుల్ హమీద్

అతడు మింటి మంట అబ్దుల్లా మీదన్న,
అరయ వేలనొకడు అట్టి ఘనుడు,
పాకు టాంకు లన్ని పగుల టెంకాయలై,
పట్టె, గిట్టి, పదవ పతక మతడు! (ఆ.వె.)

అబ్దుల్ హమీద్ ఆకాశంలో మంటలాంటి వాడు, అంటే సూర్యుడిలాంటివాడు చూడడానికి, అంటే తేరిపార చూడశక్యం కాని వీరుడు. అటువంటి ఘనుడు వేలలో ఒకడు ఉంటాడు. పాకిస్తాన్ టాంకులు అన్నీ టెంకాయల్లా పగులగొట్టి, తను మరణించి, పదవ పరమవీరచక్రపతకాన్ని అందుకున్నాడు.

11. పదకొండవ పరమవీరచక్రము - అర్ధ శిర్ తారాపూర్

అనల నేత్రు డన్న అర్ధ శిర్ తారపూర్,
పూర్తి శిరము నిచ్చి బూది యయ్యె,
పాకు వారి తోడ పదునుగ పోరాడి
పది యొకటి దతడిది పతక మయ్యె! (ఆ.వె)

అన్న అర్ధ శిర్ తారాపూర్ అగ్నినేత్రుడు, అపర రుద్రుడు, శివుని మూడవకన్ను అగ్ని. పేరు అర్ధశిర్ కానీ, దేశంకోసం పాకిస్తాన్ వారితో పదునుగా పోరాడి, తన పూర్తి శిరసును యిచ్చి, కాలి బూడిదయ్యాడు. పదకొండవ పరమవీరచక్ర పతకము అతడికి లభించింది.

12. పన్నెండవ పరమవీరచక్ర పతకము - ఆల్బర్ట్ ఎక్కా

అతడు చిరుత గండు అల్బర్టు ఎక్కాయు,
బంగ ముక్తి కొరకు పాకుతోడ
పోరి స్వర్గ గతిని పొంది, పన్నెండవ
పరమవీరచక్ర పతక మందె! (ఆ.వె)

ఆల్బర్ట్ ఎక్కా చిరుతగండులాగా అతను కూడా బంగ్లాదేశ్ విముక్తి కొరకు పాకిస్తాన్ తో పోరాడి, వీరస్వర్గాన్ని పొంది పన్నెండవ పరమవీరచక్రపతకాన్ని పొందాడు.

13. పదమూడవ పరమవీరచక్ర పతకము - నిర్మల్జీత్ సింగ్ షెకాన్

నిండు వాయు జోదు నిర్మల జిత సింగు,
వంగ ముక్తి కొరకు వరుదు నొరిగె
పాకు తోడ పోరి, పదమూడవదియైన
పరమవీరచక్ర పతక మందె! (ఆ.వె)

పరిపూర్ణుడైన వీరుడు, వాయుసేనావీరుడు ఐన నిర్మల్జిత్ సింగ్ కూడా బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్ తో పోరాడి మరణించాడు! పదమూడవ పరమవీరచక్రపతకాన్ని పొందాడు.

14. పద్నాలుగవ పరమవీరచక్రపతకము - అరుణ్ ఖేత్ర పాల్

అరుణ ఖేత్ర పాలు అన్న ధరనొరిగె,
వంగ ముక్తి కొరకు వరుదు గూడ
పాకుతోడ పోరి, పద్నాలుగవదియౌ
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె)

బంగ్లాదేశ్ విముక్తికోసం పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో పోరాడి అన్న అరుణ్ ఖేత్రపాల్ కూడా నేలకు ఒరిగాడు. పద్నాలుగవ పరమవీరచక్ర పతకాన్ని పొందాడు.

15. పదిహేనవ పరమవీరచక్రపతకము - హొషియార్ సింగ్

హొషియారుసింగు హొళి రక్తమునాడె,
వంగముక్తికొరకు వరుదు చెలగి
పాకుతోడ పోరి, పదిహేనవదియగు
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

హెూషియార్ సింగ్ రక్తంతో హెూలీ ఆటలాడుకున్నాడు! బంగ్లాదేశ్ విముక్తికోసం పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో ఆ శ్రేష్ఠుడు విజృంభించి పోరాడి పదిహేనవ పరమవీరచక్రపతకాన్ని పొందాడు.

16. పదహారవ పరమవీరచక్రపతకము - బాణా సింగ్

మంచు కొండలందు మగడు బాణాసింగు
పాకు పందల తను పారదోలి
పాతెను మన ధ్వజము, పదహారవదియగు
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

హిమాలయ పర్వతాలలో మగడు బాణాసింగ్ పాకిస్తాన్ పందలను పారద్రోలి మన జెండాను పాతాడు. సియాచిన్ మంచుకొండలలో పాకిస్తాన్ వారి దురాక్రమణను అడ్డుకున్నాడు. పదహారవ పరమవీరచక్ర పతకాన్నిఅందుకున్నాడు.

17. పదిహేడవ పరమవీరచక్రపతకము - రామస్వామి పరమేశ్వరన్

పడెను రామసామి పరమేశ్వరనచట
సింహళంబు నందు, సింహమతడు!
పడెను తమిళ పులుల, పదిహేడవదియగు
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

శ్రీలంకలో తమిళ పులులతో పోరాటంలో వారిచేతిలో అక్కడ పడి పోయాడు రామస్వామి పరమేశ్వరన్. పదిహేడవ పరమవీరచక్ర పతకాన్ని అందుకున్నాడు.

18. పద్దెనిమిదవ పరమవీరచక్రపతకము - మనోజ్ కుమార్ పాండే

అమరుడయ్యె నన్న ఆ మనోజ్ కుమరుడు
కార్గిలుసమరమున కసిగ చెలగి,
బలిగ జేసి తనువు, పదునెనిమిదవది
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

మనోజ్ కుమార్ పాండే కార్గిల్ యుద్ధంలో కసిగా చెలరేగి పోరాటం చేసి, తన తనువును బలిచేసి, పద్దెనిమిదవ పరమవీరచక్రపతకమును పొందాడు.

19. పందొమ్మిదవ పరమవీరచక్రపతకము - యోగేంద్రసింగ్ యాదవ్

యోధ రత్నమైన యోగేంద్ర సిం గటు
కార్గిలుసమరమున కసిగ రేగి,
పంచవదను డట్లు పందొమ్మిదవదగు
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

యోధులలో రత్నమువంటివాడైన యోగేంద్రసింగ్ యాదవ్ ఆ విధంగా ఐదుముఖములు కలిగిన శివునిలా, సింహంలా, కార్గిల్ యుద్ధంలో కసిగా చెలరేగి పందొమ్మిదవ పరమవీరచక్రపతకమును పొందాడు.

20. యిరవయ్యవ పరమవీరచక్రపతకము - సంజయ్ కుమార్

సంజయ కుమరుడన శౌర్య వాహినిగంగ
కార్గిలందు కదన కాలు డయ్యె,
యుద్ధ సింహమట్లు యుక్త మిరువదియౌ
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

సంజయ్ కుమారుడు అంటే శౌర్యవాహిని యైన గంగ. కార్గిల్ యుద్ధంలో శత్రువులపాలిటి మృత్యుదేవతలాగా, యమధర్మరాజులాగా పోరాడాడు. ఆ యుద్ధరంగసింహం సముచితంగా యిరవయ్యవ పరమవీరచక్రపతకమును పొందాడు.

21. యిరవయ్యొకటవ పరమవీరచక్రపతకము - విక్రం బాత్రా

విలయ కారుడట్లు విక్రమ బాత్రాయు
కార్గిలందు చెలగి కడకు నొరిగె
యింతదనుక తుదిది, యిరవయ్యొకటిదగు
పరమవీరచక్ర పతక మొందె! (ఆ.వె.)

ప్రళయకాల రుద్రుడిలా విక్రం బాత్రా కార్గిల్ యుద్ధంలో చెలరేగి చివరకు నేలకొరిగాడు. యింతవరకూ యిచ్చినవాటిలో చివరిదైన, యిరవయ్యొకటవ పరమవీరచక్రపతకమును పొందాడు.

వీరలు ఏకవింశతిక వీరులు, త్యాగపు టేరు, లిమ్మహిన్
ధారలు కన్నకన్నులవ, దారల పుస్తెల సోరు హొూరు గో
దారుల దారులవ్వ, మన ధారుణికై మని రాలినారురా!
వేరలు లేరురా, హృదయవేదిక నిల్పగ, పూజ సల్పగా! (ఉ)

వీరు ఇరవైఒక్కమంది వీరులు. త్యాగపు ఏరులు! ఈ భూమిమీద కన్నీటి ధారలు కన్నవారి కనులవెంట పారగా భార్యల పుస్తెల సోకు హొూరు గోదారి దారులపాలుకాగా, మన దేశంకోసం జీవించి మరణించారురా! హృదయపీఠం (మీద)నెలకొల్పి పూజలు చేయడానికి వేరే ఎవరూ లేరురా!

ఒక్కటి గుర్తెరుంగు! మొక రొక్కరి కొందల ప్రాణముల్ యిలన్
చక్కగ నున్నయట్లు, రిపుచండనయాగపు సృక్స్రువంబులై
చిక్కనిరక్త మాజ్యముగ చిందిరి, శీర్షము లిచ్చి రిచ్ఛలన్,
యిక్కడ యింట నేను, నువు యిమ్ము శుభమ్ముల నుండనే గదా! (ఉ)

ఒక్కటి తెలుసుకో! ఒక్కొక్కరికి చక్కగా వందలకొద్దీ ప్రాణాలు ఉన్నయ్యేమో, ఈ ప్రాణాలు పోతే ఏం యింకా ఉన్నాయికదా అన్నట్లు, శత్రువులను నాశనంచేసే యాగంలో ఆజ్యంపోసే గరిటలలాగా చిక్కని నెత్తురును ఆజ్యంగా చిందించినది, యిష్టపడి తమ తలలను సమర్పించింది యిక్కడ యింటిలో నువ్వూ నేనూ హెచ్చైన శుభములతో హాయిగా ఉండడంకోసమే కదా!

శిరముల విక్రయంబులకు చిత్తములందున వాంఛలెత్తగా
ధరణిని రాలువా రపుడు, దాస్య విముక్తగ అమ్మ యవ్వగన్
వరఫల సుస్వతంత్ర తరువర్ధకు లిద్ధర వీర, లిప్పుడున్
ఒరవడి తల్లిపాలుగొని వొమ్ముల రొమ్ముల గుద్దు తుచ్ఛులా? (చం)

అప్పుడు, భారతమాత ఆంగ్లేయులకు దాస్యంచేస్తున్నపుడు, ఆ అమ్మ దాస్యవిముక్తురాలు కావడంకోసం, తమ తలకాయలను అమ్మడంకోసం మనసులలో కోరికలు రేగి నేలమీద కూలిపోయారు, మరణించారు. వరఫలంగా లభించిన స్వతంత్రము అనే చెట్టును పోషించి పెంచుతున్నవారు యిప్పుడు వీరు, ఈ సైనికవీరులు. యిప్పుడు ఒరవడి తల్లిపాలు తాగి ఆ తల్లిరొమ్మునే గుద్దే తుచ్ఛులా?

అమ్మను తిట్టునట్టి యధమాధమ పుత్రుల రూప శత్రువుల్,
అమ్మల గన్నయమ్మ వెలయాలను జారులు, చోరు లూరలన్
దిమ్మరులౌ ఉలూకముల దిమ్మ దిరుంగగ సొమ్మసిల్లగన్,
అమ్మరొ! నీ స్మృతిన్ తనువు లౌనిక భారతమాత కారతుల్! (ఉ)

అమ్మను, భారతమాతను తిట్టే పుత్రులరూపంలోని శత్రువులు, అమ్మలగన్న అమ్మయిన దుర్గమ్మను వెలయాలు అని తిట్టే జారులు, చోరులు, ఊళ్ళల్లో దిమ్మరులై తిరిగే గుడ్లగూబల దిమ్మతిరిగి సొమ్మసిల్లేట్లుగా, ఓ తల్లీ! సావిత్రీబాయీ! నిన్ను తలచుకుంటూ, నీ స్మృతి ఐన పరమవీరచక్రపతకము కోసం, అంటే అత్యున్నతమైన శౌర్యాన్ని, ధైర్యాన్ని, త్యాగాన్ని చూపడంకోసం మా శరీరాలు భారతమాతకు హారతులవుతాయి!

భారతదేశ మెవ్వరిది? భారతి నమ్మగ నమ్ము వారిదౌ!
భారతి కాదు బానిసల భావము లమ్మను అమ్ము వారి దీ
భారత మందు బుట్టి, యిట పారెడు గంగల నీళ్ళు ద్రావి, ఈ
భారతి నాశమౌ ననగ భారత పుత్రులు ఊరకుందురే? (ఉ)

భారతదేశం ఎవరిది? భారతిని అమ్మగా నమ్మేవారిది. బానిసభావాలతో అమ్మను అమ్మేవారిది కాదు భారతి. ఈదేశంలో పుట్టి, యిక్కడ పారే నీళ్ళను తాగి, ఈ దేశం నాశనం అవుతుంది అంటే భారత పుత్రులు ఊరుకుంటారా? ఊరుకోరు!

భారత దేశ మొక్క టిల భాషలు ధర్మము లెవ్వి యన్ననూ
హారతు లిచ్చి సాదరపు హస్తము సాచిన శాంత మూర్తిరా!
నీ రతి పాకు, చీనలకు, నీల్గిన నీరస రష్యకున్; యిదే
తీ? రది తిండికౌ మొగుడు, తీయన లన్యుల పాటలన్నదౌ! (ఉ)

ఈ భూమిమీద భారతదేశం ఒక్కటే యే భాషలనైనా, యే ధర్మాలనైనా, హారతులిచ్చి సాదర హస్తం సాచిన శాంతమూర్తిరా!నీ ప్రేమ పాకిస్తాను, చైనా, నీల్గి నీరసించిన రష్యాకు! యిదేం తీరు? తిండికి మొగుడు, తీయగా వేరేవారి పాటలు! భళా!

పడినది యప్పుడప్పు డన, పడ్డను లేచెను, లేచు వీచియై!
పడగలు వేల శేషఫణి భారతి, శాత్రవ మూషికంబులున్!
గుడిగొని గుండెలందు వెలుగొందెడి యమ్మను భారతాంబనా
పడగనుజేయ పోరుటలు? పార్థుల గెల్చిరె నీచ కీచకుల్? (చం)

అప్పుడప్పుడు పడ్డది అన్నప్పటికీ మరలా లేచింది, లేస్తుంది కెరటమై! వేయిపడగల ఆదిశేషుడు భారతదేశం, ఆమె శత్రువులు ఎలుకలు! భారత పుత్రుల గుండెల్లో గుడికట్టుకుని, వెలుగొందే అమ్మను, భారతమాతను పడగొట్టడానికా పోరాటం? పాండవులను గెలువగలిగారా నీచులు, కీచకులు?

అమ్మను భారతాంబను దవానలమై గొను చిచ్చులార్చగన్,
చిమ్మెడు యశ్రువాహినుల చెమ్మలు గమ్మర నన్న దమ్ములన్,
అమ్మల, నాన్నలన్, వలపు టాలుల గుండెల బుచ్చి చిచ్చులన్,
పొ మ్మన నవ్వి, పోరులకు పోవు సిపాయిల కంద లందలన్
కమ్మగ సేదదీరు మహి కమ్మునె చీకటి, సూర్య్ర లుండగన్? (ఉ)

భారతమాతను దావానలమై దహించే మంటలను ఆర్పడంకోసం కళ్ళల్లో చిమ్ముతున్న కన్నీటి చెమ్మలు తిరుగుతుండగా, అన్నాతమ్ముళ్ళకు, తల్లిదండ్రులకు, ప్రేమించే భార్యలకు గుండెల్లో మంటలు పెట్టి, యుద్ధానికి వెళ్ళండి అంటే నవ్వుతూ నవ్వుతూ వెళ్ళే సిపాయిల కండల అండలో కమ్మగా సేద దీరే ఈ భూమిని చీకటి కమ్ముకుంటుందా, సూర్యులుండగా?

వ.

త్యాగ, వీర, ధైర్య త్రివేణీ సంగమసమంచితంబగు గాథను తన్మయుండై భావావేశసాగర వీచికల నెగసినట్లు వెలయించిన ఆ సైన్యాధికారియగు నప్పటి బోధకుడు కనులనుండి విద్యుల్లతాకోటిని కురిపించుచు, శ్రోతలను మైమరపించుచు, మురిపించుచు, సందర్భోచితమైన భావప్రకటనా గరిమను వెలయించుచూ, వక్తవ్యాంశమునందు తనయంతరంగము లయించుచూ, అకారాది క్షకారాంత వర్ణప్రపంచవాసినియు, వాగ్విలాసినియునైన అక్షరభారతీవరప్రసాదముగా, సప్తద్వీపవసుంధరారమణీమణీ కనకమణిమయకిరీటదివ్యరత్నమైన, వసుంధరారత్నమైన, జ్ఞాన త్యాగ వీరరత్నములగు పుత్రరత్నగర్వితయైన మాతృకామూర్తీ రత్నమైన, వినయవిద్యాగుణశీలరత్నములైన పుత్రికారత్నస్ఫూర్తియైన నారీమూర్తియైన భారతీకీర్తిని ఉదాత్తానుదాత్తస్వరితకలిత సుస్వర శ్రీస్వర స్వారస్యరసవశ్యమై, శ్రోత్రుమానససందేహ, సంకోచ, సంక్షోభకోటీ వినశ్యమై, యితఃపూర్వమపశ్యమై చనుగతిని,హ్రస్వ, దీర్ఘ ప్లుతగతియుత సుగతిని, ఉచ్చారణాప్రయత్నవిశేషప్రతిభాలబ్ధ బలంబున, అతివేగమూ అతిమందమూగాని మందార మకరందమాధుర్యచందంబున శ్రోతల వీనులవిందగునట్లు, ఆనందకందళిత డెందంబులగునట్లు, సామవిధంబగునట్లు, అలసత్వము నెరుగని సత్సంతానవిధంబగు పలుకులకులుకుల చెలగుచు, హృదయ ప్రేరణాత్మకమగు రీతిని, ఒడలు గగుర్పొడచు విధంబున ఉద్బోధనాత్మకమగు పలుకులనిట్లు పారించసాగెను. తనువులను మరిచిన వీరసైనికవిద్యార్థులు కరతాళధ్వనులు చేయుచూ లయబద్ధముగా వీరరసమయ, అద్భుత రసాస్వద ఆనందతాండవము జేయనారంభించిరి. దుష్ట, నికృష్ట, ముష్కర మూకల చెలియలికట్టలు తెంచుకుని భారతవీరసైనికపరాక్రమసాగరవీచికలు చేయుచున్న ఘోషవలె యిట్లు చెలరేగెను.

త్యాగము, వీరత్వము, ధైర్యము అనే మూడిటి సంగమమైన కథనముగా, తన్మయుడై భావావేశపు అలలను ఎగసినట్లుగా ప్రదర్శించిన ఆ సైన్యాధికారి యైన బోధకుడు, తన కనులనుండి కోటి మెరుపులను కురిపిస్తూ, శ్రోతలను

మైమరపిస్తూ, మురిపిస్తూ, సందర్భోచితమైన భావప్రకటనా సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ, తను చెబుతున్న అంశము నందు తన అంతరంగము లీనమవుతుండగా, 'అ'కారము నుండి 'క్ష'కారము వరకు గల అక్షరముల ప్రపంచమునందు నివసించేది, పలుకులయందు నివసించేది ఐన అక్షరసరస్వతీ వరప్రసాదముగా, ఏడు ద్వీపములు కలిగిన భూదేవి అనే స్త్రీ యొక్క మణులు తాపబడిన బంగారపు కిరీటములోని దివ్యరత్నమువంటి, భూమికి రత్నమువంటి, జ్ఞానములో, త్యాగములో, వీరత్వములో రత్నములవంటివారైన పుత్రరత్నములను కలిగిన రత్నగర్భయైన మాతృమూర్తియైన, రత్నములవంటి వినయము, విద్య, గుణము, శీలములను కలిగిన పుత్రికారత్నములకు స్ఫూర్తియైన స్త్రీ రత్నమైన భారతి కీర్తిని ఉదాత్త, అనుదాత్త, స్వరితములు అనే చక్కని స్వర భేదములతో, శుభకరమైన, చక్కని రుచికరమైన, రస వశ్యమైన, వినేవారి మనసులలోని సందేహములను, సంకోచములను, సంక్షోభములను నాశనము చేసే విధముగా, గతములో చూచి ఎరుగని విధముగా, హ్రస్వగతి, దీర్ఘ గతి, ప్లుత గతి అనే చక్కని గతిలో, విశేషముగా శ్రమించి, సాధనచేసిన ఫలితముగా లభించిన ఉచ్చారణలోని ప్రతిభను బలముగా కలిగినవాడిలా, మరీ వేగముగా కాకుండా, మరీ నిదానముగా కాకుండా, సమానమైన వేగముతో, మందారముల మధురమైన తేనెలలాగా, చెవులకు విందు కలిగేట్లుగా, వినేవారి మనసులలో ఆనందము మొగ్గలు తొడిగేట్లుగా, సామగానము చేస్తున్నట్లుగా, బద్ధకములేని సత్సంతానము అయ్యేట్లుగా, పలుకులతో, కులుకులతో చెలగుతూ, హృదయములకు ప్రేరణకలిగే విధముగా, వినేవారి శరీరములు గగురుపొడిచేవిధముగా, ఉద్బోధ చేస్తున్నట్లుగా, తన పలుకులను యిలా ప్రవాహములా పారించసాగెను. తమ శరీరములను మరచిపోయిన ఆ వీరసైనిక విద్యార్థులు కరతాళధ్వనులు చేస్తూ, లయబద్ధముగా, వీరరస మయమైన, అద్భుతరసాస్పద మైన ఆనందతాండవము చేయడం ప్రారంభించారు. దుష్టులు, నికృష్టులు ఐన శత్రు ముష్కరులు అనే చెలియలికట్టలు తెంచుకుని, భారతవీరసైనికుల పరాక్రమము అనే సముద్రపు అలల ఘోషలాగా, యిలా ధ్వని చెలరేగింది.

(త్రైత్తిరీయోపనిషత్తు లోని నాలుగు భాగాలలో మొదటిది ఐన 'శీక్షావల్లి' రహస్యముగా యిక్కడ సూచింపబడింది. 'శీక్షా' అంటే 'స్వర శాస్త్రం' (Science of Phonetics) ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అనేవి స్వరములోని మూడు భేదాలు. ఉదాత్తము అంటే ఉచ్ఛస్వరముతో చదవడం. అనుదాత్తము అంటే తక్కువ స్వరముతో చదవడం. స్వరితము అంటే అవసరాన్ని బట్టి స్వరమును పెంచి తగ్గించి చదవడం. హ్రస్వము, దీర్ఘము, ఫ్లుతము అనేవి అక్షర మాత్రల భేదాలు, అంటే ఏ అక్షరమును ఎంతసేపు పలకాలి అనే సమయ సూచన, Prosodial Unit of Time. ఉచ్చారణలో శ్రద్ధగా ప్రయత్నము చేయడాన్ని 'బలము' అంటారు. అతి వేగముగా కాకుండా, అతి మందముగా కాకుండా సమానముగా మధ్యస్థముగా పలకడాన్ని 'సామము' అంటారు. అలసత్వము లేకుండా ఉత్సాహముగా పలకడాన్ని 'సంతానము' అంటారు. యివి మంత్రోచ్చారణ లోని పద్ధతులు. ఈ వీర కథలు, ఈ ఉద్బోధనాత్మకమైన పలుకులు ఉపనిషత్తులవంటివి అని చమత్కారము - రచయిత)

శిరముల విక్రయంబులకు చిత్తము లందున వాంఛ లున్న, వా
కరకగు శత్రు ముష్కరుల కండల సత్తువ ఎంత చూచెదన్
మరి పలుకేల రా? దితర మత్తుల రిత్తల దెట్టి పుట్టుకొ?
మరి మరి తేరి చూచెదను మౌనముగా సభనుండు నెవ్వడో!
ధర యిది త్యాగవీరులది, దక్కిన దిచ్చట జన్మ ధన్యమౌ!
జరుగును నీదు చర్చలిక శత్రుమనంబుల, గోష్ఠులందునన్! (చం)

తలలను అమ్ముకోవాలని మనసులో కోరికలున్నాయి! ఆ కరకు శత్రుముష్కరుల కండలలో సత్తువ ఎంతవున్నదో చూస్తాను! మత్తులో మునిగిన వేరేవారు పలుకే పలకడంలేదు ఎందుకు? ఆ వృధా జీవుల పుట్టుక ఎటువంటిదో! సభలో మౌనంగా వుండేవాడు ఎవడో మరలా మరలా తేరిపార చూస్తాను. యిది త్యాగవీరుల భూమి! యిక్కడ జన్మించిన జన్మ ధన్యం! యిక నీ చర్చలు శత్రువుల మనసులలో, వారి గోష్ఠులలో జరుగుతాయి!

సమయము వచ్చినప్పుడిక చాటుట నీకగు శుభ్ర మభ్రమా!
తమియది నెమ్మనంబులది తప్పని యప్పుడు చెప్పుటొప్పగున్
సమసెడి యాశ యొక్కటిటు సంబరమవ్వగ లాగుకొచ్చెడిన్,
గుములిక కాటికాముకులు గుచ్చెడి ముచ్చుల రిచ్చుబుచ్చగన్
తమకముగా శిరంబులను దక్కక నమ్మెడు దప్పి యున్నదే! (చం)

ఓ ఆకాశమా! సమయం వచ్చినపుడు నీకు శుభ్రంగా చెప్పటం జరుగుతుంది! మనసులలో నున్న కోరిక తప్పనిసరైనపుడు చెప్పడం బాగుంటుంది! కడతేరాలనే ఆశ ఒకటి సంబరం కలిగేలా యిటు లాగుకొస్తున్నది! శ్మశానప్రేమికుల గుంపు యిక పొడిచే, బాధించే ముచ్చులను వృధా చేయడం కోసమే! తమకంతో మా తలలను మిగులకుండా అమ్ముకోవాలనే దాహం ఉన్నది!

తా నటు ఆయుధంబు గొని దాడికి శత్రువు పొంచెనచ్చటన్
నే నిట నిండు గుండె గొని నిశ్చలనంబుగ, నిబ్బరంబుగన్
ఔను! వసంత మాడుటిక అచ్చుగ వెచ్చని రక్తధారలన్!
మానసమందు మా తలల మానక నమ్మెడు మత్తు యున్నదే! (ఉ)

అక్కడ శత్రువు ఆవిధంగా ఆయుధాన్ని ధరించి దాడి చేయడానికి పొంచి వున్నాడు తను. యిక్కడ నేను నిండు గుండెతో నిశ్చలంగా, నిబ్బరంగా ఉన్నాను! యిక వెచ్చని రక్తపుధారలతో అచ్చంగా వసంతం ఆడడం జరుగుతుంది! మా మనసులలో మా తలలను మానకుండా అమ్ముకోవాలనే మత్తు వున్నది!

కరముల గ్రాలెనా బలము, ఖండము లవ్వవు విచ్చుకత్తులన్!
శిరములు లేచెనా నిగిడి, చిన్నతనంబుగ వొంగవెన్నడున్!
ఉరమున నిప్పురవ్వలవి ఉద్ధృతమయ్యెను, జ్వాల లయ్యెడిన్!
శిరముల విక్రయంబులకు చిత్తము లందున వాంఛలయ్యెడిన్! (చం)

బాహువులలో బలం వుంటే విచ్చుకత్తులతో కూడా ముక్కలు కావు! తలలు సగర్వంగా లేచాయంటే చిన్నతనంగా వంగవు. గుండెలో నిప్పురవ్వలు ఉద్భూతములై జ్వాలలు అవుతున్నాయి! మా తలలను అమ్ముకోవాలనే కోరికలు మనసులో కలుగుతున్నాయి!

శిరమున మృత్యుకేతనము సిద్ధముగట్లు గృహంబు వీడుటన్
కరమున గుండె నద్దుకుని కాలిక ఘోర రణాంగ వీధులన్
అరుదగు జీవితం బతిథి యౌను, సభాస్థలి మృత్యువయ్యెడిన్!
శిరముల విక్రయంబులకు చిత్తము లందున వాంఛలయ్యెడిన్! (చం)

తలపై మృత్యువు జెండాతో, సిద్ధంగా ఉన్నాము యింటిని వదిలిపెట్టడానికి! చేతులలో గుండెను పట్టుకుని ఘోర యుద్ధ భూమిలో కాలు మోపుతున్నాము! అరుదైన కీర్తివంతమైన జీవితం అతిథి కాబోతున్నది! సభావేదికలో మృత్యువు కాబోతున్నది! మా తలలను అమ్ముకోవాలనే కోరికలు మనసులో కలుగుతున్నాయి!

అచ్చట మారణావనిని మాటికి మాటికి ముష్కరుండనెన్,
యిచ్చట దేహమిచ్చుటకు ఎవ్వని కైనను కోర్కె యున్నదే?
రెచ్చెడి జోరువానలవ, రేగెడి ఘోషలు ముక్తికవ్వగన్,
హెచ్చరి! మూకవిచ్ఛేదము, ఎవ్వరు మమ్ముల నింక నాపగన్?
ముచ్చటగా శిరంబులను ముక్తికి నమ్మెడి వాంఛ లయ్యెడిన్! (ఉ)

అక్కడ మృత్యుభూమిలో మాటిమాటికీ ముష్కరుడు అంటున్నాడు, ఇక్కడ దేహాన్ని యివ్వాలనే కోరిక ఎవరికైనా ఉన్నదా? రెచ్చిపోయే జోరువానలు (తుపాకీ గుండ్లు) కురుస్తున్నాయి! (మాతృభూమి) ముక్తికోసం ఘోషలు చెలరేగుతున్నాయి! హెచ్చుగా ఉన్న శత్రువుల మూకలను నాశనం చేస్తాం! (హెచ్చరిక! శత్రువుల మూకలను నాశనం చేస్తాం!) ముచ్చటగా మా తలలను అమ్ముకోవాలనే కోరికలు కలుగుతున్నాయి!

చేరగరాని దూరమవ చేవయు గల్గిన లక్ష్యమున్నదే?
ధారల వేడి లేనిది వృధా! యది రక్త, మదొక్క దేహమే?
పోరగు నేల నావయును, పూని సరంగుయు నున్నవారధిన్?
తీరగ వాంఛయైనదొక తీరు శిరంబుల నెమ్మి నమ్మగన్,
జోరు, బలంబు నెంతటిదొ జూచెద, హంతక! రార! ర మ్మనన్! (ఉ)

చేరుకోడానికి వీలులేని దూరములో ఉండే శక్తి ఏ లక్ష్యానికైనా ఉన్నదా? వేడి వేడి ధారలు లేనిది రక్తము వృధా! అటువంటి రక్తం ఒక రక్తమా, అటువంటి దేహం ఒక దేహమా? నావ, సరంగు వుంటే యిక సముద్రంతో పోరాటం యేమున్నది? అంతమవ్వాలనే కోరిక ఒక్కతీరుగా కలుగుతున్నది! ఇష్టంగా మా తలలనుఅమ్ముకోవాలనే కోరిక ఒక్కతీరుగా కలుగుతున్నది! హంతకా! నీ జోరు, నీ బలం ఎంతో చూస్తాను రా! రా! అనడానికి ఒక్క తీరుగా కోరిక కలుగుతున్నది!

నీరదనీలగాత్ర! నవనీరజ, మిత్ర, శశాంక నేత్ర! యో
వారిధిపుత్రికానిలయవక్ష! సుపక్ష విహార! శ్రీకరా!
వీరుల గాథ, లీ పరమవీరసుధారసధార నీదు లీ
లా రహి, వేంకటేశ! జమలాపురి వాసుద! నీకు వించితిన్! (ఉ)

వర్షించే మేఘపు నీలిరంగువంటి శరీరపురంగు వున్నవాడా! నూతన పద్మమువంటి కనులను, సూర్యుని చంద్రుని కనులుగా కలిగినవాడా! ఓ లక్ష్మీదేవికి నిలయమ్మైన వక్షస్థలమును కలిగినవాడా! గరుడుడిపై విహరించేవాడా! శుభాన్ని కలిగించేవాడా! వేంకటేశ్వరా! జమలాపురివాసా! వీరుల గాథల ఈ పరమవీరసుధల ధారలు నీ లీలా విశేషంగా కలిగినవి! వీటిని నీకు వినిపించాను!

సంధి విగ్రహకార్య సామర్థ్యమా లేదు,
సింధు నీదు కరుణ చిందు తప్ప
అక్షరంబగు మైత్రి యన్నదీ యిల లేదు,
లక్ష్మీశ నీదయా లవము తప్ప
అంగబలము లేదు, అర్థ బలము లేదు,
అంగజారి తరుణి హరియు దప్ప!
యిటుల నయ్యె నిదియు ఈశ్వరా! నీదయ
నిండె నిట్లు, ఫలము పండె నిట్లు! (సీ)
శ్రీద! వేంకటేశ! శ్రీ జమలాద్రీశ!
జవము నిమ్ము, వీరజయములిమ్ము!
పూర్ణ మాయువిమ్ము! పొందు నీదు చరణ
బంధమిమ్ము! చతుర బంధమిమ్ము! (ఆ.వె.)

వ్యాకరణ సంబంధమైన సంధి, విగ్రహవాక్య సామర్థ్యం లేదు నాకు (వ్యవహార దక్షతకు సంబంధించిన యితరులతో రాజీ పడడం, అడ్డుకో గలగడం అనే సామర్థ్యము లేదు నాకు) నీ కరుణ అనే సముద్రపు చినుకుతప్ప! అక్షర మైత్రి, అక్షరములను చక్కగా కూర్చడం అనే శక్తీ లేదు నాకు యిక్కడ(క్షీణించని, పలుచబడని స్నేహం అన్నది లేదు ఈ భూమి మీద) లక్ష్మీశ నీ దయాలేశం మాత్రమే ఉన్నది నాకు! నాకు అంగబలమూ లేదు, అర్థబలమూ లేదు, మన్మధాంతకుడైనశివుని ఇల్లాలైన జగజ్జనని బలము, శ్రీహరి అనే బలము తప్ప, మిమ్ములనే నా బలంగా నమ్ముకుని ఉన్నాను! ఐశ్వర్యాన్ని ప్రసాదించే శ్రీవేంకటేశ్వరా! జమలాపురివాసా! నాకు శక్తిని ప్రసాదించుము! వీరులకు జయమును ప్రసాదించుము(నా సైనికులకు జయమును ప్రసాదించుము) నాకు పూర్ణాయువును నీ చరణములతో బంధము కలిగినదానిగా ప్రసాదించుము! చక్కని పదబంధాల్ని, సుకవిత్వబంధాన్ని ప్రసాదించుము! చతురులతో, ప్రజ్ఞావంతులతో అనుబంధాన్ని ప్రసాదించుము!

సుతహిత! జమలాద్రీసుక్షమాశ్రీనివాసా!
అతులిత ఫలదాయీ!ఆదిపద్మావతీశా!
నతులిక గొనుమయ్యా, నందవాటీవినోదీ!
మతినిడి గనుమయ్యా, మందహాసోజ్వలాభా! (మాలిని)

నీ సుతులకు హితము చేసేవాడా! జమలాద్రి అనే చక్కని భూమియొక్క సంపదకు నిలయమైనవాడా!జమలాద్రి అనే చక్కని సంపదకు నిలయమైన భూమిని నివాసంగా చేసుకున్నవాడా!

వ.

యిది సాధ్వీమణి సావిత్రీబాయి ఖనోల్కర్ దివ్యస్మృతికి అంకితముగా, బమ్మెర పోతనాఖ్యు పదపరిచయ పులకిత గాత్రుడను, సజ్జన వేంకటరామరాయ పుత్రుడను, వేంకటేశ్వరరాయ పౌత్రుడను, సాహితీప్రియంభావుకుల ప్రియ మిత్రుడను, వేంకట వరప్రసాదరాయ నామధేయుండను అగు నాచే విరచితమైన 'పరమవీరచక్ర'మను నామంబుగల పద్య గద్య నిహిత నిస్తులకావ్యమందు అరవ యాశ్వాసము సకలమూ సంపూర్ణము.

శ్రీరస్తు - జై హింద్ - జై జవాన్

భారత సైనికుల మూడు ఆదర్శ సూత్రాలు

- మాతృదేశ రక్షణ, గౌరవము, క్షేమములకు ప్రథమస్థానము, ఎల్లప్పుడూ, ప్రతిసారీ!
- అనుచరుల గౌరవము, క్షేమము, సుఖములకు ద్వితీయస్థానము!
- వ్యక్తిగత సౌలభ్యము, సుఖము, రక్షణలకు ఆఖరి స్థానము, ఎల్లప్పుడూ, ప్రతిసారీ!

ప్రార్థన!

కోరను దేవకన్నియల కోమలమౌ గళ సీమలందగన్,
కోరను రాగమోహితుల కోర్కుల మాలల బంధమొందగన్,
కోరను రాచపీనుగుల గుండెల పుష్పపు గుచ్ఛమౌటలున్,
కోరను పూజలందునవ గొప్పగ వేల్పుల మస్తకంబులన్,
కోరెద కోర్కెయొక్కటిది, కొద్దిగ దీర్చగదోయి హాయిగా! (ఉ)

వనమాలీ! నను సుమముగ
జనహిత పథముల పరచుము జైహిందనుచున్
మనవీరజవాను లెపుడు
తనువుల నిడ వెడలునెడల, ధన్యతగొనగన్! (కం)

('మాఖన్ లాల్ చతుర్వేది' హిందీ కవితకు నా
పద్యానువాదము - రచయిత)